www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 275

సోమవారం | 20-1-2020 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 2.07 తదుపరి ద్వాదశి; నక్షత్రం: అనూరాధ రా. 11.31 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: తె. 5.10-6.46; దుర్ముహూర్తం: మ. 12.49-1.33, మ. 3.02-3.47; అమృతఘడియలు: మ. 1.11-2.47; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.00 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

నేను అమరావతిని!

దేవతల రాజధానిని నేను!
ఆంధ్రుల రాజధానిగా అవతరించాను!

వందల సంవత్సరాలు తెలుగు వారి పాలనా కేంద్రంగా వెలుగొందినాను! అనేక దాడులు చవి చూశాను. అయినా... నిలదొక్కుకుని వెలుగుతూనే ఉన్నాను! ఇది చరిత్ర! నాది ఘనమైన చరిత్ర! ఆ తర్వాత... అమరావతి అంటే పంచారామ క్షేత్రాల్లో ఒకటి! నా పేరు మహిమో, స్థాన బలమో... ఆంధ్రప్రదేశ్ విభజనతో నాకు మళ్లీ మంచి రోజులొచ్చాయి! నవ్యాంధ్ర నూతన రాజధానికి నాపేరే పెట్టారు. నా పూర్వవైభవానికి ఆధునిక హంగులు అద్దుతూ... అధునాతన నగరంగా పునాదుల నుంచి నిర్మించాలని తలపోశారు. ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పనులు మొదలయ్యాయి. కొన్ని భవనాలు తలలు పైకెత్తాయి. ఆంధ్రులందరి రాజధానిగా మరోమారు వెలుగొందాలని భావించిన నా ఆశలు అంతలోనే తలకిందులవుతున్నాయి. మరికొన్ని గంటలే... నా ఒడిలో నిర్మితమైన, నా బిడ్డలాంటి శాసన సభ వేదికగానే మరణ శాసనం లిఖిస్తున్నారు. విచిత్రమేమిటంటే... 'నన్ను చంపేయండి' అని శాసనసభతోనే చెప్పించడానికి సిద్ధమయ్యారు. 'నన్ను ఇక్కడి నుంచి పంపించండి' అంటూ సచివాలయంతోనే ఘోషణ పత్రాలు రాయిస్తున్నారు. ఇవి... సచివాలయం, శాసన సభల చేత వాటికే లిఖిస్తున్న మరణ శాసనాలు. రాష్ట్రాన్ని పాలించేందుకు, ప్రజలకు మేలు చేసేందుకు అనేక రకాల నిర్ణయాలకు వేదికగా నిలిచిన ఈ వ్యవస్థలు... ఇప్పుడు తమకు తామే మృత్యు గీత రాసుకుంటున్నాయి.

రాష్ట్ర విభజన తర్వాత భాగ్య నగరాన్ని బాధాతప్త హృదయాలతో వదులుకుని వచ్చిన రోజున... నా ఒడిలో నిర్మితమైన సచివాలయమే పాలనకు ఆలంబనగా నిలిచింది. శరవేగపు పరుగుల వలె పనులు పూర్తయ్యాయి. ఆధునిక వసతులతో అబ్బురపరిచేలా నిలిచిన సచివాలయమిది. మన నేల... మన పాలన... మన చట్టాలు! ఇవి మన నేలపై నుంచే జరగాలి! ఈ లక్ష్యంతోనే శాసన సభ, శాసన మండలిని నా ఒడిలో నిర్మించారు. మూడేళ్ల కిందట ఈ చట్ట సభలు ప్రారంభమవుతున్న సుముహూర్తాన నాకోసం భూములిచ్చిన రైతులు, ప్రజల సంతోషానికి అవధుల్లేవు. రాజధానిలో తొలిసారి శాసనసభ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, పాత్రికేయులకు వారే విందు భోజనం ఏర్పాటు చేశారు. ఇప్పుడు... ఇదే శాసనసభను వేదికగా చేసుకుని నాకు మరణ శాసనం లిఖిస్తున్నారు! ఈ సభా వేదికను నామమాత్రంగా మార్చుతున్నారు.

పూర్తిగా రూపుదిద్దుకోకమునుపే నన్ను చూసి దేశం ముచ్చటపడింది. 'అహో... అమరావతి' అని అబ్బురపోయింది. విద్యలకు నిలయంగా మార్చాలన్న ప్రణాళిక రూపుదిద్దుకుంది. రెండు ప్రముఖ విశ్వవిద్యాలయాలు తరలి వచ్చాయి. మరిన్ని చదువుల గుడులూ వచ్చేందుకు సిద్ధమయ్యాయి. నా ఒడిలోనే రాష్ట్ర సమున్నత న్యాయ వేదిక బహు చక్కగా నిర్మితమైంది. 'ఇది న్యాయ నగరంగా అభివృద్ధి చెందుతుంది' అని నాటి దేశ ప్రధాన న్యాయమూర్తి స్వయంగా చెప్పారు. నేడు ఈ న్యాయ వేదిక కూడా మూడుగా మారుతోంది. ఇప్పుడున్న ప్రధాన న్యాయస్థానం చిన్న శాఖగా మిగలనుంది.

మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులు, చివరికి నాలుగో తరగతి సిబ్బంది కోసం చకచకా మొదలైన నిర్మాణాలు ఇక ఏమవుతాయో! సచివాలయ శిఖరాలు, సమున్నతమైన న్యాయ స్థానం, అచ్చెరువొందించే శాసనసభలకు వేసుకున్న పునాదులన్నీ... ఇక సమాధులను తలపిస్తాయేమో! రాష్ట్ర ప్రజల మనోభావాలన్నీ నాతో ముడిపడడం నాకు గుర్తుంది. విభజనతో జరిగిన నష్టం, అవమానాలను దిగమింగి... సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించుకోవాలన్న ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష నన్ను కదిలించింది. చరిత్రలో రణాలకు... నేటి చరిత్రలో రాజకీయ రణతంత్రాలకూ నేను మౌన సాక్షిని! నాడు... వందల ఏళ్లు వెలుగొందాను. నేడు మూడేళ్లకే మరుగైపోతున్నాను. నన్ను నిలబెట్టినా... పడగొట్టినా ఆ ఘనత మాత్రం మీదే!

-మీ అమరావతి

● కన్నీరు కదిలిస్తుందా..

'అమరావతిని కాపాడుకునేందుకు ప్రాణాలైనా అర్పిస్తాం' అని నినదిస్తూ కొందరు యువకులు రాజధాని పరిధిలో నిర్మితమైన ఉద్యోగుల క్వార్టర్లపైకి ఎక్కారు. భూములిచ్చి భంగపడ్డాం అంటూ వారి కుటుంబ సభ్యులు ఇలా కన్నీరు మున్నీరయ్యారు.

● మొక్కు ఫలిస్తుందా...

'దయచూపు దుర్గమ్మా... పాలకుల మనసు మార్చు మాయమ్మా!' అంటూ రాజధాని ప్రాంత మహిళలు బెజవాడ కనకదుర్గకు మొక్కులు చెల్లించుకున్నారు. తమ గ్రామాల నుంచి చెప్పుల్లేకుండా కాలి నడకన ఇంద్రకీలాద్రికి తరలి వచ్చారు.

● జనఘోష వినిపిస్తుందా...

అభివృద్ధి వికేంద్రీకరణ కావాలా... పాలన వికేంద్రీకరణ జరగాలా? అంటూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఆదివారం ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. 3409 మంది అమరావతికి జై కొట్టగా... మూడు రాజధానులకు 37 ఓట్లు మాత్రమే పడ్డాయి.

నేడే సభ.. సమరం!

ముట్టడి పిలుపు.. బలగాల మోహరింపు

- 'మూడు'పై ఆమోద ముద్రకు సర్కారు సై
- 9 గంటలకు కేబినెట్.. 11కు అసెంబ్లీ
- అనుకున్నది జరగాలని ప్రభుత్వ పట్టుదల
- సభా పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ
- రేపు శాసన మండలికి చేరనున్న బిల్లులు
- ప్రతిఘటించేందుకు సిద్ధమైన ప్రతిపక్షం
- నేడు అసెంబ్లీ ముట్టడికి జేఏసీ పిలుపు
- రాజధాని గ్రామాల్లో అడుగుకో పోలీస్
- అసెంబ్లీ చుట్టూనే వెయ్యి మందికి పైగా
- రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతల నిర్బంధం
- ఇల్లు కదలకుండా వారికి నోటీసులు

అమరావతికి 'అంతిమ ఘడియలు' సమీపించాయి! నిరసనల నినాదాలు మిన్నంటుతున్నాయి! పోలీసుల పద ఘట్టనలు ప్రతిధ్వనిస్తున్నాయి! అసెంబ్లీ ముట్టడికి నిరసనకారులు, విపక్షాల పిలుపు! 'కట్టడి'కి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు! రాష్ట్రవ్యాప్తంగా విపక్ష నేతల గృహ నిర్బంధాలు, నోటీసులు! ఇక రాజధాని గ్రామాల్లో అడుగుకో పోలీస్! 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌తో ఎవ్వరూ ఇల్లు కదలకుండా కట్టుదిట్టం! అటెన్షన్..... అమరావతిలో, రాజధాని అమరావతి అంశంపై హైటెన్షన్!

'అమరావతి' చుట్టూ హైటెన్షన్

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

'మనకు మూడు రాజధానులు ఉండొచ్చు. విశాఖ పరిపాలనా రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, అమరావతి శాసన రాజధానిగా మారొచ్చు' అని గత నెల 17వ తేదీన ముఖ్యమంత్రి జగన్ చెప్పిన మాటను 'శాసనం'గా మార్చేందుకు రంగం సిద్ధమైంది. సర్కారు పెద్దలు అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే... సోమవారం శాసనసభలో అమరావతికి 'డెత్ వారెంట్' జారీ కావడం తథ్యం! పరిపాలనను విశాఖకు తరలించేందుకు ఎప్పుడో మొదలైన ప్రయత్నాలు... ఇక సాధికారికంగా, లాంఛనంగా ముందుకు సాగుతాయి. హైకోర్టు కర్నూలుకు తరలిపోతుంది. విశాఖ, అమరావతిలో హైకోర్టు ధర్మాసనాలు ఏర్పాటవుతాయి. అమరావతిలో శీతాకాల, వర్షాకాల

మిగతా 11వ పేజీలో...

అసెంబ్లీ వద్ద మోహరించిన పోలీసులు

ఒకటే మాట

ఒక రాష్ట్రం.. ఒకే రాజధాని!
అసెంబ్లీలో టీడీపీ వాదన ఇదే!

- ప్రాంతాలకు అతీతంగా ఒకటే వాణి
- రాజధాని మార్పునకు జోన్ల ముసుగు
- కోర్టుల భయంతోనే దొడ్డిదారులు
- అన్నిప్రాంతాల అభివృద్ధి వద్దన్నదెవరు?
- కడప జిల్లాకు 46 వేల కోట్లిచ్చారు
- ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎందుకివ్వలేదు?
- అసెంబ్లీలో ఏం జరుగుతుందో చూద్దాం
- దాని ఆధారంగా మండలిలో వ్యూహం
- తెలుగుదేశం శాసనసభాపక్షం నిర్ణయం

అసెంబ్లీ ముట్టడి నేరం

చట్టానికి లోబడే నిరసనలు: స్పీకర్

3 మీదే ఉండాలి

- మనోళ్లంతా అదే మాట్లాడాలి!
- అన్నిప్రాంతాలూ స్వాగతిస్తున్నట్లు చెప్పాలి
- ముఖ్య నేతలకు జగన్ నిర్దేశం

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని మార్పుపై ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని ప్రాంతాల వాళ్లూ స్వాగతిస్తున్నట్లుగా వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభలో మాట్లాడేలా చూడాలని పార్టీ ముఖ్య నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచించారు. ఆదివారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. అమరావతి నుంచి సచివాలయం, హైకోర్టు తరలింపునకు అన్ని ప్రాంతాల వైసీపీ ఎమ్మెల్యేలనూ చర్చలో భాగస్వాములను చేయాలని.. తద్వారా రాష్ట్ర గొంతుకను వినిపించినట్లు అవుతుందని జగన్ పేర్కొన్నట్లు తెలిసింది. రాజధాని మార్పును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు అసెంబ్లీ ముట్టడికి పిలుపిచ్చిన నేపథ్యంలో

మిగతా 11వ పేజీలో...

మనదే సిరీస్

12

మూడో వన్డేలో ఆసీస్ చిత్తు

రోహిత్ శర్మ సెంచరీ

పారాహుషార్!

- విశాఖలో మావోయిస్టుల ముప్పు ఎక్కువ
- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలనూ చంపేశారు
- భారత్‌లో తీవ్రంగానే నక్సల్స్ ప్రభావం
- ఆందోళన కలిగించే స్థాయిలో ప్రాణనష్టం
- ఫలితమివ్వని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- అమెరికా సాయమూ కోరుతున్న భారత్
- మంత్రుల స్థాయి చర్చల్లోనూ ప్రస్తావన
- వెలుగులోకి అమెరికా నివేదికలు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిని విశాఖకు తరలిస్తున్న తరుణంలో ఆ ప్రాంతానికి మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉందంటూ అమెరికా రూపొందించిన నివేదికలు వెలుగులోకి వచ్చాయి. 'యావత్ భారతదేశానికి మావోయిస్టుల ముప్పు పొంచి ఉంది. అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకించి వెలకట్టలేని ఖనిజ నిక్షేపాలున్న అటవీప్రాంతాలున్నచోట వారి బలం చాలా ఎక్కువగా ఉంది. మైనింగ్ జరిపేందుకు ప్రభుత్వాలు, అడ్డుకునేందుకు గిరిజనులు, మావోయిస్టులు నిరంతర యుద్ధం చేస్తున్నారు. దీని ప్రభావం ఏపీలోనూ ఉంది' అంటూ

మిగతా 2వ పేజీలో...

ఇంకో లడ్డూ కావాలా.. రూ.50

2

శ్రీవారి లడ్డూ రాయితీకి స్వస్తి.. ప్రతి భక్తునికీ ఒక లడ్డూ ఉచితం

పరంజ్యోతి

వార్ధక్యము సహజ వయోధర్మము

యథాగారం దృఢ స్థూణం జీర్ణం భూత్వావసీదతి।
తథైవ సీదంతి నరా జరా మృత్యు వశం గతాః॥

"అత్యంత దృఢమైన స్తంభాలతో నిర్మించిన ఎంతటి పటిష్ఠమైన భవనమైనా సరే, కాలాంతరంలో క్రమంగా శిథిలమై పడిపోవుట సహజం. అలాగే మానవులు సైతం క్రమంగా ముసలి వారై, ఏదో ఒక రోజు మరణించడం సహజం" అంటూ శ్రీరామచంద్రమూర్తి తన సోదరుడైన భరతునితో చెప్పిన మాటలు సార్వకాలిక సత్యాలు.

తండ్రి ఆజ్ఞానుసారం వనవాసానికి వెళ్లిన రామచంద్రుని తిరిగి అయోధ్యకు తీసుకురావాలన్న కోరికతో బయల్దేరి వెళ్లిన భరతుడు రాముడి దర్శనం కాగానే అతనిస్థితికి మిక్కిలి దుఃఖంతో బాధపడతాడు. తమ్ముని ఓదారుస్తూ రాముడు అనేక విధాలా శారీరక ధర్మం గురించి, ప్రకృతి సహజమైన వార్ధక్యం, తద్వారా వచ్చే అన్ని ఇబ్బందులు కూడా వయోధర్మంలో భాగమేనని విపులంగా బోధించాడు.

అంతేకాదు వయస్సనేది తిరిగిరానిదని, ఒకసారి సముద్రాన్ని చేరిన నదీ జలాలు తిరిగి వెనక్కి రానట్లే వయస్సు కూడా తరిగిపోయిన పిదప తిరిగి రాదని రాముడు చెప్పాడు. వనవాసంలో వచ్చే ఏ కష్టాలనైనా ఎదిరించి అనుభవిస్తానే తప్ప తండ్రి మాటను జవదాటి తిరిగి అయోధ్యకు రాలేనని భరతునికి రాముడు వివరించాడు. ఇచ్చిన మాటలకు ఎప్పటికీ కట్టుబడి ఉండాలని, ఈ శరీరాన్ని సుఖపెట్టాలనో, కొద్ది కాలపు సౌభాగ్యం అనుభవించాలనో తాపత్రయపడరాదని చెబుతూ రాబోయే ముసలితనాన్ని గురించి తప్పించుకోవాలన్న ఆలోచన కాని, దాన్ని అడ్డుకునే ప్రయత్నం కాని విఫలమని రాముడు బోధించాడు.

వాల్మీకి మహర్షి రామ కథలో సందర్భోచితంగా అనేక మానవ ధర్మాలను, నైతిక బాధ్యతలను చెబుతూ శ్రీరాముని ఆలోచనలుగా అనేకానేక శాశ్వతసత్యాలను పేర్కొన్నాడు. అవి సమాజహితాన్ని కాంక్షించే ప్రతి వ్యక్తికీ అత్యవసర ధర్మాలుగా నిలుస్తాయి. పైగా ప్రతి మనిషి ఆత్మోద్ధరణ చేసుకోగలిగే మార్గంలో అడుగడుగునా ఉపయోగపడతాయి. ప్రకృతిలో ప్రధానమైన సూర్యోదయ, సూర్యాస్తమయ కారణంగా తమ ఆయువులో ఒక రోజు తగ్గిపోయిందని భావించరు. ఆ విషయాన్నే రామ ముఖంగా మహర్షి

నందంత్యుచిత ఆదిత్యే నందంత్యస్తమితే రవౌ
ఆత్మనో నావబుద్ధ్యంతే మనుష్యా జీవితక్షయమ్

అన్నారు. జనులు సూర్యోదయం కాగానే ధనార్జన సమయమైందని, సూర్యాస్తమయం కాగానే తమ కామోపభోగాలకు అనుకూల సమయం వచ్చిందని పొంగిపోతుంటారు. కాని తమ ఆయువులో ఒక రోజు తగ్గిందని మాత్రం ఆలోచించరు. ఏదైనా వయసు తరుగుతున్న విషయాన్ని సైతం గమనించి వయోధర్మాన్ని నిర్వహించాలన్న బోధ ఇక్కడ కనిపిస్తుంది. ఇదీ మహర్షి సందేశం.

- గన్నమరాజు గిరిజా మనోహరబాబు

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
గుంటూరు	17.8	31.2
విశాఖపట్నం	18.6	29.4
అనంతపురం	19.9	30.3
కర్నూలు	21.7	33.2
విజయవాడ	22.4	30.4
నెల్లూరు	23.7	32.0
హైదరాబాద్	19.7	31.7

తేలికపాటి జల్లులు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాల్దీవులు... వాటి పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో వీచిన గాలులతో ఆదివారం దక్షిణకోస్తాలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా రాష్ట్రంలో పలుచోట్ల మంచు కురిసింది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో మంచు ప్రభావం ఉదయం పది గంటల వరకు కొనసాగింది. మంచుతో పాటు చలి వాతావరణం నెలకొంది. పగటిపూట ఎండ తీవ్రత స్వల్పంగా పెరిగింది.

వందేమాతరం పాడకుంటే.. భారత్‌లో ఉండే అర్హత లేదు

వందేమాతరం పఠించేందుకు ఇష్టపడని వారికి భారత్‌లో ఉండే అర్హత లేదు. దేశ విభజన యొక్క పాపానికి ప్రాయశ్చిత్తంగానే పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లిమేతర వ్యక్తులకు సీఏఏ కింద భారత పౌరసత్వం ఇస్తున్నాం.

- ప్రతాప్ చంద్ర సారంగి, కేంద్ర మంత్రి

వైవిధ్యంలో ఐక్యతను కోరుకునేదే హిందుత్వ

వైవిధ్యంలోనూ ఐక్యతను కోరుకునే గొప్ప పూర్వీకుల వారసులం మనం. అదే హిందూత్వ. ఈ దేశం 130 కోట్ల హిందువులదే అని ఆర్ఎస్ఎస్ అంటోంది. అంటే ఎవరి మతాన్ని, కులాన్ని, భాషను మారుస్తామని కాదు. భారత రాజ్యాంగమే దేశానికి ఏకైక అధికార కేంద్రం.

- మోహన్ భాగవత్, ఆర్ఎస్ఎస్ చీఫ్

ఫ్లూ వ్యాప్తిని పసిగట్టే 'ఫిట్‌బిట్'

లాస్ ఏంజెలిస్, జనవరి 19 : మీరు ఫొటోలో చూస్తున్నది మామూలు చేతి గడియారం కాదు.. ఫిట్‌బిట్!! ఇది సమయం, తేదీని చూపించడంతో పాటు మరెన్నో పనులను ఏకకాలంలో చేస్తుంది. మనం రోజూ ఎంత దూరం నడుస్తున్నాం.. ఎన్ని అడుగులు వేస్తున్నాం.. గుండె కొట్టుకునే రేటు ఎంత ఉంది.. ఎంతసేపు నిద్రపోతున్నాం అనే వివరాలన్నీ నమోదు చేస్తుంది. వీటికి అదనంగా.. దీన్ని చేతికి ధరించే వారిలో ఫ్లూ జ్వరం లక్షణాలను ముందే గుర్తించి, అప్రమత్తం చేయవచ్చని అమెరికాలోని స్క్రిప్స్ రిసెర్చ్ ట్రాన్స్‌లేషనల్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు అంటున్నారు. అమెరికాలోని ఐదు రాష్ట్రాల్లో ఉన్న 47,249 మంది వినియోగదారుల ఆరోగ్య సమాచారాన్ని రెండేళ్లపాటు 'ఫిట్‌బిట్' కంపెనీ విశ్లేషించింది. ఆ వివరాలను అమెరికా వ్యాధుల నియంత్రణ సంస్థ నివేదికలతో పోల్చి చూడగా.. ఫ్లూ జ్వరాల వ్యాప్తిపై రెండూ దాదాపు ఒకే విధమైన అంచనాకు వచ్చినట్లు వెల్లడైంది.

బహుమతికి.. నిద్ర తోడైతేనే అత్యుత్తమ ఫలితం!

న్యూయార్క్, జనవరి 19 : ఓ ఉద్యోగి పనితీరు మెరుగుపర్చడానికి 'బహుమతి'.. 'ప్రశంస' ఎంత ముఖ్యమో.. నిద్ర కూడా అంతే ముఖ్యమని అమెరికాలోని బ్రౌన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. అధ్యయనంలో భాగంగా ఎంపిక చేసిన కొంతమందికి ఓ పనిని అప్పగించారు. అది చేసే క్రమంలో నీళ్లు కానీ ఆహారం కానీ అడగకూడదనే నిబంధన పెట్టారు. కేటాయించిన పనిని పూర్తి చేసిన వారందరికీ చివర్లో తాగేందుకు కొన్ని నీళ్లు ఇచ్చారు. వారిలో కొంతమందికి మళ్లీ అదే పనిని అప్పగించగా, ఇంకొందరికి కాసేపు నిద్రపోయే అవకాశం కల్పించారు. వెంటనే పనిలోకి దిగిన వారికంటే.. నిద్రించి వచ్చినవారే మంచి ఫలితాలు సాధించినట్లు గుర్తించారు.

ఐదు కిలోమీటర్ల లోపే మట్టి తరలింపు

- అంతకుమించిన దూరానికి అనుమతి తప్పనిసరి
- రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మార్గదర్శకాలు
- 'ఉపాధి' కింద 25 లక్షల ఇళ్ల స్థలాల చదును

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద 25 లక్షల ఇళ్ల స్థలాలు చదును చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. చదును చేయాల్సిన ప్రతి ప్లాట్‌లో ఏమేరకు చదును చేయాలనే విషయంలో ముందస్తు కొలతలు తీయాలని పేర్కొంది. ఎకరాకు 4 వేల క్యూబిక్ మీటర్లు మట్టి తరలించేలా అంచనాలు ఉండాలని, అంతకంటే ఎక్కువ అవసరమైతే ముందుగా కమిషనరేట్ అనుమతి తీసుకోవాలి.

చదునుకు వీలు కాకుండా రాళ్లు, కొండలుంటే అలాంటి పనులు చేపట్టవద్దని ఆదేశించారు. పనులకు చెక్ మెజర్‌మెంట్ ఆయా కలెక్టర్ల అనుమతితో ఆయా ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, పంచాయతీరాజ్/ఆర్‌డబ్ల్యూఎస్/హౌసింగ్/ఏ ఇతర ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన వారైనా చేపట్టాలన్నారు. గ్రావెల్‌ను 5 కి.మీ. లోపు దూరం నుంచి మాత్రమే తరలించాలని, అంతకంటే ఎక్కువ దూరానికి కమిషనరేట్ అనుమతి తీసుకోవాలన్నారు. ఏవైనా తేడాలొస్తే నాణ్యతా నియంత్రణ బృందం ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. 25 శాతం చెల్లింపులు నిలిపేసి, నాణ్యతా నియంత్రణ బృందం తనిఖీలు పూర్తయిన తర్వాత చెల్లించాలని పేర్కొన్నారు.

ఇక నైపుణ్యేతర పనుల కింద బిల్లులు..

ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు అవెన్యూ ప్లాంటేషన్ కింద చేపడుతున్న మొక్కలకు ట్రీగార్డ్ బిల్లులను మెటీరియల్ కాంపోనెంట్ కింద చెల్లించేవారు. ట్రీగార్డులన్నీ అందుబాటులో ఉన్న కంపతో ఏర్పాటు చేస్తున్నందున ఈ పనులకు ఇక నైపుణ్యేతర పనుల కింద బిల్లులు చెల్లించాలని సూచించారు. ఇప్పటి వరకు ట్రీగార్డు కోసం ఇస్తున్న రూ.79ను రూ.100కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు చెల్లింపులు చేపట్టాలని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు.

ఇంకో లడ్డూ కావాలా

రూ. 50

- అమల్లోకి వచ్చిన కొత్త విధానం
- ప్రతి భక్తునికీ ఒక లడ్డూ ఉచితం
- అదనం ఎన్నయినా.. ఒక్కొక్కటీ రూ.50

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు అత్యంత ప్రియమైన లడ్డూ ప్రసాదంపై టీటీడీ ఇస్తున్న రాయితీ నిలిచిపోయింది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి రాయితీ నిలిపివేత అమల్లోకి వచ్చింది. దీంతో ప్రతి భక్తుడికీ ఒక లడ్డూను ఉచితంగా ఇస్తూ, అదనంగా కావాలనుకునే వారికి ఒక్కొక్క లడ్డూను రూ.50కి విక్రయిస్తున్నారు. లడ్డూ రాయితీ రద్దుపై భక్తుల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా 'నష్ట నివారణ చర్య' పేరుతో టీటీడీ తన నిర్ణయం మేరకే ముందుకు సాగింది. నూతన విధానం 20 తేదీ నుంచి అమలవుతుందని గతంలోనే టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి పరిమితి లేకుండా భక్తులు కోరినన్ని లడ్డూలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే, ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ వరకు విడుదల చేసిన ఆర్జిత సేవలు, రూ.300 టికెట్లపై మాత్రం ఇప్పుడున్న రాయితీ విధానంలోనే లడ్డూలు ఇస్తారు. మే నుంచి ఆన్‌లైన్ కోటాలోనూ కొత్త విధానాన్ని అమలు చేస్తారు. టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, సోమవారం నుంచి ఉచిత లడ్డూ పథకం.. ఆర్జిత సేవలు, రూ.300 టికెట్లు, శ్రీవాణిట్రస్టు, వీఐపీ, వారపుసేవలు తదితర అన్ని విధానాల్లో దర్శనం చేసుకున్న భక్తులందరికీ వర్తిస్తుందని తెలిపారు. ప్రస్తుతం కొండకు నడిచి వచ్చే 20 వేల మంది భక్తులకు మాత్రమే రూ.40 విలువ చేసే 175 గ్రాముల లడ్డూను ఉచితంగా ఇస్తున్నామని, ఇక, నుంచి అందరికీ ఒక లడ్డూ ఉచితంగా ఇస్తామని చెప్పారు. అదనపు లడ్డూల విక్రయానికి ప్రత్యేకంగా 12 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, ప్రస్తుతం సిఫారసు లేఖలపై శ్రీవారి ఆలయం లోపల వగపడి కౌంటర్‌లో మాత్రమే విక్రయిస్తున్న పెద్దలడ్డూలు, వడల విక్రయాలను కూడా సోమవారం నుంచి బయట లడ్డూ వితరణ శాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ అధికారుల అనుమతితో సిఫారసులపైనే వీటిని ఆలయం బయట 44వ నంబరు కౌంటర్‌లో విక్రయిస్తామన్నారు.

లడ్డూ కౌంటర్లలో ఏర్పాటు చేసిన బోర్డులు

అణు క్షిపణి ప్రయోగం సక్సెస్

- జలాంతర్గామి నుంచి ఖండాంతర కె-4 ప్రయోగం
- సత్తా చాటిన భారత్

న్యూఢిల్లీ, జనవరి 19: భారత జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్ నుంచి ప్రయోగించగల అణు క్షిపణి కే-4ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. డీఆర్డీవో పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని అభివృద్ధి చేసింది. ఇది 2 టన్నుల బరువు ఉన్న అణ్వాయుధాలను మోసుకెళ్లగలదు. క్షిపణి ప్రయోగ పరీక్షను ఏపీలో బంగాళాఖాతం తీరంలో నిర్వహించారు. తాజా ప్రయోగంతో ఆకాశం, నేల, నీరు.. ఈ మూడింటి నుంచి అణ్వాస్త్రాలను ప్రయోగించే సామర్థ్యం గల ఆరో దేశంగా భారత్ నిలిచింది. కాగా, ఈ క్షిపణికి ఆధునిక వర్షన్ కే-5ని 5వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా అభివృద్ధి చేస్తున్నామని డీఆర్డీవో తెలిపింది.

కన్నతల్లి కళ్లెదుటే ఘోరం!

- రైలు ఢీకొని కుమారుడు మృతి
- వలస వెళ్లి తిరిగొస్తుండగా విషాదం

శివ శరణ (ఫైల్)

మంత్రాలయం, జనవరి 19: పొట్టకూటి కోసం వలస వెళ్లిన తల్లీకొడుకులు.. కొంత సొమ్ము కూడబెట్టుకున్నాక ఇల్లు కట్టుకోవాలని సొంతూరికి బయల్దేరారు. కొద్దిసేపట్లో ఊరికి చేరుకుంటారనగా.. మృత్యువై దూసుకొచ్చిన రైలుబండి కళ్లెదుటే కొడుకు ప్రాణాలు హరించడంతో ఇప్పుడా తల్లి గుండెలవిసేలా రోదిస్తోంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా కోసిగి మండలం సాతనూరుకి చెందిన లక్ష్మి కుమారుడు శివ శరణ(19)తో కలిసి కొన్నాళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లింది. అక్కడ ఇద్దరూ కూలిపనులు చేస్తూ కొంత సొమ్ము దాచుకున్నారు. ఇక ఊరెళ్లి ఇల్లు కట్టుకోవాలని అనుకున్నారు. ఇద్దరూ బెంగళూరు నుంచి శనివారం రాత్రి రైలులో ఊరుకి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో దిగి గ్రామంలోకి వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా డిల్లీ నుంచి బెంగళూరు వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ శివను ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. లక్ష్మి అప్పటికే పట్టాలు దాటడంతో ప్రాణాలతో బయట పడింది.

బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యలే

- బిల్డింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ సంఘం హెచ్చరిక

విజయవాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ప్రభుత్వ బిల్డింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. 15 నెలలుగా ప్రభుత్వం ఎలాంటి చెల్లింపులూ చేయలేదని తెలిపింది. విజయవాడలో సంఘ అధికార ప్రతినిధి అవుతు శ్రీనివాసరెడ్డి ఆదివారం మాట్లాడుతూ, గత ఐదు నెలలుగా బిల్లులను పూర్తిగా నిలిపివేశారన్నారు. 25శాతంలోపు పనులు పూర్తయిన నిర్మాణాలను ఆపాలని గత మే 29న ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, దానిపై ఇంత వరకు స్పష్టత రాలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అమలైన ఉచిత ఇసుక సమయంలో తాము పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇసుకకు ధరను నిర్ణయించిందన్నారు. దీనికి తగినట్టుగా అంచనాలను సవరించాలని కోరారు. ప్రభుత్వ భవన నిర్మాణ కాంట్రాక్టర్ల సమస్యలపై చర్చించడానికి అధికారులు, మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో పర్సంటైల్‌లో కేకేఆర్ హ్యాపీ వేలీ స్కూల్ విద్యార్థుల సంచలనం!

- 17మందికి 99 %, 68మందికి 85% పైగా పర్సంటైల్
- శిక్షణ పొందిన విద్యార్థుల్లో 66.6శాతం సక్సెస్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పర్సంటైల్ ఫలితాల్లో డా.కేకేఆర్ హ్యాపీవేలీ స్కూల్‌కు చెందిన ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులు జాతీయ స్థాయిలో సంచలన ఫలితాలు సాధించారు. ఈ స్కూల్లో ఐఐటీ కోచింగ్ తీసుకున్న రెండవ బ్యాచ్ విద్యార్థుల్లో ఎన్.ఎం కుశాల్ 99.88, ఎన్. వెంకట కీర్తన్ 99.86, పీ. కుశ్వంత్ 99.79, పి. శ్రీ పృథ్వీ రాజ్ 99.74 పర్సంటైల్‌ను సాధించారు. ఈ మేరకు స్కూల్ యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 99పైన పర్సంటైల్‌ను 17మంది, 95పైన పర్సంటైల్‌ను 37మంది, 90పైన పర్సంటైల్‌ను 50మంది, 85కు పైన పర్సంటైల్‌ను 68మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. తమ వద్ద ఇంటర్ సీబీఎస్ఈతో పాటు ఐఐటీ జేఈఈ కోచింగ్ తీసుకున్న 96మందిలో ఈ ఫలితాల ఆధారంగా 64మంది ఐఐటీ, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఈ రకంగా తాము 66.6శాతం సక్సెస్ రేటు సాధించామని.. ప్లస్ వన్, ప్లస్ టూ స్కూల్ చరిత్రలో ఇది అరుదైన రికార్డు అని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విజయం కోసం కృషిచేసిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

పారాహుషార్!

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా తన అంతర్జాతీయ నివేదికల్లో వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన తీవ్రవాద సంస్థల్లో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ-మావోయిస్టు) ఆరో స్థానంలో ఉందని, దాని బలం, బలాలు సామాజిక అంతరాలు, ఆదివాసీలు, మైనింగ్, భూ పోరాటాలేనని తెలిపింది. 2017, 2018 సంవత్సరాల్లో భద్రతా బలగాలు, శాసనసభ్యులు, సామాన్యులు వందలాది మంది మావోయిస్టు దాడుల్లో మరణించారని ఆ నివేదికలు పేర్కొన్నాయి. మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, వారు ఇంకా పనిచేస్తున్నారని, ప్రమాదం పొంచి ఉందని స్పష్టం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద, తీవ్రవాద సంస్థల కార్యకలాపాలు, వాటి నిర్మూలనకు ఆ దేశాల ప్రభుత్వాలతో కలిసి అమెరికా నిర్వహిస్తోన్న ఉమ్మడి ఆపరేషన్లు, వాటి ఫలితాలను తెలియజేస్తూ అమెరికా ఏటా నివేదికలు విడుదల చేస్తుంది. అమెరికా విదేశాంగశాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ కౌంటర్ టెర్రరిజం గతేడాది నవంబరులో 'కంట్రీ రిపోర్ట్స్ ఆన్ టెర్రరిజం-2018'ను విడుదల చేసింది. దీంతోపాటు 'కంట్రీ రిపోర్ట్స్ ఆన్ హ్యూమన్‌రైట్స్ ప్రాక్టీస్-2018' పేరిట మరో నివేదికను విడుదల చేసింది. హోమ్‌లాండ్ సెక్యూరిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్(స్టార్ట్) విభాగం రూపొందించిన నివేదికను కూడా విడుదల చేశారు. మొదటి నివేదిక.. మావోయిస్టుల తిరుగుబాటు, విస్తరణ, వారి దాడులు, వారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలను వివరించింది. ఇక మానవ హక్కుల నివేదికతోపాటు స్టార్ట్ ఇచ్చిన మరో నివేదికలో మావోయిస్టుల బలాలు, ఆదివాసీలతో వారికున్న మైత్రి, భద్రతా బలగాలు, పోలీసులపై జరుగుతున్న దాడులు, ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపడుతోన్న చర్యల వల్ల వస్తోన్న సమస్యలను మానవ హక్కుల కోణంలో విశ్లేషిస్తూ మావోయిస్టు ముప్పును స్పష్టంగా వివరించింది. ఉగ్ర, తీవ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, అయినా, 2018లో 248 దాడులు చేసి 175 మందిని హతమార్చారని వెల్లడించింది. మృతుల్లో ఎక్కువగా భద్రతా బలగాల సిబ్బంది కూడా ఉన్నారని వివరించింది. విశాఖ జిల్లాలో ఎమ్మెల్యే(కిడారి సర్వేశ్వరరావు), మాజీ ఎమ్మెల్యే(సివేరి సోము)లను దారుణంగా చంపేశారని పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదంతోపాటు దేశీయంగా తీవ్రవాదులను భారతదేశం ఎదుర్కొంటోందని, ప్రాణ నష్టం ఆందోళన కలిగించేదిగా ఉందని వివరించింది. 'ఈశాన్య, మధ్య, దక్షిణ భారతంలో మావోయిస్టు గెరిల్లాలు తిరుగుబాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలన్న లక్ష్యంతో పోరాడుతున్నారు. వారి దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు అమెరికా సహకారం భారత్ గట్టిగా కోరుకుంటోంది' అని ఆ నివేదికలో పేర్కొన్నారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో జరగుతున్న హింస, మైనింగ్‌కోసం జరుగుతున్న పరోక్ష యుద్ధాలను ప్రస్తావించింది. ప్రధాని మోదీని హతమార్చేందుకు కుట్ర చేశారంటూ బీమా-కోరెగావ్ కేసులో విరసం నేత వరవరరావు, వెర్నన్ గోన్‌సాల్‌వేస్, గౌతమ్ నవలా, సుధాభరద్వాజ్ తదితరుల అరెస్ట్‌లను నివేదికలో ప్రస్తావించారు. షెడ్యూల్డ్ ఏరియాలు, ప్రత్యేకించి మైనింగ్ ప్రాంతాల్లో మావోయిస్టులకు బయటకు అర్థంకాని బలం ఉందని పేర్కొన్నారు. 'ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యంత విలువైన మైనింగ్ నిక్షేపాలున్నాయి. మైనింగ్ చేయాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. దాని వల్ల తమ జీవనాధారం కోల్పోయి రోడ్డున పడతామని ఆదివాసీలు, గిరిజనులు తీవ్ర ఆందోళనగా ఉన్నారు. మైనింగ్ వ్యతిరేక పోరాటాలు చేస్తున్నారు. మావోయిస్టులు ఈ ఉద్యమాల్లో భాగస్వాములై, వాటిని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. దీంతో గిరిజన ప్రాంతాల్లో తీవ్ర అలజడి నెలకొంది. వ్యక్తులు కనిపించకుండా పోవడం, కిడ్నాప్, లాకప్‌డెత్, ఎన్‌కౌంటర్ జరుగుతున్నాయి. దీనికి ప్రతిగా భద్రతా బలగాలు, పోలీసులపై మావోయిస్టులు భారీగా దాడులకు దిగుతున్నారు' అని మానవ హక్కుల నివేదికలో పేర్కొన్నారు.

ప్రమాదకర జాబితాలో..

స్టార్ట్ నివేదిక మరో అడుగు ముందుకేసి ప్రపంచంలోని అత్యంత ప్రమాదకర సంస్థల జాబితాలో భారత మావోయిస్టు పార్టీ ఉందని పేర్కొంది. విదేశాంగశాఖ నివేదికలోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నా...స్టార్ట్ దాన్ని మరింత వివరంగా తెలిపింది. తాలిబన్, ఐసిస్, ఆల్‌సాహెబ్, పులనీ, న్యూ పీపుల్స్ ఆర్మీ(ఎన్‌పీఏ) తర్వాత భారత మావోయిస్టుల విధ్వంసం ఉందని వివరించింది. ప్రభుత్వం చేపడుతున్న ఏరివేత చర్యల వల్ల కొన్ని బలమైన ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రాబల్యం కొంత తగ్గుతున్నా.... చడీచప్పుడు కాకుండా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నారని వివరించింది. ఏవోబీ(ఆంధ్రా-ఒడిసా ప్రాంతం) మావోయిస్టులకు బలమైనదిగా ప్రస్తావించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రాజరత్నమ్మ కన్నుమూత

హైదరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు కడియాల రాజరత్నమ్మ(106) ఆదివారం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో కన్నుమూశారు. ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్ గేటెడ్ కమ్యూనిటీలో ఆమె నివాసముంటున్నారు. ఆమె కృష్ణాజిల్లా ఉండవల్లిలో 1914లో జన్మించారు. చిన్నతనం నుంచే సాహిత్యం, దేశంపై అభిమానం పెంచుకున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. ఉద్యమ సమయంలో గాంధీజీ, నెహ్రూతోనూ కలిసి పనిచేశారు. ఆమె భర్త గోపాల్‌రావు ఎంపీగా పనిచేశారు.

ఆకాశంలోకి వెళ్తున్న బెలూన్

అంతరిక్షంలో అద్భుతం!

- హీలియం బెలూన్లతో 12 బుల్లి ఉపగ్రహాల ప్రయోగం

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇస్రో సాధిస్తున్న విజయాల స్ఫూర్తితో.. 8 నుంచి 12వ తరగతి విద్యార్థులు బుల్లి ఉపగ్రహాల ప్రయోగంలో సత్తాచాటుతున్నారు. చంద్రయాన్-1, మంగళ్‌యాన్ ప్రాజెక్టుల మాజీ డైరెక్టర్ మైల్‌స్వామి అన్నాదురై సారథ్యంలోని నేషనల్ డిజైన్ రిసెర్చ్ ఫోరం (ఎన్డీఆర్ఎఫ్) ప్రకటించిన 'నేషనల్ స్పేస్ చాలెంజ్ 2020'లో భాగంగా వీఐటీ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆదివారం హీలియం బెలూన్ల ద్వారా 12 బుల్లి ఉపగ్రహాలను ప్రయోగించి శభాష్ అనిపించారు. దేశవ్యాప్తంగా 8 నుండి 12వ తరగతి చదివే ప్రతిభావంతులైన 60 మంది విద్యార్థులు ఈ బెలూన్లు, ఉపగ్రహాలు తయారు చేశారు. వారిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, గోవా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులున్నారు. శాటిలైట్ బెలూన్‌ను తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కేపీ అన్బళగన్ గాల్లోకి ఎగురవేశారు. ఈ బెలూన్ ఆకాశంలోకి సుమారు 20 కి.మీ.

మా శవాల పైనుంచి వెళ్లి..

బిల్లు పాస్ చేసుకోండి!

కూన రవికుమార్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

- సీఎం జగన్‌పై బుద్ధా వెంకన్న ఫైర్
- అసెంబ్లీ ముట్టడి ఖాయమని వెల్లడి

విజయవాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలనే డిమాండ్‌తో సోమవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడిని సీఎం జగన్ కాదు కదా.. ఆయన తాత రాజారెడ్డి వచ్చినా ఆపలేరని టీడీపీ నేత, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. పోలీసుల లాఠీచార్జికే కాదు.. తుపాకీ గుళ్లకు సైతం ఎదురొడ్డి.. అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేస్తామన్నారు. ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ, "అసెంబ్లీ ముట్టడిలో పోలీసులు కాల్పులకు తెగబడితే అల్లూరి సీతారామరాజులాగా మా గుండెల్ని ఎదురుగా పెడతామే తప్ప భయపడే ప్రసక్తే లేదు. మా శవాల మీద నుంచి నడుచుకుంటూ వెళ్లి అసెంబ్లీలో బిల్లును పాస్ చేసుకోండి. సోమవారం ఉదయం 8 గంటల కల్లా నేను నా ఇంటి నుంచి ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి అసెంబ్లీని ముట్టడిస్తా. ఏ పోలీసు వచ్చి అడ్డుకుంటారో చూస్తాం" అని బుద్దా సవాల్ విసిరారు. అనంతరం ట్విట్టర్‌లోనూ విమర్శలు చేశారు.

మావోయిస్టు రాష్ట్రాల్లో కూడా ఇలా లేదు

- మాజీ మంత్రి దేవినేని ఉమ ఆగ్రహం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో కూడా ఈ తరహా నిర్బంధాలు లేవని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "అమరావతి ప్రాంతంలో ప్రజలను ఒక్క అడుగు కూడా బయటపెట్టకుండా నిర్బంధకాండ అమలు చేస్తున్నారు. బస్సులు కూడా రద్దు చేశారు. ప్రజాగ్రహానికి భయపడి సీఎం జగన్ సచివాలయానికి వెళ్లడానికి డమ్మీ కాన్వాయ్ నడిపించి ఆ తర్వాత తన కాన్వాయ్‌తో వెళ్తున్నారు. దేశంలోని ఏ ముఖ్యమంత్రికీ ఇంత దుర్గతి పట్టలేదు' అని విమర్శించారు. అరెస్టులు, నోటీసులు, పోలీసుల కవాతుకు ప్రజలు భయపడవద్దని విజ్ఞప్తి చేశారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. కాగా, అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు టీడీపీ నాయకులకు నోటీసులు జారీ చేయడంపై విజయవాడ ఎంపీ కేశినేని (శ్రీనివాస్(నాని) ట్విట్టర్‌లో మండిపడ్డారు. "ప్రజా స్వామ్యాన్ని, ప్రజా ఉద్యమాలను మీరూ(జగన్), మీ పోలీసులు అణగదొక్కలేరు ముఖ్యమంత్రి గారూ!" అని ట్వీట్ చేశారు. పోలీసులు తనకు జారీ చేసిన నోటీసును ట్యాగ్ చేశారు. రాజధాని పేరిట విశాఖకు 'దండుపాళ్యం' బ్యాచ్ దిగిందని మాజీ విప్, టీడీపీ నేత కూన రవికుమార్ విమర్శించారు. అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు విజయవాడ వెళ్లేందుకు బయలుదేరుతున్న రవికుమార్‌ను ఆదివారం సాయంత్రం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన మాట్లాడుతూ, విజయవాడలో చదువుతున్న కూమార్తెను కలుసుకునేందుకు వెళ్తున్న తనను అరెస్ట్ చేశారని వాపోయారు. కాగా, నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తిని కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

అమరావతి కాదంటే 'ప్రత్యేక సీమే': జేసీ

అనంతపురం: రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, లేదంటే ప్రత్యేక రాయలసీమ కోసం ఉద్యమిస్తామని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. రెండు రోజుల్లో ఆ మేరకు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అమరావతి కోరుతూ అనంతపురం జిల్లా శింగనమలలో తెలుగు యువత ఆధ్వర్యంలో చేపట్టిన 24 గంటల నిరసన దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు.

కలెక్టర్ విడుదల చేసిన పోస్టర్

సు'గంధ' నినాదం!

ఈ బ్యానర్ చూడండి....ప్రజల ఆత్మగౌరవానికి అద్దం ఇది...ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలందరివీ అని, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రజాసేవకులు అని గుర్తు చేసే విన్నపం ఇది. ఈ విజ్ఞప్తిని నినాదంలా చాటి చెబుతున్నది స్వయంగా ఓ జిల్లా కలెక్టర్. ఆయనే గంధం చంద్రుడు. అనంతపురం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆత్మన్యూనతను వీడాలంటున్నారు. అధికారులను కలిసే సమయంలో ఎలాంటి అభద్రతా భావానికి లోనుకావద్దంటున్నారు. అధికారులతో మాట్లాడడానికి వచ్చినప్పుడు...'చెప్పులు విడవకండి', 'చేతులు కట్టుకుని వంగి నిలబడకండి', 'కన్నీళ్లు పెట్టుకోకండి', 'కాళ్లు మొక్కకండి'... ధైర్యంగా, స్పష్టంగా మీ సమస్యను చెప్పుకోండి అంటూ ఆయన వినూత్న రీతిలో పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆ పోస్టర్‌ను ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. కేవలం పోస్టర్లు ప్రదర్శించడంతోనే సరిపెట్టకుండా... కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, విజ్ఞప్తులను వింటూ వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితుల్లో ఆత్మన్యూనత భావాన్ని పూర్తిగా తొలగించి, వారిలో ఆత్మగౌరవం నింపేందుకే తాను ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు 'ఆంధ్రజ్యోతి'తో స్పష్టం చేశారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం

పలాస ప్రభుత్వ ఐటీఐకి రూ.1.50 కోట్లు వితరణ

కణితి విశ్వనాథం సోదరుడు హేమాచలం ఉదారత

పలాస, జనవరి 19: శ్రీకాకుళం జిల్లా పలాస ప్రభుత్వ ఐటీఐకి డాక్టర్ కణితి హేమాచలం, ఉష దంపతులు రూ.1.50 కోట్లు విరాళం ప్రకటించారు. తరగతి గదులు, వసతిగృహాల నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి ఈ సాయం అందిస్తున్నట్టు ఆదివారం వారు తెలిపారు. పలాస ప్రాంతంలో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశంతో లయన్స్‌క్లబ్ సహకారంతో మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం దశాబ్దాల కిందట పలాస ఐటీఐని స్థాపించారు. వేలాది మందికి శిక్షణ ఇవ్వగా వారంతా ప్రస్తుతం దేశవిదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. తరువాత కాలంలో రూ.10 కోట్ల విలువైన స్థలంతో పాటు భవనాలను ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో అప్పటి నుంచి డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటీఐగా ప్రభుత్వం పేరు మార్చింది. ప్రస్తుతం ఈ ఐటీఐలో చదువుతున్న విద్యార్థులకు వసతిగృహాలు అవసరం కాగా..విషయం తెలుసుకున్న కణితి హేమాచలం దంపతులు భారీ విరాళాన్ని ప్రకటించారు. హేమాచలం మాజీ ఎంపీ కణితి విశ్వనాథానికి స్వయాన సోదరుడు. ఆయన కాలిఫోర్నియాలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు.

కర్ణాటకలో వ్యోమగాముల శిక్షణ శిబిరం

- దేశంలోనే తొలిసారి ఏర్పాటు.. అంచనా ఖర్చు 2,700 కోట్లు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 2022లో మానవ సహిత ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. రోదసీలోకి వెళ్లే వ్యోమగాములకు శిక్షణ కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. దీనికోసం దేశంలోనే తొలిసారిగా కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకా నాయకనహట్టి - దొడ్డ ఉల్లార్తి గ్రామాల మధ్య రూ. 2,700 కోట్ల ఖర్చుతో ప్రత్యేక కేంద్రం ఏర్పాటుకు కేంద్ర రక్షణశాఖ ఇప్పటికే పచ్చజెండా ఊపింది. రాష్ట్ర ప్రభుత్వం దీని కోసం 2010లోనే దొడ్డ ఉల్లార్తిలో 573 ఎకరాలు, నాయకనహట్టి గ్రామంలో 100 ఎకరాలను ఇస్రోకు అప్పగించింది. అలాగే బెంగళూరు శివారులోని దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో 140 ఎకరాలు కూడా కేటాయించింది. దొడ్డ ఉల్లార్తిలోని సైన్స్ సిటీకి కేటాయించిన ప్రాంతంలో పలు నిర్మాణాలు ప్రారంభమయ్యాని ఈ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ ఉన్నికృష్ణన్ నాయర్ శనివారం మీడియాకు తెలిపారు.

బాబు రాజీనామా చేయాలి

- రాజధానిపై ఉన్మాదిలా మాట్లాడుతున్నారు
- ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత ఆయనకు లేదు
- ముట్టడి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి: అవంతి

సాగర్‌నగర్(విశాఖ సిటీ), జనవరి 19: అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని రాష్ట్ర పర్యాటక మంత్రి అవంతి శ్రీనివాసరావు అన్నారు. ఆయన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, లేదంటే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రుషికొండ బీచ్‌లో బోటు షికార్‌ను ఆదివారం ఆయన పునఃప్రారంభించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో కలిసి బోటులో విహరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలనేది ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు. కానీ, కొద్దిమంది మాత్రమే బాగుపడాలనేది చంద్రబాబు నైజమని ఆరోపించారు. ఎవరి ఆలోచన సరైనదో అసెంబ్లీలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. రాజధాని విషయంలో చంద్రబాబు ఉన్మాదిలా మాట్లాడుతూ చౌకబారు రాజకీయాలకు దిగుతున్నారని ఆరోపించారు. నాడు బషీర్‌బాగ్‌లో చంద్రబాబు రక్తదాహాన్ని కమ్యూనిస్టులు మరచిపోయినా, ప్రజలు మరిచిపోలేదన్నారు. రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెనుక్కి పోయాయంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఇందుకు ఆధారాలు చూపించగలరా? అని ప్రశ్నించారు. విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఎన్ఆర్‌సీ అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కనిగిరి, జనవరి 19: ఎన్ఆర్‌సీని రాష్ట్రంలో అమలు చేయబోమని శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేయకపోతే 13 జిల్లాల ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పౌరసత్వ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆదివారం భారీ ర్యాలీ, బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా మతం పేరుతో దేశాన్ని ముక్కలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమిత్‌షాను చూస్తే సీఎం జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకుపుడుతుందన్నారు. బిల్లులకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేస్తే తన కేసులను తోడి జైలుపాల్జేస్తాడన్న భయం ఆయన్ను వెంటాడుతోందని అందుకే ఈ విషయంలో వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు. కేరళ తరహాలోనే మన రాష్ట్ర శాసనసభలో కూడా ఈ చట్టాలకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

తరలింపు తంటాలు!

- 'మూడు'కు మద్దతుగా వైసీపీ ర్యాలీ.. 'స్థానిక' ఆశావహులకు టార్గెట్
- జనాల తరలింపు బాధ్యత వారికే ప్రత్యేక బస్సులు, ఆటోల ఏర్పాటు

విజయవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 'మూడు రాజధానులు వద్దు.. అమరావతే ముద్దు' నినాదంతో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉద్యమం రోజురోజుకీ వేడెక్కుతోంది. అమరావతికి మద్దతుగా ఈ ప్రాంతంలో ఉద్యమం సాగుతుంటే.. వైసీపీ మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా విజయవాడలోని బీఆర్టీఎస్ రోడ్డులో ప్రత్యేక ర్యాలీ నిర్వహించింది. రాజధాని గ్రామాలతోపాటు విజయవాడ నగరంలో అమరావతికి అనుకూలంగా జరుగుతున్న నిరసనలకు పోటీగా మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా ఈ ర్యాలీని ఏర్పాటు చేశారు. మీసాల రాజేశ్వరరావు వంతెన నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. అయితే ఎక్కడా మూడు రాజధానుల మాట వినిపించకుండా వైసీపీ నాయకులు జాగ్రత్తపడ్డారు. పరిపాలన, అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో ర్యాలీ సాగించారు. కాగా.. ర్యాలీ కోసం నగరంలోని వివిధ డివిజన్ల నుంచి మహిళలను భారీగా తరలించారు. రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీకి ఆశపడుతున్న వారిపై ఈ బాధ్యత పెట్టారు. 'ర్యాలీ విజయవంతం కావాలి. జనాన్ని తరలించే బాధ్యత మాత్రం మీదే' అని ఆశావహులకు తేల్చి చెప్పేశారు. దీంతో ర్యాలీకి జనాన్ని తరలించేందుకు వారు నానా తంటాలు పడ్డారు. సెంట్రల్ నియోజకవర్గం నుంచి కొంత మందిని, కృష్ణలంక, రాణిగారితోట నుంచి మరికొంత మందిని ప్రత్యేక బస్సులు, ఆటోల్లో తరలించారు. ర్యాలీలో పాల్గొన్న వారికి ఒక్కొక్కరికి రూ.300ల చొప్పున ఆశావహులే చెల్లించారని సమాచారం. ఇన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ ర్యాలీకి పెద్దగా స్పందన రాలేదు.

గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఐదుగురు దుర్మరణం.. మృతులు ప్రకాశం జిల్లా వాసులు

చీరాల, జనవరి 19: ప్రకాశం జిల్లా నుంచి దైవదర్శనానికి వెళ్లిన ఓ బృందం గుజరాత్‌లో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. మృతులంతా ప్రకాశం జిల్లా చీరాల ప్రాంతానికి చెందినవారని తెలిసింది. వీరిలో ఇద్దరి వివరాలు మాత్రమే పోలీసులకు అందాయి. మిగిలిన వారి అచూకీ కోసం వారు ప్రయత్నిస్తున్నారు. అందిన సమాచారం మేరకు.. చీరాల ప్రాంతానికి చెందిన కొందరు గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయాన్ని సందర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సురేంద్రనగర్ జిల్లా పారా వద్ద వారి వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. మృతులను సుబ్రహ్మణ్యం తంబారావ్, రాజశ్రీ సుబ్రహ్మణ్యం, గణేష్ సుబ్రహ్మణ్యం, భవానీ నాగేంద్రగా గుర్తించారు. వీరిలో రాజశ్రీ సుబ్రహ్మణ్యం, గణేష్ సుబ్రహ్మణ్యం.. చీరాల మండలం జాడ్రపేట వాసులుగా తెలుస్తోంది. మిగిలిన వారి సమాచారం కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

సాహితీవేత్త హనుమారెడ్డి హఠాన్మరణం

ఒంగోలు కల్చరల్, జనవరి 19 : ప్రముఖ సాహితీ వేత్త, ఏపీ రచయితల సంఘ గౌరవాధ్యక్షుడు బి. హనుమారెడ్డి (80) ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. హనుమారెడ్డి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఒంగోలులో ప్రకాశం జిల్లా రచయితల సంఘం 9వ మహాసభలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా ఆ కార్యక్రమాల్లో ఆయన ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆయనకు గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 8.30 ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. హనుమారెడ్డి రెండు దశాబ్దాలపాటు ప్రకాశం జిల్లా రచయితల సంఘం (ప్రరసం) అధ్యక్షుడిగా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 12కు పైగా పుస్తకాలు రచించారు. అలాగే ప్రరసం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని అనేకమంది కవుల పుస్తకాలను, డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆత్మకథ కొన్ని భాగాలను హనుమారెడ్డి నేతృత్వంలో ప్రచురించి ఆవిష్కరించారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని ప్రముఖ సాహితీ వేత్తలందరితో కలిసి ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు.

ప్రాచీన భాషల పరిరక్షణ అత్యవసరం

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మన పురాతన నాగరికత విలువలు, విజ్ఞానాన్ని, వివేకాన్ని అందించే ప్రాచీన భారతీయ భాషల పరిరక్షణ, ప్రచారం అత్యవసరమని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అలాగే మాతృభాషల ప్రోత్సాహానికి జాతీయ స్థాయిలో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. చెన్నైలోని కేంద్ర ప్రాచీన తమిళం సంస్థ (సీఐసీటీ), అంతర్జాతీయ తమిళ అధ్యయన సంస్థ (ఐఐటీఎస్)లను ఉప రాష్ట్రపతి ఆదివారం సందర్శించారు. రాష్ట్ర తమిళ అధికార భాష, సంస్కృతిశాఖ మంత్రి కె.పాండియరాజన్, మత్స్యశాఖ మంత్రి డి.జయకుమార్, గ్రామీణ పరిశ్రమలశాఖ మంత్రి పి.బెంజమిన్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని రెండు కేంద్రాల విశేషాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ, తిరుక్కురళ్‌ను అన్ని భారతీయ భాషలు, పలు విదేశీ భాషల్లోకి అనువదించడానికి చేసిన కృషిని ప్రశంసిస్తూ, ప్రజలందరికీ ప్రయోజనం చేకూరేలా ఇతర ప్రాచీన, ప్రసిద్ధ తమిళ గ్రంథాలను కూడా భారతీయ, విదేశీ భాషల్లో అనువదించాలని సూచించారు. తమిళ ప్రాచీనతకు సంబంధించిన, ప్రతిబింబించే వస్తువులను డాక్యుమెంట్ చేసి, సంరక్షించడంలో రెండు సంస్థలు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. భారతీయ ప్రాచీన భాషలను పరిరక్షించేందుకు, ప్రోత్సహించేందుకు సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు సూచించారు.

పురాతన వస్తువులను తిలకిస్తున్న వెంకయ్యనాయుడు

ఎడప్పాడికి ప్రశంస

కాగా, సంక్రాంతి పండుగ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి స్వయంగా పొలంలో వరిపంట కోయడాన్ని ఉప రాష్ట్రపతి అభినందించారు. ఈ మేరకు ఆయన ఒక ట్వీట్ చేస్తూ, సీఎం అయినా ఒక రైతుగా తన మూలాలను సీఎం మర్చిపోలేదని, ఇది ప్రజలకి స్ఫూర్తినిస్తుందని కొనియాడారు.

సోమవారం 20 జనవరి 2020
వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

ఫిర్యాదుగా చోఖామేలా భక్తి

భక్తి ఉద్యమ మూలాలు దక్షిణ భారతదేశంలో 6వ శతాబ్దానికే ఉన్నాయి. అది మధ్య పశ్చిమ భారతదేశానికి 12వ శతాబ్దానికి ప్రాకి, 17వ శతాబ్దాంతంలోగా మిగతా భారతదేశానికి విస్తరించింది. వివిధ రూపాల్లో, వివిధ కాలాల్లో, వివిధ అభివ్యక్తుల్లో బయటకొచ్చింది. మునుల్లా జీవించిన కవులే ఈ అన్ని శతాబ్దాల్లోనూ దానికి ముఖ్య కారకులు. అందులో స్త్రీలూ ఉన్నారు, అన్నింటికీ దూరంగా ఉంచబడ్డ దిగువ కులాలవారూ ఉన్నారు. దిగువ కులాలగా భావించబడ్డ వారిలో 7-8 శతాబ్దాల మధ్య వాడైన దళిత శైవ భక్తకవి నందనార్, 9-10 శతాబ్దాల మధ్య వారైన ప్రముఖ శ్రీ వైష్ణవ భక్త కవులు నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్, తిరుప్పాణాళ్వార్లు; 14వ శతాబ్దపు నామదేవ్, చోఖామేలా, పంజాబ్‌కి చెందిన 15-16 శతాబ్దపు సంత్ రవిదాస్‌లు మొదలైనవారున్నారు.

14వ శతాబ్దపు చోఖామేలా (?-1338) నిమ్న కులాల పట్ల జరుగుతున్న వివక్షను, తాను నమ్ముకున్న పండరీపుర విఠలుడికే కాదు, ప్రజలందరికీ, అభంగ్‌లనే భక్తి పాటలు ద్వారా విన్నవించుకున్నాడు. సరళమైన స్థానిక భాషలో ఒక గొప్ప ఆధ్యాత్మిక సారాన్ని ప్రజలకు చేరువ చేసాడు.

కన్నడ ప్రాంతానికి చెందిన 12వ శతాబ్దపు మాదర చెన్నయ్య తరువాత, బహుశా చోఖామేలానే మరాఠీ చరిత్రలో నమోదయిన మొదటి దళిత కవి. అతను పుట్టిన సంవత్సరం తెలియదు. పండరీపురం దగ్గరలో ఉన్న మంగళవేధ గ్రామంలో భార్య సోయరా, కొడుకు కర్మమేలాతో నివసించాడన్నది అందరికీ తెలిసిన సత్యం. అంటరానికులంగా భావించబడ్డ మహర్ దళిత కులానికి చెందినవాడు కావడం మూలాన చివరివరకూ ఎన్నో ఇబ్బందులకు గురికాక తప్పలేదు. అతని కవిత్వం బాధాతప్త హృదయాన్ని, ఆధ్యాత్మిక పరిపక్వతను తెలియజేస్తుంది.

మహర్ కులస్థులు గ్రామాన్ని ఊడ్చి శుభ్రంగా ఉంచడం, చచ్చిన పశువులను తొలగించి వాటిని ఊరవతల ఖననం చేయడమేకాక, ఊరికి దూరంగా ఆయా కులస్థులతోపాటే ఉండాలన్నది అప్పటి నియమం. చదువులకు దూరం కావడమే కాకుండా, పై కులస్థులు తినగా వదిలేసిన తిండిని ప్రసాదంలా సేకరించి తినడం కూడా అందులో ఒకటి.

చోఖామేలా పండరీపురం ఒకసారి వచ్చినపుడు సంత్ నామదేవ్ (1270-1350) బోధనల్ని విన్నాడు. అతనిమీద అవి విశేషమైన ప్రభావాన్ని చూపించాయి. అతన్ని గురువుగా స్వీకరించి, షోలాపూర్‌లో ఉన్న పాండురంగ విఠలుని భక్తుడుగా మారిపోయాడు. చోఖామేలా 1280-90 ప్రాంతంలో భార్యా పుత్రునితో పండరీపురానికి నివాసం మార్చుకున్నాడు. పండరీపురంలో అతనిని, అతని కులస్థులతో పాటు ఊరి చివరనే ఉండనిచ్చారు. గుడి లోనికి ప్రవేశం లేకుండా కట్టడి చేసారు. అంచాత భీమా నదికి ఉపనదియైన చంద్రభాగ నది ఒడ్డున, దూరంలోనైనా గుడి కనిపించే స్థలంలో కుటీరం కట్టుకున్నాడు.

సమాజంలో మనుషుల మధ్య వ్యత్యాసం చోఖాకు భరించరాని అన్యాయంగా అనిపించేది. ఆ విధమైన సృష్టికి కారణమైన దేవునికి, తన అభంగ్‌లతో ఫిర్యాదు చేసేవాడు, నిలదీసేవాడు కూడా. ఈ అభంగ్‌లన్నవి భంగం కాని భక్తిపూరితమైన పాటలు, లేదా భజనలు. ఈ అభంగ్‌లన్నీ మౌఖికంగా ఉండటం మూలాన చోఖా అభంగ్‌లు ఎన్ని ఉన్నాయన్నది సరిగ్గా తెలియదు. 200 నుండి 350 వరకూ ఉంటాయని ఒక అంచనా. వాటిల్లో ఎక్కువ భాగం విఠల్ దేవునితో ముడి వేసుకున్నవే అయినా, చాలావరకు అతని ఆత్మ కథల్లా సాగుతాయి. చోఖా మేలా అభంగ్‌లను అనంత భట్ అనే భక్తుడు సేకరించి రాసి భద్రపరిచాడు.

దైవభక్తి, ధర్మనిష్ఠ, ప్రేమ, సమానత్వం తరపునే చోఖామేలా నిశ్శబ్ద పోరాటం చేశాడు. ఛాందసత్వం, కుల అహంకారం మీద తన అభిప్రా యాలు దాచుకోలేదు. ఏనాడూ ఎవరి దగ్గరా న్యూనతా భావాన్ని ప్రదర్శించలేదు. అతని కవితలు, విఠలుని మీద భక్తి ప్రధానమైనవే అయినా, అంటరానితనాన్ని ప్రస్తావించకుండా లేవు.

విఠలునిపట్ల సంత్ కవుల అభంగ్‌లలో మోహ లేదా వివాహ రూపకాలు ఎక్కడా ఉండకపోవడం ఒక విశేషం. విఠలుడు ఒక స్నేహితుడు లేదా సహచరుడు, తండ్రి లేదా తల్లి అన్న ధ్యాసతోనే అన్నీ ఉంటాయి. విఠలునితో సాన్నిహిత్యం ఎంత ఎక్కువ అంటే, అతనికీ తమకూ మధ్య విచక్షణ ఉన్నట్టు అంతగా వారికి అనిపించదు, రెండు అద్దాలు ఒక దాని ఎదురుగా ఒకటి ఉన్నప్పుడు ఏది దేనిని ప్రతిఫలిస్తుందో తెలుసుకోలేనంతగా వారు లీనమయి ఉంటారు.

"సౌకర్యవంతమైన ఆసనం, సౌకర్యమైన పడక ఒకడికి/ శరీరాన్ని కప్పుకుందుకు బట్టైనా ఉండదు కొందరికి/ కొందరు రుచికరమైన ఆహారాన్ని అనుభవిస్తారు/ కొందరు అరగని అన్నాన్నైనా అడుక్కుంటారు/ కొందరు రాజులా గొప్ప గౌరవం పొందుతారు/ కొందరు ఊరంతా యాచకుల్లా తిరుగుతారు/ నీ ఇంటిలో ఇదేమి న్యాయం/ బహుశా నా అదృష్టం బాగులేదేమో"- అని వాపోయాడు చోఖామేలా.

విఠలుని భక్తిలో లీనమై చోఖా పాడిన అభంగ్‌లు అందరినీ ఆకట్టుకుని, భక్తుల సమాజంలో గొప్ప గౌరవాన్ని పొందడం మొదలయింది. అది పండరీపురంలోని పైకులాల వారికి, ముఖ్యంగా అక్కడి పూజారులకు కంటగింపుగా తయారైంది. చోఖా గుడిలోకి ప్రవేశించకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎవరికీ తెలియకుండా చోఖా గుడిలోకి ప్రవేశించాడని, విఠలుని మెడలోని బంగారు హారం సైతం దొంగిలించాడని నేరారోపణ చేసి అనేక విధాల హింసలకు గురిచేసారు. అయినా అతని దుస్థితికి ఎవరినీ అతను ద్వేషించ లేదు. విఠలుని నామస్మరణలో, గుడి ముందు చేతులు జోడించి నిలుచుందుకు తప్ప లోనికి పోయేందుకు అనుమతిని మాత్రం పొందలేకపోయాడు. సరళంగా సూటిగా అతని కులాన్ని సైతం సూచించకుండావున్న సహజ కవిత్వం అతనిది-

"నీ ముంజేతి మీద గాజుల్ని చూడటానికి/ అద్దం ఎందుకు నీకు?/ విఠలుడి మీద నమ్మకం ఉంచుకో/ మతాచారాల విషయం ఆలోచించొద్దు/ విఠలుడి నామం జపించు/ యోగి మార్గం కోలాహలంతో నిండి ఉండదు/ జపం ఉచితం/ ముందు అది చేయు/ పగలూ రాత్రీ నామం జపించు/ సదాచారుల సాంగత్యంలో పరమానందం ఉంది" అంటాడు చోఖా

చోఖా కవితలు అప్పటి సామాజిక పరిస్థితుల్ని చూపించిన దస్తావేజులు. అవి మానవ జీవితాల్ని మరింత అర్థవంతం చేయడానికి ఉద్దేశించినవి. అత్యున్నత స్థాయికి చెందిన సార్వత్రిక కవితలుగా గుర్తించిన అతని కవితల్లోవి కొన్ని-

"చెరకు వంకరటింకర, అందులోని రసం కాదు/ విల్లు వంకర, అందులోని బాణం కాదు/ నది వంకరటింకర, దాని నీరు కాదు/ చోఖా వికారి కావచ్చు, అతని భక్తి కాదు/ కేవలం ఆకారం చూసే ఎందుకు మోసపోతావు"

* * *

"పంచభూతాలతో తయారయిన/ సమస్త ప్రపంచం/ అంతే కళంకితమైనపుడు/ దేహం మూలాధారమే అపవిత్రమైనాక/ ఎవరైనా ఒకరు పవిత్రులు/ ఇంకొకరు అపవిత్రులు ఎలా అవుతారు/ ఆరంభం నుండి అంతం వరకూ అపవిత్రమే/ పవిత్రులు ఎవరో ఎలా?"

* * *

"ఆ ప్రవర్తన పట్ల సిగ్గుపడాలి/ ఆ ఆలోచన పట్ల సిగ్గుపడాలి/ ఆ జీవితం పట్ల సిగ్గుపడాలి/ అలా పుట్టినందుకు సిగ్గుపడాలి//

ఆ పాండిత్యం పట్ల సిగ్గుపడాలి/ ఆ పవిత్ర గ్రంథాల పట్ల సిగ్గుపడాలి/ ఆచరించే ఆ అన్ని ఆచారాల పట్లా సిగ్గుపడాలి//

ఆ జ్ఞానం పట్ల సిగ్గుపడాలి/ దయ క్షమ శాంతం లేని, ఆ ఉపదేశం నిరర్థకం//

ఆ ధ్యానం పట్ల సిగ్గుపడాలి/ ఆ పెరిగిన జుట్టు పట్ల సిగ్గుపడాలి/ అనుసరించే ఆ దినచర్యలన్నీ నిష్ఫలం//

ఎప్పుడు పుట్టినా/ అలాంటి మనిషి పట్ల సిగ్గుపడాలి/ చివరికి అతనికి/ అంతులేని నరకమే"

భక్తులు ప్రజల్లో ఎంత గౌరవాన్ని పేరుని సంపాదించుకున్నా, అప్పటి భూస్వామ్య వ్యవస్థలోని కట్టుబానిసతనం మూలంగా, మంగళవేదాలో సరిహద్దు గోడ కట్టటానికి ఇతర నిమ్న కులస్థులతో పాటు చోఖా వెళ్లక తప్పలేదు. పడరీపురం నుండి అతనిని వెళ్లగొట్టే ప్రక్రియలో భాగమే ఆ కట్టడం పని అని కూడా చెబుతారు. ఆ గోడని కడుతున్న క్రమంలో అది కూలిపోవడంతో, దాని క్రింద అనేకమంది పనివాళ్లు చనిపోయారు. అందులో చోఖా కూడా ఉన్నాడు. ఎవరెవరివో ఎముకలు తప్ప, ఎవరెవరో తెలుసుకోలేని విధంగా, భయానకంగా ఎముకలు అక్కడ పడిఉన్నా, చోఖా గురువు నామదేవ్, అక్కడి కొన్ని ఎముకల నుండి వస్తున్న విఠల శబ్దాలతో అవి చోఖావిగా గుర్తించగలిగాడు. "చోఖా నా జీవితం/ చోఖా నా బావానుబంధం/ చోఖా నా కుటుంబ దైవం/ అతని భక్తి శక్తి గొప్పది/ అతని కోసమే నేను వచ్చాను" అని చెప్పుకున్నాడు నామదేవ్. అతని అస్థికలను పండరీపురానికి తీసుకొచ్చి చోఖా సమాధిని విఠలుని గుడి ముందే నిర్మింపజేసాడు సంత్ నామదేవ్. తన చివరిరోజులు పండరీపురంలోని విఠలుని గుడిలోనే గడిపిన తుకారం (1608-1650) సైతం, "ఆదర్శాల అద్భుత గ్రంథానివి నువ్వు, అసంఖ్యాక దుర్మార్గుల పని పట్టావు" అని చోఖామేలాని కీర్తించాడు.

దైవభక్తి, ధర్మనిష్ఠ, ప్రేమ, సమానత్వం తరపునే చోఖామేలా నిశ్శబ్ద పోరాటం చేశాడు. ఛాందసత్వం, కుల అహంకారం మీద తన అభిప్రాయాలు దాచుకోలేదు. ఏనాడూ ఎవరి దగ్గరా న్యూనతా భావాన్ని ప్రదర్శించలేదు. అతని కవితలు, విఠలుని మీద భక్తి ప్రధానమైనవే అయినా, అంటరానితనాన్ని ప్రస్తావించకుండా లేవు.

"ఈ పుట్టుకే నాకు ఇవ్వాలనుకుంటే/ ఎందుకు నన్నిలా పుట్టించావు?/ ఎలాగో పుట్టనీలే అని వదిలేసావు. నువ్వు క్రూరుడవు/ నేను పుట్టినపుడు నువ్వు ఎక్కడున్నావు?/ ఎవరికి సాయం చేస్తున్నావు?" - అని ఆక్షేపించేవాడే, "అంటరానివాడిని, నిన్నెలా నేను కొలవాలి/ అందరూ నన్ను దూరంగా ఉండమంటున్నారు, నిన్నెలా నేను చూడాలి/ నేను ఎవరినైనా ముట్టుకుంటే, వాళ్లు ఆక్షేపిస్తారు/ ఓ నా విఠలా, చోఖామేలాకి నీ దయ కావాలి" - అని దీనంగా వేడుకున్నాడు.

■ **ముకుంద రామారావు**
99083 47273

"కవిత్వాన్ని కలబోసుకునే సంఘటనలు అరుదైపోయాయి"

మీ తొలి కవితా సంపుటి 'ఒకే ఒక్క సామూహిక స్వప్నావిష్కరణ', ఇటీవల విడుదలైన మీ రెండవ సంపుటి 'దుర్గాపురం రోడ్'... ఈ రెండింటి మధ్యా కవిత్వంతో మీ అనుబంధంలోని మార్పేమైనా గమనించారా?

కవిత్వంతో అనుబంధం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఏ పని చేస్తున్నా ఒక పార్శ్వం కవిత్వాన్ని అన్వేషిస్తూనే ఉంటుంది. మొదటి సంపుటి 'ఒకేఒక్క సామూహిక స్వప్నావిష్కరణ' అప్పుడూ అంతరంగంగానూ, బహిరంగంగానూ కవిత్వమే తిరుగుతూ ఉండేది. ఖాళీ దొరికితే కవిత్వం చదువుకోవడం, ఆనందించడం.. ఎవరైనా కలిస్తే కవిత్వం గురించి మాట్లాడుకుంటూ గంటలేమిటి రోజుల తరబడి గడిపేయడం. ఆ తరువాత నెమ్మదిగా సాహితీ మిత్రులను కలవడం కొంత తగ్గిపోయింది. ఒకవేళ కలిసినా కాసేపు ఏదో మాట్లాడుకుని విడిపోవడమేగానీ, కవిత్వాన్ని కలబోసుకునే సంఘటనలు అరుదైపోయాయి. ఎవరి జీవన వ్యాపకాల్లో వాళ్లం ఇరుక్కుపోవడం వల్ల కొంత నిర్మోహమాటం కరువైపోవడం మరికొంత కారణం కావచ్చు. అయినా, లోలోన కదలాడే కవిత్వ జల ఉబుకుతూనే ఉండేది. నాలో నేనే, నాకు నేనే కవిత్వాన్ని చెప్పుకుంటూ, నెమరేసుకుంటూ తన్మయత్వంలో ఓలలాడేవాడిని. అలా ఎన్నో కవితలు-కేవలం ఏవో కొన్ని లైన్లు కావు-పూర్తయినవి ఉన్నాయి. కానీ, అనేకానేక కారణాల వల్ల కొన్ని మాత్రమే కాగితం మీదకీ లేదంటే కంప్యూటర్‌లోకీ ఎక్కాయి. అవే మిమ్మల్ని 'దుర్గాపురం రోడ్' రమ్మని ఆహ్వానిస్తున్నాయి.

సంకలనం
దేశరాజు

పుస్తకానికి ముందుమాటలో నగ్నముని "ప్రధాన ప్రవాహానికి పక్కనే సమాంతర, ప్రత్యామ్నాయ ప్రవాహాన్ని ఏర్పాటు చేసుకున్న కవి" దేశరాజు అన్నారు. అది ఏమిటి?

మనలో ఎవరూ నిత్య నిబద్ధులు కారు-దేనికైనా. నిబద్ధులమనుకునే ధోరణి ఒకటి ప్రబలంగా ఉండేది. దాని ఛాయలు ఇప్పటికీ ఉన్నాయి. కవిత్వాన్ని మనలోకి తీసుకుని, మన లోలోతుల్లోంచి పలవరించేప్పుడు- కేవలం నమ్మే అభిప్రాయాలు, భావాల వంటి బహిర్గత అంశాలే కాకుండా, మన అంతరంగం చీకటి కూడా కవిత్వానికి అంటుకుంటుంది. వాస్తవానికి అదే కవిత్వానికి బతుకునిస్తుందనుకుంట. అరమరికల్లేని కవితా పంక్తులు పఠితలో కొత్త అలజడిని సృష్టిస్తాయి. 'నేను కూడా ఇలాగే అనుకుంటానే' అనే భావం పాఠకుడిలో కలుగుతుంది. అందరూ నమ్ముతున్నామని భావించే ప్రధాన స్రవంతిని మన నమ్మకం మేరకు కొనసాగిస్తూనే మన దైనందిన, ఉద్యోగ, సంసార జీవిత సీమల్లో కూడా సమాంతరంగా విహరించా. ప్రేమ, విరహం, ప్రకృతి వంటి అనేక అంశాలను కవిత్వంలో పట్టుకునే ప్రయత్నం చేశా.

పాతికేళ్ళ కవిత్వ జీవితంలో ఇన్నాళ్ళకుగానీ రెండో కవితా సంపుటి తేకపోవటం వెనక మీ జర్నలిస్ట్ వృత్తి కారణం కావొచ్చంటారు మరో ముందుమాటలో శివారెడ్డి...

కవితా సంపుటి తేకపోయి ఉండొచ్చు. కానీ, కవిత్వంతో కలిసినడవడం ఎప్పుడూ మానింది లేదు. ముఖ్యంగా జర్నలిజం వృత్తిలో ఉండటం వలనే అనేకానేక ఇతర సమస్యలు ఉన్నప్పటికీ కవిత్వంతో కలిసి ప్రయాణించగలుగుతున్నానని అనుకుంటా. అంతేగాక వృత్తిరీత్యా చాలా రాయాల్సివుండటం వల్ల కవిత్వం రాసేప్పుడు ఇతరులకంటే ప్రత్యేకమైన ఎరుకతో ఉండటం కూడా అలవాటయ్యింది. ఇక పుస్తకంగా తేవడం కాస్త ఖర్చుతో కూడుకున్నదే గాక, సమయం కూడా కేటాయించాల్సినది వృత్తిపరంగా అంత సమయం లేకపోవడం కవితా సంపుటి ఆలస్యంగా రావడానికి ఒక కారణం.

✆ 99486 80009

మనలో ఎవరూ నిత్య నిబద్ధులు కారు-దేనికైనా. నిబద్ధులమనుకునే ధోరణి ఒకటి ప్రబలంగా ఉండేది. దాని ఛాయలు ఇప్పటికీ ఉన్నాయి. కవిత్వాన్ని మనలోకి తీసుకుని, మన లోలోతుల్లోంచి పలవరించేప్పుడు- కేవలం నమ్మే అభిప్రాయాలు, భావాల వంటి బహిర్గత అంశాలే కాకుండా, మన అంతరంగం చీకటి కూడా కవిత్వానికి అంటుకుంటుంది. వాస్తవానికి అదే కవిత్వానికి బతుకునిస్తుందనుకుంట.



శిథిల శకలం పుష్పపు రేకు

గాఢత బరువు కాదు
తేలికా కాదు.
వస్తువు కాదు. అవస్తువూ కాదు.
కన్నీరు దాని నిజరూపం
గాఢత.. గాఢత.. నను చావనివ్వదు
అట్లాగని బతుకును పూర్తిగా
వంపుకోనివ్వదు
ఎందుకొచ్చిందిది.. లోపలికి
ఎవరు రానిచ్చారు
దీని చీకటి ధారా సందర్శనం
ఎవరు పూర్తిగా
చూడగలిగారు
దాహమెవరికి పూర్తిగా తెలిసొచ్చింది
ఇదెక్కడిదీ
ఎట్లా పుట్టుకొస్తుందీ
ఎవరు దీని తండ్రీ
తల్లి మాత ఎవరూ
చెప్పండి
దారి చూపండి
ఇది మధుర కల్లు సారా విషం
వంటి అమృతం
గాఢత...
నువ్వెవరూ
ఏ జన్మకొలకుల నుంచి జారిపడ్డావు
ఈ భూమ్మీద
లోపలి.. స్మృత రేగు పొదల మీద
గొంతులోపల
కణ కణ మండే నిప్పుకణికల మీద
ధారాపాత నిష్ఠుర దుఃఖాల మీద
నిరంతరం
వర్షించే శవయాత్రల మీద
ద్వేష నెనరుల మీద
అంతు చిక్కని
దరి దొరకని
చేజిక్కని
గాఢత...
నన్ను లోపల్నుంచి కోసే
రంపపు పండ్ల
నైశిత్యం.. కొశ్శెదనం
ఎవరిచ్చిందీ
ఎక్కడ్నుంచొచ్చిందీ

■ **సిద్ధార్థ**

మరికొంత "ఎఱిగి యెఱిగి"

'ఆదీ అంతము లేనిదే ఆధునికత అంటే' శీర్షికతో భట్టు వెంకటరావు గారు రాసిన వ్యాసానికి (వివిధ: డిసెంబర్ 30, 2019) కొనసాగింపుగా నన్నయ రాసిన మహాభారత భాగంలో "ఎఱిగి యెఱిగి"ని వాడిన మరో రెండు సందర్భాలు కూడా కనిపిస్తున్నాయి. పునరుక్తి చేసి చెప్పడమంటే నొక్కి వక్కాణించడమే! ఇది తెలుగులో కనిపిస్తుంది. తెలుగు ప్రాచీనతను ఎంతో కొంత నిలుపుకున్న తెలంగాణలో ఇప్పటికీ వినిపిస్తుంది. "పొయ్యి పొయ్యి వానికే ఇచ్చినవా", "చేసి చేసి చేతులు పోతున్నయ్", "తెలిసి తెలిసి వాని దగ్గరికే పోయినవా", "విని విని చెవులు చిల్లులు పడుతున్నయ్" లాంటివి కోకొల్లలు.

మహాభారత ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో శకుంతల తనను గుర్తు పట్టనట్టుగా నటిస్తున్న దుష్యంతుని నిలదీసే సందర్భంలోనూ "ఎఱిగి యెఱిగి"ని వాడడం కనిపిస్తుంది. "ఏల యెఱుకలేని యితరుల యట్ల నీ వెఱుగననుచు బలికెదెఱిగి యెఱిగి" అని శకుంతల దుష్యంతునితో అంటుంది. ఇక్కడ బాగా తెలిసి అనే అర్థంలోనేకాక కపటపూరితంగా తప్పించుకోచూస్తున్న దుష్యంతుని అంతరంగాన్ని బయటపెట్టే విధంగా ప్రయోగం సార్థకం. బహుశా, ఈ సందర్భంలోనూ సంస్కృతంలో ఈ పునరుక్తి ఉండకపోవచ్చు.

సభాపర్వం ద్వితీయాశ్వాసంలో ధర్మరాజు జూదంలో సర్వస్వాన్ని కోల్పోయిన సందర్భంలో ద్రౌపదిని తన దాసీజనంతో కలిసి ఇల్లు తుడవడానికి తీసుకొని రమ్మని దుర్యోధనుడు విదురుని కోరినప్పుడు ఈ ప్రయోగం కనిపిస్తుంది. ద్రౌపది మహారాణి అని, పట్టాభిషేకానికి యోగ్యమైనదని, ఆమె పాండవుల ధర్మపత్ని అని, ఏ అండా లేనిది కాదని విదురుడు హెచ్చరించి, "ఏల యాశీవిషంబుల నెఱిగి యెఱిగి మూర్ఖవై యలిగించెదు?" అంటాడు. దుర్యోధనుడు అన్నీ తెలిసీ పాములవంటి పౌరుషం కలిగిన పాండవులకు కోపం తెప్పిస్తున్నాడని విదుర హితోక్తి. ఇక్కడ కూడా అనేక మార్లు పాండవుల ప్రతాపం ఏమిటో అనుభవమై కూడా, అజ్ఞానంతో ప్రవర్తిస్తున్న దుర్యోధనుని అంతరంగాన్ని బయటపెట్టడమే కనిపిస్తుంది.

భట్టు వెంకటరావుగారు చెప్పినట్టు నన్నయ కేవలం సంస్కృత తత్సమాలనే విరివిగా ఉపయోగించాడనే భావనను వదిలి, ఆయన వాడిన తెలుగు పట్టులను కూడా చూడవలసిన అవసరం ఉన్నది. ఆ దృష్టితో చూసినప్పుడు నన్నయలో అనేక తెలుగు, పదాలు ఈనాటికీ తెలంగాణ, ఆంధ్రా వ్యవహారంలో ఉన్నవి కనిపిస్తున్నవి. మచ్చుకు కొన్ని "దవ్వు, బలిమి, మొగి, నా వలన, ఎరుక, ఇన్నూరు, మున్నూరు, చెప్పంగ, దినంబులు, ఎల్లి, కూడుకొని, క్రుంగుట, వినంగ, ప్రొద్దు" మొదలైనవి.

■ **బూర్ల వేంకటేశ్వర్లు**

స్వాప్నికులు మేల్కొనే ఉంటారు

సెకనుకు సెకనుకు మధ్య
గడియారం విశ్రమించటం చూశాను
శరీరానికి చెమటకు
ఏ విశ్రాంతి లేని నువ్వు
సొమ్మసిల్లావో
అలసి కన్నే మలిగిందో
ప్రశాంత ముఖారవిందం
కల్లోలాకాశమవటం చూశాను
కదలాడే నీ కనురెప్ప
ఆవలి వైపు
కలల వర్ణచిత్రాలను
కలవరింతలను
ఉలికిపాట్లను చూశాను
రెండు నీలి గోళాలు
నీ చుట్టూ
నీ బంధాల చుట్టూ
సహనంగా
తిరగాడటం చూశాను
వెన్నలవాడనా
పూలతెప్పనా
ఎన్ని ఆటంకాల నిలయమీ ప్రయాణమని
ముందే నిశ్చయించుకున్నావేమో
ఆఖరికి వచ్చే కన్నీరు
మొదటనే
కనుకొలుకులు ఒత్తుకుంటున్నావు
ఏ దుఃఖపు తెమ్మెరా
ఎవరి మీదా వాలకుండ
అడ్డుపెట్టిన తడికొంగు తెరను
ముద్ద ముద్దగా పిండుకుంటున్నావు
పెనంమీంచి
పోయిలోకి
వస్తువాహనంలోనే
ఇల్లు మారుతున్నావు
నేలమట్టిని ద్వేషించదు కాని
మబ్బు చినుక్కు అసూయ చెందదు కాని
హృదయ భరితం కావాల్సిన చోట
వాకిలి
నిన్ను సంశయిస్తున్నది
బతికించటానికి
బతుకుతున్న ఊపిరివి
చినిగిన సీతాకోకచిలుకవయ్యావు.
ఏ భయాల అంతరాలు శ్వాసించావో
ఉదయాస్తమానాలూ
మోక్కుకుంటున్నావు
గద్దె మారు రంగుల్ల
ఇంకని కలలసారాన్ని వడకడుతున్నావు
శిలవంటి నీ మనోబలం
రాలిన బంతి రెక్కవుతున్నది
తేనెలొలికే నీతులను
చేదుగా మింగటం నేర్చుకున్నావు
తొలకరి లేత సస్యానివి
దీపానికి చేతులు అడ్డుపెట్టినట్టు
నీ వెచ్చదనం
విశ్వవర్ధనాన్ని అంతర్వీక్షిస్తున్న ఆనందాన్ని- చూసాను
పురిటినాళ్ల గాయాలలో
పున్నమిరాలు పువ్వులేరుతున్నావు
పరాయి స్వేద ముత్యానివి
సగంవిఘటనమవుతున్న దానివి
వ్యూహాల విపణి జాలిలో
విలవిలా చిక్కుకున్నావు
కాలం వణుకుమడతలు కప్పుకుంటున్నది
పక్షులు ఎగిరాయి
పంతాలు చల్ల బడలేదు
పాలగ్లాసులో
కాడలా మిగిలి ఉన్నావు
ఏం మిగిలిందని
యవ్వనం నడిమోపుపచ్చి చీరికల మీద
వాలుతున్న సంధ్య
జాలి జాలిగా స్పృశిస్తున్నది
స్వాప్నికులు
మేల్కొనే ఉంటారు
లే!
నువు నిద్ర లేచినంతనే
ఎడారులు దిమ్మదిరిగి
పచ్చిక బయళ్ళవుతాయి
నువు నిద్రలేచినంతనే
విషాలు విషం విరిగి
అమృతాలు వర్షిస్తాయి

■ **బెల్లంకొండ సంపత్ కుమార్**
99085 19151

'ఏనుగు నరసింహారెడ్డి సాహిత్యాంతరంగం'

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రాసిన 'ఏనుగు నరసింహారెడ్డి సాహిత్యాంతరంగం' పుస్తకావిష్కరణ సభ జనవరి 22 సా.6గం.లకు సుందరయ్య విజ్ఞానకేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. నాళేశ్వరం శంకరం, కె. శివారెడ్డి, రామశేషయ్య తదితరులు పాల్గొంటారు.

పాలపిట్ట బుక్స్

'జన్నాభట్ల కథలు'

జన్నాభట్ల నరసింహప్రసాద్ రాసిన 'జన్నాభట్ల కథలు-5' ఆవిష్కరణ సభ జనవరి 22న త్యాగరాయ గానసభలో జరుగుతుంది. ముదిగొండ శివప్రసాద్, గుదిబండి వెంకట రెడ్డి, విహారి, రమణ వెలమకన్ని తదితరులు పాల్గొంటారు.

పొత్తూరు సుబ్బారావు

'సింగమనేని సాహిత్య పురస్కారం'

సింగమనేని సాహిత్య పురస్కారం కోసం జనవరి 2018-డిసెంబర్ 2019మధ్య ప్రచురితమైన కథా సంపుటులను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ సంపుటికి రూ.16వేల బహుమతి. కథకులు మూడు కాపీల చొప్పున జనవరి 30లోపు చిరునామా: ఏరువాక సాహిత్య సాంస్కృతిక సంస్థ, 7-1-507, ఎన్జీవో కాలనీ, వాటర్‌ట్యాంక్ ఎదుట, బద్వేల్-516227కు పంపాలి. ఫోన్: 7013736729.

ఎలిచర్ల గజేంద్రనాథరెడ్డి

కవిసంధ్య కవితల పోటీలు

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి శతజయంతి, ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఆంధ్రీ కుటీరం, కవిసంధ్య సంయుక్త నిర్వహణలో జరిగే వచన కవితల పోటీకి కవితలను ఫిబ్రవరి15, 2020లోగా పంపాలి. చిరునామా: దాట్ల దేవదానంరాజు, జక్రియా నగర్, యానాం (పోస్ట్), తూ.గో.జిల్లా-533 464. ఫోన్: 94401 05987.

దాట్ల దేవదానం రాజు

అభినందన సంచికలకు రచనలు

50ఏళ్ళ సాహిత్య జీవితాన్ని పూర్తి చేసుకున్నందుకు ముదిగంటి సుజాతారెడ్డిపై 'బహుముఖీన' పేరుతోను, 30ఏళ్ళ సాహిత్య జీవితాన్ని పూర్తి చేసుకున్నందుకు ఏనుగు నరసింహారెడ్డిపై 'ప్రవాహం' పేరుతోను తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అభినందన సంచికలు తేవనున్నది. స్నేహితులు, సాహిత్య మిత్రులు వీరితో అనుబంధం గురించి వ్యాసాలు, అభిప్రాయాలు, జ్ఞాపకాలను ఫిబ్రవరి 15లోగా చిరునామా: గంటా జలంధర్‌రెడ్డి, ఇం.నెం.2-2-1105/21, ఫ్లాట్ నెం.201, రోహణం, తిలక్‌నగర్, హైదరాబాద్ 500044కు పంపాలి. ఫోన్: 98482 92715.

గంటా జలంధర్‌రెడ్డి

epaper.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 20 జనవరి 2020

వైరల్

'లైంగిక జీవితంలో ఆడవాళ్ల అభిప్రాయానికి విలువ ఇవ్వాలి' అంటోంది బాలీవుడ్ నటి **బిదితా బాగ్**. తన అందం, అభినయంతో మోడల్‌గా రాణిస్తున్న ఈ సుందరి మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను నిరసిస్తూ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ చేసింది. అదిప్పుడు నెట్‌లో సంచలనం అవుతోంది. ఇంతకీ ఆ వీడియోలో బిదిత ఏం చెప్పారంటే...

యంత్రాలం కాదు... మనుషులమే!

'దిశ' హత్యోదంతం, మహిళలపై జరుగుతున్న దారుణాలపై తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకింత ఆవేశంగా స్పందించారు బిదితా బాగ్. 'సెక్స్‌కు ఆడవాళ్ల అంగీకారం ఎంత ముఖ్యమో... తమ ఛాయిస్‌ను వ్యక్తపరచడం కూడా వారికున్న హక్కు అనే విషయాన్ని ఈ సమాజం అర్థం చేసుకోవడం అంతే ముఖ్యం' అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారామె.

ఆడవాళ్లు యంత్రాలు కాదు...

మహిళలపై జరుగుతున్న దాడుల్ని తీవ్రంగా నిరసిస్తూ బిదిత ఒక ఫొటో వీడియోను పోస్ట్ చేశారు. అందులో ఆమె ప్లకార్డులు పట్టుకొని ఉన్న కొన్ని ఫొటోలతో ఉన్న వీడియో ఉంటుంది. వీడియో ప్రారంభంలో బిదిత చిరిగిన డ్రెస్సు ధరించి 'నా కొత్త లుక్‌ను చూడండి. జుట్టు, మేకప్, వార్డ్‌రోబ్ బై' అని రాసున్న ప్లకార్డ్ పట్టుకొని కనిపిస్తింది. ఆమె ఒంటి నిండా ఉన్న రక్తపు మరకలు, చిరిగిన దుస్తులు, చింపిరి జుట్టు చూస్తే ఆమె మీద ఎవరో దాడి చేశారని అర్థమవుతుంది. ఆ తరువాత ఫొటోలో 'సెక్స్‌కు ఆడవాళ్ల అంగీకారం అవసరం లేదని ఏ మగాడు చెప్పాడు' అని రాసున్న ప్లకార్డుతో కనిపిస్తుంది. 'రేప్ అనేది తప్పుడు పని. మహిళలపై హత్యాచారాల్ని అడ్డుకునేందుకు మనం ఎడ్యుకేట్ అవడమే కాదు, మన కమ్యూనిటీని కూడా ఎడ్యుకేట్ చేయాలి. లైంగిక జీవితంలో కన్సెంట్, ఛాయిస్ అనేవి ఆడవాళ్లకు జన్మత: వచ్చిన హక్కులు. తిండి, గూడు లానే ఇవి కూడా మౌలికమైనవి. మమ్మల్ని వాడుకోవడానికి, మాతో తప్పుగా ప్రవర్తించడానికి మేమేం యంత్రాలం కాదు. మేము కూడా మనుషులమే' అంటూ తన పోస్ట్‌లో భావోద్వేగంతో రాసుకొచ్చింది. చక్కగా డ్రెస్ వేసుకొని 'లెట్స్ బ్రింగ్ కన్సెంట్ ఇన్ ఫ్యాషన్ అగేన్' అని రాసున్న ప్లకార్డ్‌తో ఉన్న ఫొటోతో ముగిసే ఈ వీడియో ప్రస్తుతం నెట్‌లో వైరల్ అవుతోంది. సమాజానికి మంచి సందేశం ఇస్తున్న ఈ వీడియోను ప్రముఖ ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్ సోమ్‌సుభ్రో సర్కార్ రూపొందించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా తారలు, మోడల్స్ ఏదో ఒక రూపంలో తమ వాయిస్‌ను బలంగా వినిపిస్తూనే ఉన్నారు. సెలబ్రిటీల వాయిస్, యాక్షన్‌కు ప్రసార మాధ్యమాల్లో పెద్దఎత్తున మద్దతు లభిస్తోంది. బిదితా బాగ్ వీడియో కూడా ప్రస్తుతం బాగా వైరల్ అవుతోంది.



న్యూస్‌మేకర్

పసితనం నుంచే ప్రయాణాల మీద మొదలైన ఇష్టం కాస్తా ప్యాషన్‌గా మారి ఆమెతో ట్రావెల్ స్టార్టప్ నడిపించేలా చేసింది. ఔత్సాహిక పర్యాటకులతో క్యాంప్స్ నిర్వహించడమే కాదు... వారికి బాధ్యతాయుత పర్యాటకం ఆవశ్యకతను తెలియజేస్తున్నారామె. తాజాగా ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్ యాత్రకు మనదేశం నుంచి ఆమె ఒక్కరే ఎంపిక వ్వడం విశేషం. గడ్డ కట్టిన మంచు తోవలో, ఎముకలు కొరికే చలిలో... మరో సాహస యాత్రకు సన్నద్ధమవుతున్న **గీతూ మోహన్‌దాస్** ప్రయాణం ఇది...

ఆమె జీవితమే ఒక ప్రయాణం

ప్రకృతి అందాలతో అలరారే కొచ్చి (కేరళ)లోని అలువ గ్రామంలో పుట్టి పెరిగిన గీతూకు పర్యటనల మీద చిన్నప్పటి నుంచే ఆసక్తి. స్థానికంగా ఉన్న 'ఒరే భూమి ఒరే జీవన్' ('ఒకే భూమి ఒకే జీవితం') అనే స్థానిక సంస్థ పిల్లల్లో ప్రకృతి పట్ల ఇష్టాన్ని కలిగించేందుకు నిర్వహించే 'నేచర్ క్యాంప్స్' ఆమెకు కొత్త ప్రదేశాలు చూడడంలో ఉండే ఆనందాన్ని పరిచయం చేశాయి. "నేను అయిదో తరగతిలో ఉన్నప్పుడు మొదటిసారిగా 'నేచర్ క్యాంప్' వెళ్లాను. మమ్మల్ని పాలక్కడ్ జిల్లాలో ప్రకృతి అందాల నడుమ ఉన్న సిరువని డ్యామ్, జలపాతం వద్దకు తీసుకెళ్లారు. ఆ క్యాంప్ నాకు ప్రకృతి పట్ల పర్యాటకులకు ఉండాల్సిన బాధ్యతను తెలియజేసింది... ప్రపంచాన్ని చుట్టేయాలనే కోరికనూ పెంచింది" అంటూ తనకు పర్యాటకం మీద ప్రేమ మొదలైన రోజుల్ని గుర్తుచేసుకుంటారు గీతూ.

జీవితం మలుపు తిరిగిందిలా...

అప్పటిదాకా అడపాదడపా కొత్త ప్రాంతాలకు వెళ్లే గీతూ జీవితంలో అనుకోని మలుపు... ఆమెకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా 2015లో బెంగళూరులో ఉద్యోగం రావడం. సెలవు రోజులైన శని, ఆదివారాల్లో కేరళలోని పర్యాటక ప్రాంతాల్లో వాలిపోయేవారామె. పర్యటనలకు సంబంధించి తన ఆలోచనల్ని రూమ్మేట్స్, స్నేహితులతో పంచుకునేవారు. ఆసక్తిగల కొందరితో కొజికోడ్ జిల్లాలోని కక్కాడంపోయిలో మొదటి క్యాంప్ నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతివారం పర్యటనలు నిర్వహించేవారు. ఆ క్రమంలోనే 'లెట్స్ గో ఫర్ ఏ క్యాంప్' పేరుతో ట్రావెలింగ్ స్టార్టప్ ప్రారంభించారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే స్టార్టప్ ద్వారా టూర్లు నిర్వహిస్తూ బాధ్యతాయుత పర్యాటకం, గ్రామీణ జీవనాన్ని అనుభూతిలోకి తేవడం లక్ష్యంగా ఆమె సేవలు అందిస్తున్నారు. స్టార్టప్ మొదలెట్టిన నాలుగేళ్లలోనే మనదేశంలో, విదేశాల్లో 100కు పైగా క్యాంపులు నిర్వహించారు. ట్రావెలింగ్ మీద మహిళల్లో ఆసక్తి పెంచేందుకు 'సాహసిక' పేరుతో ట్రిప్స్ నిర్వహిస్తున్నారు కూడా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన గీతూ భర్త ఆదిశ్ స్టార్టప్ బాధ్యతల్లో ఆమెకు చేదోడుగా ఉంటున్నారు.

ఆర్కిటిక్ యాత్ర అవకాశం వచ్చిందిలా...

"ధ్రువాల పర్యటనకు వెళ్లాలనేది నా చిన్నప్పటి కల. అయితే అది చాలా ఖర్చుతో కూడింది. రెండేళ్ల క్రితం మనదేశం నుంచి ఆర్కిటిక్ యాత్రకు వెళ్లి వచ్చిన నియోగ్ ద్వారా పైసా ఖర్చులేకుండా ఈ ట్రిప్ వెళ్లొచ్చని తెలుసుకున్నా. ఆర్కిటిక్‌లో ఉష్ణోగ్రత మైనస్ 30-40 డిగ్రీల మధ్య ఉంటుంది. స్వీడన్, ఫిన్లాండ్ దేశాల మధ్య ఉన్న ఆర్కిటిక్ ప్రాంతానికి చేరుకోవాలంటే 300 కిలోమీటర్ల దూరం స్లెడ్జ్ బండి (కుక్కలు లాగే బండి) మీద ప్రయాణించాల్సి ఉంటుంది. స్వీడన్ సంస్థ 'ఫల్‌రావెన్' ఆర్కిటిక్ యాత్రకు ఈ ఏడాది సామాన్య యాత్రికులను ఎంపిక చేస్తుందనే విషయం 2018లో ఆర్కిటిక్ వెళ్లి వచ్చిన కొల్లామ్ నివాసి నియోగ్ కృష్ణన్ ద్వారా తెలుసుకున్నా. ఆ యాత్ర గురించి చాలా సమాచారం సేకరించి, నేను చేయగలను అన్న నమ్మకం వచ్చిన తరువాతే అప్లై చేశా. మిగతా సాహసయాత్రల్లో అయితే నియమాలు, నిబంధనలు చాలా ఉంటాయి. కానీ ఈ యాత్రలో సామాన్యులకు అవకాశం ఇవ్వడం గొప్ప విషయం" అంటారు గీతూ.

ఈ యాత్రలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు గతంలో తాము ట్రావెలింగ్ చేసిన వీడియోలు, ఫొటోలు స్వీడన్‌కు చెందిన 'ఫల్‌రావెన్' అనే పోలార్ కంపెనీ (చలికాలంలో ట్రెక్కింగ్‌కు వెళ్లే సాహసయాత్రికులకు ఉపయోగపడే సామగ్రి తయారుచేస్తుంది) ఫియోల్‌రావెన్ సంస్థ వెబ్‌సైట్లో పోస్ట్ చేయాలి. 'ఎందుకు అప్లై చేస్తున్నారు? ఈ ప్రయాణంలో ఏమేం చేయాలనుకుంటున్నారో' కూడా చెప్పాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా పలువురు సాహస ప్రియులు పాల్గొన్న ఈ పోటీలో మనదేశం నుంచి ఎంపికయ్యింది గీతూ మోహన్‌దాస్ మాత్రమే. ఈసారి ఎంపికైన 20మంది పేర్లను గత ఏడాది నవంబర్ 14న ప్రకటించింది. వీరిలో 10మందిని జడ్జింగ్ ప్యానెల్ ద్వారా, మిగతా వారిని ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా ఎంపిక చేసింది. ఆన్‌లైన్ ఓటింగ్ కోసం ప్రపంచాన్ని 10 జోన్‌లుగా విభజించి, ప్రతి జోన్‌లో ఎక్కువ ఓట్లు సాధించిన వారిని సెలక్ట్ చేసింది.

అవమానాలు భరించి విజేతగా...

"ఒక మహిళగా ఆర్కిటిక్ యాత్ర పోటీలో ఉన్నందుకు నాపై ఇంటర్నెట్‌లో అభ్యంతకర కామెంట్లు చాలా వచ్చాయి. అవి ఎప్పటికీ నన్ను వెంటాడుతూనే ఉంటాయి. ఇవన్ని చూసి పోటీ నుంచి మధ్యలోనే తప్పుకుందాం అని చాలా సార్లు అనుకున్నా. అయితే మంచుతో నిండిన ఆర్కిటిక్ ఖండాన్ని చేరుకోవాలనే నా కల, నా కుటుంబం, స్నేహితులు ఇచ్చిన మద్దతుతో చివరకు విజేతగా నిలిచాను. నాకు ఈ అవకాశం రావడం ఎంతోమంది అమ్మాయిలు, మహిళల్లో ట్రావెలింగ్ మీద ఆసక్తి పెంచేందుకు దోహదపడుతుంది" అంటున్నారు గీతూ. ఆర్కిటిక్ యాత్ర కోసం ఆమె సన్నాహాలు కూడా చేసుకుంటున్నారు.

"స్వీడన్ సంస్థ 'ఫల్‌రావెన్' ఆర్కిటిక్ యాత్రకు ఈ ఏడాది సామాన్య యాత్రికులను ఎంపిక చేస్తుందనే విషయం 2018లో ఆర్కిటిక్ వెళ్లొచ్చిన కొల్లామ్ నివాసి నియోగ్ కృష్ణన్ ద్వారా తెలుసుకున్నా. ఆ యాత్ర గురించి చాలా సమాచారం సేకరించి, నేను చేయగలను అన్న నమ్మకం వచ్చిన తరువాతే అప్లై చేశా. మిగతా సాహసయాత్రల్లో అయితే నియమాలు, నిబంధనలు చాలా ఉంటాయి. కానీ ఈ యాత్రలో సామాన్యులకు అవకాశం ఇవ్వడం గొప్ప విషయం"

సంస్కృతి

పోతన మాట... ఈతరం నోట!

వాళ్ళందరూ ఎనిమిది నుంచి పదిహేనేళ్ళ మధ్య వయసున్న బాలబాలికలే!

కానీ తెలుగువారికే ప్రత్యేకమైన పద్యాల వైభవాన్ని చాటిచెప్పే వాహికలయ్యారు.

మహాకవి బమ్మెర పోతన రచించిన 'ఆంధ్ర మహా భాగవతా'న్ని రాగయుక్తంగా ఆలపించి శభాష్ అనిపించుకున్నారు.

ఇప్పుడిక యువతరం వంతు...

ఒక ప్రముఖ ఆధ్యాత్మిక ఛానల్‌లో ఆ మందార మకరంద మాధుర్యం మరోసారి వీనుల విందు చేస్తోంది.

బమ్మెర పోతన తెలుగులో రాసిన 'ఆంధ్ర మహా భాగవతం' అనేక ప్రత్యేకతల సమాహారం. వినోదం పేరిట విపరీత ధోరణులు చలామణీ అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించే భాగవత పద్యానికి మించిన అమృతం, ఔషధం లేదన్నది విజ్ఞుల మాట! అపురూపమైన భాగవత పద్యాలను నేటి బాలలకూ, యువతరానికీ పరిచయం చేసి, ఆ పద్య మందారాల్లోని మకరందాన్ని వారి అనుభవంలోకి తెచ్చే కార్యక్రమాన్ని కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ చేపట్టింది. కిందటి ఏడాది ఆగస్టు 24వ తేదీన ఒక టీవీ ఛానెల్‌లో ప్రారంభమై, ఇరవై వారాల పాటు కొనసాగిన 'పలికెద భాగవతము' కార్యక్రమం దేశ, విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారి ప్రశంసలను అందుకుంది. ఈ నెల పన్నెండు నుంచి నుంచి రెండో విడత మాధుర్యం ప్రేక్షక, శ్రోతలను అలరిస్తోంది.

సరికొత్త ప్రయోగం

"సంగీతం, సాహిత్యం మనతో పాటు ప్రయాణం చేస్తూ ఉంటాయి. చిన్నప్పుడు విన్న ఒక పాట, నేర్చుకున్న ఒక పద్యం మన జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. అందుకే వాటిని మళ్ళీ విన్నప్పుడు మనం ఆ వయసులోకి వెళతాం. ఆ విధంగా సంగీతానికి ఒక నోస్టాలజిక్ వాల్యూ ఉంది. అలాంటి జ్ఞాపకాలను ఈ తరం పిల్లలకు మనం అందిస్తున్నామా? ఊహ సరిగ్గా తెలియని చిన్న పిల్లలు ఐటమ్ సాంగ్స్‌కు నాట్యాలు చేస్తూ ఉంటే చూడడానికి బాధగా అనిపిస్తోంది. వాళ్ళను ఆ దిశగా తల్లితండ్రులు ప్రోత్సహిస్తున్నారు కూడా! కానీ మరో నల భయ్యేళ్ళో, అరవయ్యేళ్ళో గడిచాక, ఆ పిల్లలు వెనక్కి తిరిగి చూసుకుంటే... నా చిన్నప్పుడు ఫలానా ఐటమ్ సాంగ్‌కు నాట్యం చేశానని సొంత పిల్లలతోనో, మనుమలతోనో ఇబ్బంది లేకుండా చెప్పుకోగలరా? నన్ను వెంటాడిన ఈ ఆలోచనే కిందటి ఏడాది నేను ప్రారంభించిన 'పలికెద భాగవతము' కార్యక్రమానికి పునాది. క్రమంగా ఈ కార్యక్రమాన్ని చూసిన మిత్రులూ, శ్రేయోభిలాషులూ నాకు అండగా నిలిచారు. మంచి పని చేస్తున్నారని అందరూ మెచ్చుకుంటూ ఉంటే ధైర్యం వచ్చింది" అని ఈ కార్యక్రమ రూపకర్త, సంగీతకర్త అయిన ప్రసిద్ధ గాయకుడు, సంగీత దర్శకుడు నేమాని పార్థసారథి వివరించారు

"పాటలు ప్రధానంగా కార్యక్రమాలు వస్తున్నా, పద్యాల మీద ఇంత వరకూ పూర్తి స్థాయి కార్యక్రమం ఎక్కడా రాలేదు. ఒకే కవికి చెందిన, ఒకే కావ్యంలోని పద్యాలను అర్థవంతంగా, రాగయుక్తంగా చిన్నారులు ఆలపించి, పద్యభావాలను సైతం వివరించడం తెలుగు ప్రసార మాధ్యమాలలో ఇదే తొలి సారి! న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం, సహస్రావధాని డాక్టర్ గరికిపాటి నరసింహారావు, ప్రముఖ కవి జొన్నలవిత్తుల రామలింగేశ్వరరావు, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, ప్రొఫెసర్ నీలకంఠ, రంగాచార్య తదితరులు వ్యవహరించి, చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు. అదే ఉత్సాహంతో 'పద్య మందార మకరందం పలికెద భాగవతము' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ ఏడాది జనవరి 12న మొదలయిన రెండవ సంచికలో 16-22 మధ్య వయసున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారు" అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి ప్రోత్సాహం, ప్రాచార్య శలాక రఘునాథ శర్మ ఆశీస్సులు మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నాయి" అని పేర్కొన్నారు.

అదే నా నమ్మకం!

"మన సంస్కృతి, భాష, నైతిక విలువలు, ధర్మం, న్యాయం... ఇలాంటి అంశాలు ఉన్న పద్యాలను పిల్లలకు పరిచయం చేసి, ఆ విలువలను గ్రహించేలా చేస్తే, వారిలో కొందరైనా స్ఫూర్తి పొందుతారనీ, వాటిని జీవితానికి అన్వయించుకుంటారనీ, తోటివారికి సాయం చెయ్యకపోయినా చెడు చెయ్యకూడదనే ఆలోచనలనూ, శాంతమైన స్వభావం అలవరచుకోగలరనీ నా నమ్మకం."

- నేమాని పార్థసారథి

ఆద్యంతం వైవిధ్యభరితం...

"మొదటి విడతగా 8-15 మధ్య వయసున్న పిల్లలతో నిర్వహించిన 'పలికెద భాగవతము' మంచి ఆదరణకు నోచుకుంది. భాగవత పద్యాల్ని రాగ, భావ యుక్తంగా ఆలపించడం మొదలుకొని భాగవత పాత్రలకు సంబంధించిన క్విజ్ వరకూ... పూర్తి వైవిధ్యంగా రూపొందిన ఈ సంచికలన్నీ 'కీర్తన అకాడెమీ ఆఫ్ మ్యూజిక్' యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంచింది. అదే స్ఫూర్తితో ఇప్పుడు 'భాగవతం ఆణిముత్యాలు ట్రస్ట్' సహకారంతో 'పద్య మందార మకరందం పలికెద భాగవతము' పేరుతో పద్యాల పోటీ కార్యక్రమాన్ని ప్రారంభించాం" అని వెల్లడించారు రచయిత ఓలేటి శ్రీనివాసభాను.

ఓ మంచి జ్ఞాపకంగా మిగలాలని...

"మా కార్యక్రమానికి వస్తున్న స్పందన ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా కలిగిస్తోంది. మొదటి సీజన్‌లో సెలక్షన్లకు 98 మంది వచ్చారు. వారందరూ ఆరు నుంచి పదిహేనేళ్ళ మధ్య వాళ్ళు. రెండో సీజన్ సెలక్షన్లకు 120 మంది వచ్చారు. ఇది ఆనందమైతే... వీరు పదహారు నుంచి ఇరవై రెండేళ్ళ మధ్య వయసున్న వాళ్ళు. ఇది ఆశ్చర్యం! ఇంతమంది పిల్లలు స్మార్ట్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం నుంచి పక్కకు మళ్ళి, పద్యాల్లోని మకరందాన్ని ఆస్వాదించాలన్న తపనతో ముందుకు రావడం గొప్ప సంగతి. మా పిల్లలు ఎంపిక అవకపోయినా ఫరవాలేదు, ఈ కార్యక్రమాన్ని మాత్రం ఆపకండి" అని వారి తల్లితండ్రులు చెబుతున్నప్పుడూ, ఎందరో సంగీతజ్ఞులు, పండితులు, పెద్దలు ఆశీర్వదిస్తున్నప్పుడూ ఎంతో ఆనందంగా ఉంటోంది. మంచి పని చేస్తున్నాననే సంతృప్తి కలుగుతోంది" అంటున్నారు పార్థసారథి.

'పలికెద భాగవతము'లో పాల్గొన్న బాలలతో పార్థసారథి, గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ప్రాచార్య శలాక రఘునాథ శర్మ

తెలుగు వారికే ప్రత్యేకమైన పద్య సాహిత్యాన్ని కొత్త తరానికి పరిచయం చేయడం, మంచి మార్గంలో నడవాలన్న ఆలోచన పిల్లలలో కలిగించడం ఈ ప్రయత్నం వెనుక ఉద్దేశం.

ఫిట్‌నెస్

10 నిమిషాల్లో ఫలితం!

బరువు తగ్గాలంటే కొవ్వు కరిగించాలి. అయితే ఇందుకోసం సమయం కేటాయించలేకపోతున్నారా? అయితే పట్టుమని పది నిమిషాల్లో ఫలితం చూపించే వ్యాయామాలు క్రమం తప్పక చేయాలి! అవేమిటంటే.....

జంపింగ్ జాక్స్: రెండు చేతులు పైకెత్తి ఎగురుతూ, రెండు కాళ్లు దూరంగా జరపాలి. చేతులు పక్కలకు దింపేటప్పుడు కాళ్లను దగ్గరకు జరపాలి. ఇలాంటి జంపింగ్ జాక్స్ 25 ఆపకుండా చేయాలి.

స్క్వాట్స్: చేతులు రెండు ముందుకు చాపి, కలిపి పట్టుకుని, కుర్చీలో కూర్చున్నట్టుగా నేల మీదకు కుంగే స్క్వాట్స్ ఆపకుండా 45 సెకన్ల పాటు చేయాలి.

పుషప్స్: నేల మీద బోర్లా పడుకుని రెండు అరచేతులు నేల మీద ఆనించి పైకి లేచే పుషప్స్ ఆపకుండా 45 సెకన్ల పాటు చేయాలి.

వాల్ సిట్స్: 45 సెకన్ల పాటు గోడ కుర్చీ వేయాలి.

ప్లాంక్: పాదాలు, అరచేతులు మాత్రమే నేల మీద ఆనించి, వాటి ఆధారంగా శరీరాన్ని లేపి ఉంచే ఈ వ్యాయామం 45 సెకండ్ల పాటు చేయాలి.

ప్రతిరోజూ 45 సెకన్ల పాటు గోడ కుర్చీ వేయాలి. ఈ వాల్ సిట్స్‌తో కండరాలు బలంగా మారతాయి.

ఇలా చేయండి!

వంటింటి కష్టాలు దూరం కావాలంటే...

వంటింట్లో చిన్న చిన్న పనులు కొన్నిసార్లు విసుగు తెప్పిస్తాయి. వాటికి మంచి చిట్కాలున్నాయి. వాటిని ప్రయత్నిస్తే ఎంతో ఉపశమనం కలుగుతుంది.

- వేడి పెనం మీద చపాతీ కాల్చేటప్పుడు కొన్నిసార్లు అది పెనానికి అతుక్కుపోయి సరిగా రాదు. అలాంటి సమయంలో ఒక స్ప్రే బాటిల్ తీసుకుని అందులో కొద్దిగా ఆవాల నూనె, నీళ్లు పోసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని పెనం మీద కొద్దిగా చిలకరించి ఆ తర్వాత చపాతీ కాల్చితే అతుక్కోదు.
- కొత్త ప్యాకెట్‌ని కట్ చేసిన తర్వాత దాన్ని తిరిగి ప్యాక్‌లా ఉంచాలనుకుంటే చాకును మంట మీద కాసేపు కాల్చి దానితో కత్తిరించిన ప్యాకెట్ అంచుల దగ్గర గట్టిగా రాస్తే అంచులు అతుక్కుపోయి ప్యాకెట్‌లా ఉంటుంది.
- సాధారణంగా వంటింట్లో ఒకే రకమైన స్టీలు డబ్బాల్లో పసుపు, కారం, పోపు దినుసులు, పంచదార, చక్కెర లాంటివి పెడుతుంటాం. దీనివల్ల వంట చేసే కంగారులో ఏది ఏమిటో తెలియదు. అలాంటి గందరగోళానికి లోనుకాకుండా ఉండేందుకు రకరకాల కలర్ స్ట్రిప్స్‌ని వాటిపై అతికిస్తే వెంటనే కావలసిన డబ్బా గుర్తించి తీసుకోగలం.
- గోధుమరవ్వ పురుగు పట్టకుండా ఎక్కువ కాలం ఉండాలంటే దాన్ని వేగించి చల్లారిన తర్వాత డబ్బాలో పోసుకోవాలి.
- బంగాళా దుంపలున్న బుట్టలో ఒక యాపిల్ పెడితే దుంపలు ఎక్కువ కాలం పాడవకుండా ఉంటాయి.
- సగం కోసిన సొరకాయ ముక్క పాడవకుండా ఉండాలంటే కట్‌చేసిన చోట సిల్వర్ ఫాయిల్ చుడితే సరి.
- ఉల్లిపాయ ముక్కలు తరిగిన తర్వాత బంగాళా దుంప ముక్కతో చేతులను శుభ్రం చేసుకుంటే ఘాటు వాసన పోతుంది.

ఇంజనీరింగ్, మెడిసిన్, కంప్యూటర్ కోర్సులకు ఢీటుగా ఉపాధిపరంగా నెంబర్ వన్‌గా నిలుస్తోన్న కోర్సు.. చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ). ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సీఏ నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా చిన్న వయసులోనే ఆకర్షణీయమైన వేతనంతోపాటు సమాజంలో హోదా, గౌరవం అందుకునే సౌలభ్యాన్ని సీఏ కోర్సు కల్పిస్తోంది. సీఏలో ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్ అనే మూడు దశలు ఉంటాయి. వీటిల్లో ఫైనల్ కీలకం. ఈ దశను విజయవంతంగా పూర్తి చేస్తేనే క్వాలిఫైయిడ్‌గా సీఏగా పరిగణిస్తారు. ఇటీవల వెలువడిన సీఏ ఫైనల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు విజయవాడకు చెందిన గుర్రం నాగశ్రీకృష్ణ ప్రణీత్. ఈ నేపథ్యంలో ప్రణీత్ సక్సెస్ స్టోరీ అతని మాటల్లోనే..

సీఏ పదం.. కొత్త ఉత్సాహం ఇచ్చేది

577 మార్కులు

సీఏ ఫైనల్ దశలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది. సీఏ ఫైనల్ దశలో 800కిగాను 72.13 శాతంతో 577 మార్కులు వచ్చాయి. మొదటి ర్యాంక్ వచ్చిన విషయాన్ని ఐసీఏఐ అధ్యక్షుడు ఫోన్ చేసి చెప్పారు. కానీ దాన్ని ఫ్రాంక్ కాల్ అనుకున్నా. తరవాత వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకొని మొదటి ర్యాంకును నిర్ధారించుకున్నాక ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను.

రోజుకు 15 గంటలు

సీఏ ఫైనల్ దశకు సొంతంగానే చదివాను. ఈ విషయంలో ప్రిన్సిపల్ ఆడిటర్ తుమ్మల రామ్మోహన్‌రావు గైడెన్స్ ఇచ్చారు. వారి సలహా మేరకు ఒక షెడ్యూల్ ప్రకారం ఫైనల్ పరీక్షలకు సిద్ధమయ్యాను. రోజుకు 15 గంటలు ప్రిపేర్ అయ్యేవాణ్ని. రివిజన్ సులభంగా ఉండటం కోసం షార్ట్ నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను. మాక్ టెస్ట్‌లు రాశాను. ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. సమయపాలన, ప్రెజెంటేషన్ వంటి విషయాల్లో మెరుగయ్యాను. నిరంతరం కాకుండా అప్పుడప్పుడు ప్రిపరేషన్ మధ్యలో విశ్రాంతి తీసుకునేవాణ్ని.

కుటుంబ నేపథ్యం

మాది విజయవాడ. నాన్న మధుసూధన రావు ఒక ఆటోమొబైల్ షాపులో పని చేస్తున్నారు. అమ్మ మల్లీశ్వరి. 10వ తరగతి వరకు విజయవాడలోని విశ్వజ్యోతి హైస్కూల్‌లో చదివాను. 10వ తరగతిలో 9.8 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి.

చిన్నప్పటి నుంచే

చిన్నప్పటి నుంచే సీఏ కోర్సు అంటే ఆసక్తి. ఇదే విషయాన్ని నాన్నకు చెప్పాను. ఆయన కూడా ఈ దిశగా నన్ను ప్రోత్సహించారు. నాన్న, పెదనాన్నకు కూడా కామర్స్ కోర్సులు చదవాలనే కోరిక ఉండేది. కానీ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వాళ్లు ఆ కోర్సులు చదవలేకపోయారు. అయితే వాళ్లనే స్ఫూర్తిగా తీసుకొని కామర్స్ కోర్సుల్లో ప్రధానమైన సీఏ చేయాలని నిర్ణయించుకున్నాను.

తొలి ప్రయత్నంలోనే

సీఏ లక్ష్యంగా మాస్టర్‌మైండ్స్‌లో ఇంటర్ ఎంపీసీలో చేరాను. ఇంటర్‌లో 972 మార్కులు వచ్చాయి. అదే సమయంలో సీఏ సీపీటీలో 200కుగాను 156 మార్కులు, అటుపై సీఏ-ఐపీసీసీలో 414 మార్కులు సాధించాను. చివరగా ఫైనల్ దశను తొలి ప్రయత్నంలోనే పూర్తి చేయడమే కాకుండా జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ రావడం చాలా ఆనందం కలిగించింది.

మాక్ టెస్ట్‌లు రాయాలి

సీఏ ఫైనల్ దశను మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేయాలనుకుంటే ముందుగా షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. మాక్ టెస్ట్‌లు రాయాలి. రెండు సార్లు పూర్తిస్థాయిలో రివిజన్ చేసుకోవాలి. ఏదైనా ఒక ఆథర్ బుక్ లేదా సీఏ ఇన్‌స్టిట్యూట్ / కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్‌ను తప్పకుండా చదవాలి. పరీక్షకు ముందు రోజు ఫాస్ట్ ట్రాక్ రివిజన్ చేయాలి.

నేనే ఉదాహరణ

మాస్టర్‌మైండ్స్‌లో కోచింగ్ తీసుకునే సమయంలో సీఏ అనే పదం ఒక చోట రాసి రోజూ చూసుకోమనే వారు. చదువుకునే టేబుల్ మీద సీఏ అని రాసుకున్నాను. అది చూసినప్పుడల్లా కొత్త ఉత్సాహం వచ్చేది. సీఏలో చేరాలనుకునేవారు ఈ కోర్సును కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి. అద్భుత ప్రతిభ ఉంటేనే ఈ కోర్సులో రాణిస్తారు అనేది నిజం కాదు. ఉదాహరణకు నన్ను తీసుకుంటే సీఏ ఫైనల్‌కు ముందు ఏ దశలోను ర్యాంక్ రాలేదు. కానీ ఫైనల్లో మొదటి ర్యాంక్ వచ్చింది.

దేశంలో అత్యంత ఆదరణ కలిగిన కోర్సుల్లో ఇంజనీరింగ్ ఒకటి. ఏటా లక్షల మంది విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం కోసం వివిధ రకాల ఎంట్రెన్స్ టెస్ట్‌లకు హాజరవుతుంటారు. ఈ పరీక్షల్లో ప్రధానమైంది జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) - మెయిన్. ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీటు సాధించాలంటే మెయిన్‌లో మంచి ప్రతిభ చూపించాల్సిందే. అంతేకాకుండా దేశంలోని ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలు జేఈఈ-మెయిన్ స్కోర్ ప్రామాణికంగా ప్రవేశాలు కల్పిస్తుంటాయి. అంతటి ప్రాధాన్యం ఉన్న జేఈఈ మెయిన్-2020 తొలి దశ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జనవరి 17న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో దేశవ్యాప్తంగా తొమ్మిది మంది 100 పర్సంటైల్ సాధిస్తే.. అందులో నలుగురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు. ఆ నలుగురిలో **తడవర్తి విష్ణు శ్రీసాయి శంకర్, సాగారి కౌశల్ కుమార్ రెడ్డిలు** తమ సక్సెస్ స్టోరీని ఇలా వివరించారు..

జేఈఈ-మెయిన్‌లో తెలుగు తేజాలు

భావనలపై పట్టుతోనే విజయం

- **స్వస్థలం:** బాపట్ల, గుంటూరు జిల్లా
- **తండ్రి:** శ్రీనివాసరావు (టీచర్)
- **తల్లి:** సుబ్బరావమ్మ (టీచర్)
- **10వ తరగతిలో మార్కులు:** 10 / 10 (గ్రేడ్ పాయింట్లు)

తడవర్తి విష్ణు శ్రీసాయి శంకర్

విజయవాడలో హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఇన్‌స్టిట్యూట్ ఇచ్చిన టైమ్ టేబుల్ ప్రకారం నా స్టడీ అంతా సాగింది. ఉదయం ఆరున్నర నుంచి రాత్రి పదిన్నర వరకు మధ్యలో గంటన్నర బ్రేక్‌తో ఉండేది. సబ్జెక్టులకు అనుగుణంగా షెడ్యూల్ రూపొందించుకున్నాను. ముఖ్యంగా ఆయా సబ్జెక్టుల్లోని భావనలపై ఎక్కువగా దృష్టిసారించాను. అలాగే థియరీ కూడా చదివి, తర్వాత ప్రాబ్లమ్స్ చేస్తాను. నా వరకు మూడు సబ్జెక్టుల్లో మ్యాథమెటిక్స్ మిగతావాటికంటే కొద్దిగా సులువు అనిపిస్తుంది. నిజానికి మూడింటిపై పట్టు ఉంటేనే మంచి ర్యాంకు వస్తుంది. అందుకు తగ్గట్టే నా ప్రిపరేషన్ కూడా సాగింది. ఈ పరీక్షకు ముందు అయిదారు మాక్ టెస్టులు రాశాను. టెస్ట్ తరవాత విశ్లేషణ చేసుకున్నా. సొంతంగా విశ్లేషించుకొని, చేసిన తప్పులు మళ్లీ జరగకుండా చూసుకుంటాను. ప్రాబ్లమ్స్‌కు కాలిక్యులేషన్స్‌లో ఏదైనా తప్పు జరిగిందా అన్నది చూస్తాను. అదే కాన్సెప్ట్‌పరంగా జరిగితే మొదటి నుంచీ మళ్లీ నేర్చుకుంటాను.

- ఏది ఏమైనప్పటికీ కాన్సెప్ట్ ఆధారంగానే నా ప్రిపరేషన్ అంతా ఉంటుంది. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటాను. ముందు మాత్రం నేను ప్రయత్నిస్తాను. ఎప్పుడైనా ఒత్తిడి అనిపిస్తే ఇంట్లో వాళ్ళందరితో మాట్లాడతాను. హాస్టల్‌లో ఉన్న ఫ్రెండ్స్‌తో కూడా కొద్దిసేపు మాట్లాడితే ఒత్తిడి పోతుంది. మళ్లీ మామూలు అవుతాను.

థియరీ నేర్చుకున్న తరవాతే సాధన

- **స్వస్థలం:** చామలూరు (కడప జిల్లా)
- **తండ్రి:** శ్రీనీలకంఠా రెడ్డి (సౌత్ సెంట్రల్ రైల్వేలో ఇంజనీర్)
- **అమ్మ:** శ్రీలత (ట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్)
- **10వ తరగతిలో మార్కులు:** 10 / 10 (గ్రేడ్ పాయింట్లు)

సాగారి కౌశల్ కుమార్ రెడ్డి

నేను హైదరాబాద్‌లో ఇంటి దగ్గర ఉండే చదువుకున్నా. ఆదివారం ఖాళీ ఉంటే బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్ ఆడతాను. రిలాక్స్‌డ్‌గానే ఉంటాను. నా వరకు కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ వరుసగా సులువుగా అనిపిస్తాయి. పరీక్ష కూడా ఇదే వరుసలో అటెంప్ట్ చేశాను. ఈ పరీక్షకు ముందు పది వరకు మాక్ టెస్టులు రాశాను. ఎక్కడ తప్పు జరిగిందో చూసుకుని అది సరిదిద్దుకుంటాను. మళ్లీ జరగకుండా జాగ్రత్త పడతాను. కాన్సెప్ట్ అలాగే థియరీ క్షుణ్ణంగా నేర్చుకున్న తరవాత ప్రాబ్లమ్స్‌ను సాధన చేస్తాను.

- జేఈఈ మెయిన్ విషయానికి వస్తే, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో ముందుగా బేసిక్స్ నేర్చుకుంటే మంచిది. తర్వాత మరింత ఉన్నత స్థాయిలో ఉన్న పుస్తకాలు ఫాలో అయితే చివరకు జేఈఈ మెయిన్ ఎగ్జామ్‌ను సులువుగా అటెంప్ట్ చేయవచ్చు.
- ఒక పద్ధతి ప్రకారం ప్రిపరేషన్ సాగకపోతే ఇబ్బంది ఎదురవుతుంది. మెంటార్ చెప్పిన షెడ్యూల్‌ను పక్కాగా పాటించుకుంటూ ముందుకు వెళితే జేఈఈ మెయిన్‌లో చాలా మంచి ఫలితాన్ని పొందవచ్చు.

ఐటీఐ అభ్యర్థులకు.. డీఆర్‌డీవో ఉద్యోగాలు

దేశ రక్షణ సంబంధిత పరిశోధనల్లో కీలక పాత్ర పోషించే రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) నుంచి భారీ సంఖ్యలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకొని కొద్దిగా కష్టపడితే ఐదంకెల జీతంతో కెరీర్‌ను ప్రారంభించవచ్చు. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం..



డీఆర్‌డీవోకు చెందిన సెంటర్ ఫర్ పర్సనల్ టాలెంట్ మేనేజ్‌మెంట్ (సెప్టెమ్) ఆధ్వర్యంలో ఈ రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. డీఆర్‌డీవోలోని నాన్ గెజిటెడ్ విభాగానికి చెందిన టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ సంబంధిత ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సెప్టెమ్ పర్యవేక్షిస్తుంది. ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా 1817 పోస్టులను భర్తీ సెప్టెమ్ చేయనుంది. ఎంపికయిన వారికి ఏడో పే కమిషన్ సిఫార్సుల మేరకు వేతనం లభిస్తుంది. ఈ క్రమంలో నెలకు రూ. 18,000 - 56,900 మధ్యలో వేతనం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అలవెన్సులతోపాటు నేషనల్ పెన్షన్ సిస్టమ్ కూడా వర్తిస్తుంది.

- అర్హత: 10వ తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్
- వయసు: 18 - 25 సంవత్సరాలు (జనవరి 23, 2020 నాటికి). ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపునిస్తారు.

రెండు దశల్లో

ఎంపిక ప్రక్రియలో రెండు దశలు ఉంటాయి. వీటిని టయర్-1, టయర్-2గా వ్యవహరిస్తారు.

- **టయర్-1:** ఈ దశలో రాత పరీక్షను అబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్ / హిందీ భాషల్లో మాత్రమే రూపొందిస్తారు. సమాధానాలను గుర్తించడానికి 90 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అవి.. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ (35 ప్రశ్నలు, 35 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (30 ప్రశ్నలు, 30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ (35 ప్రశ్నలు, 35 మార్కులు). ఈ దశ కేవలం అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు. ఈ దశలో అభ్యర్థులు సాధించాల్సిన కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. ఈ క్రమంలో జనరల్, ఓబీసీ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 35 శాతం మార్కులను స్కోర్ చేయాలి.
- **టయర్-2:** ఇది కీలకమైన దశ. ఇందులో సాధించిన మార్కుల ప్రాతిపదికగానే తుది ఎంపిక ఉంటుంది. టయర్-1 దశలో పొందిన మార్కులాధారంగా ఆయా విభాగాల్లో ఖాళీలకు అనుగుణంగా 1:10 నిష్పత్తిలో అభ్యర్థులను టయర్-2కు ఎంపిక చేస్తారు. ఈ దశలో రాత పరీక్షను అబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్ /హిందీ భాషల్లో మాత్రమే రూపొందిస్తారు. సమాధానాలను గుర్తించడానికి 90 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అవి.. జనరల్ సైన్స్ (40 ప్రశ్నలు, 40 మార్కులు), జనరల్ మ్యాథ్స్ (40 ప్రశ్నలు, 40 మార్కులు), జనరల్ ఇంగ్లీష్ (20 ప్రశ్నలు, 20 మార్కులు).

పోస్టింగ్ ఇలా

చివరగా టయర్-2లో చూపిన ప్రతిభ, రిజర్వేషన్, ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటూ మెరిట్ లిస్ట్‌ను రూపొందించి పోస్టింగ్‌లను ఖరారు చేస్తారు. ఎంపికయిన అభ్యర్థులకు హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, మైసూరు, పుణె, ముంబై, ఢిల్లీ వంటి కేంద్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీవో సెంటర్లలో ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు.

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 23, 2020
- వెబ్‌సైట్: www.drdo.gov.in

జాబ్ కార్నర్

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల (వీఏఎస్) బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **78**
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీ.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2020.
- వెబ్‌సైట్: ahd.aponline.gov.in/

అసిస్టెంట్ ఇంజనీర్ ట్రెయినీ

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గేట్ స్కోర్ ద్వారా అసిస్టెంట్ ఇంజనీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **110**
- విభాగాలు: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.
- అర్హత: బీఈ / బీటెక్ / బీఎస్సీ (ఇంజనీరింగ్) తోపాటు సంబంధిత సబ్జెక్టుల్లో 2019 గేట్ స్కోర్.
- ఎంపిక విధానం: గేట్-2019 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2020.
- వెబ్‌సైట్: www.powergridindia.com/

విబిన్న

మంచిమాట
జీవితంలో విలువలు నేర్పించేదే నిజమైన విద్య.
- డా. బి.ఆర్. అంబేద్కర్

అవగాహన

బుష్‌ఫైర్‌తో పర్యావరణానికి ముప్పు!

ఆస్ట్రేలియాలో కార్చిచ్చు అడవులను నాశనం చేస్తోంది. కొన్ని లక్షల జంతువులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇప్పటికే సుమారు రెండున్నర కోట్ల ఎకరాల అడవులు బూడిదగా మారాయి. వంద కోట్లకు పైగా రకరకాల వన్యప్రాణులు చనిపోయినట్టు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ కార్చిచ్చు వల్ల దీర్ఘకాలంలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెబుతున్నారు పర్యావరణవేత్తలు. ఈ బుష్‌ఫైర్ వల్ల 400 మెగా టన్నుల కార్బన్‌డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలైందని యూరోపియన్ యూనియన్‌కు చెందిన 'కోపర్నికస్ అట్మాస్ఫియర్ మానిటరింగ్ సర్వీస్' సంస్థ వెల్లడించింది. ఈ బుష్‌ఫైర్ కారణంగా నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని భావించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం పదివేల ఒంటెలను చంపుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ప్రస్తుతం పర్యావరణం విషయంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఉదంతం తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో బుష్‌ఫైర్ అంటే తెలుసుకుందామా! వర్షాకాలంలో అడవుల్లో పచ్చగడ్డి బాగా ఏపుగా పెరుగుతుంది. వేసవిలో ఈ గడ్డి ఎండిపోయి ఉంటుంది. చెట్ల నుంచి రాలిన ఆకులు, గడ్డి చిన్న అగ్గి రాజుకున్నా చాలు అంటుకుంటాయి. ఒక్కసారి మంటలు రాజుకుంటే ఆపడం చాలా కష్టం. మంటలు చాలా వేగంగా విస్తరిస్తూ వెళతాయి. ఈ తరహా బుష్‌ఫైర్‌లు ఆస్ట్రేలియా, గ్రీస్, ఆఫ్రికా, క్యాలీఫోర్నియా, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో తరచుగా సంభవిస్తుంటాయి. కొన్నిసార్లు పిడుగులు పడటం వల్ల కూడా అగ్గి రాజుకుంటుంది. ఎగిసిపడే మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది, అధికారులు తీవ్రంగా కృషి చేస్తారు. స్థానికులు సైతం వారికి సహాయసహకారాలు అందిస్తారు.

5 తేడాలు గుర్తించండి

జనరల్‌నాలెడ్జ్

రక్తపీడనాన్ని(బి.పి) ఏ పరికరంతో పరీక్షిస్తారు?
1) స్పిగ్మోమానోమీటర్ 2) ఎలక్ట్రోమీటర్
3) గాల్వనోమీటర్ 4) లాక్టోమీటర్

జవాబు: 1. స్పిగ్మోమానోమీటర్

పోలికలు కనిపెట్టండి

ఇక్కడ తొమ్మిది బొమ్మలు ఉన్నాయి కదా! వీటిలో ప్రతి మూడు బొమ్మల మధ్య అడ్డం, నిలువు, ఐ మూలగా ఉన్న పోలికలు చెప్పగలరా!

జవాబు: 1. అంతరాయం, 2. అంతరాయం, 3. అంతరాయం.
2. అంతరాయం: 1. ఎడం, 2. ఉత్తరం, 3. పిట్ట.

డైలీ సుడోకు - 256

							9	1
1	6		3					7
						8		
	4	6	1	5				2
	8		9		6		7	
5				3	2	1	4	
		9						
4					1		2	9
6	7							

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 255 సమాధానం

1	8	5	4	7	2	9	3	6
4	6	2	3	9	8	5	1	7
7	9	3	6	5	1	8	4	2
6	3	7	8	2	9	4	5	1
5	2	4	1	3	6	7	9	8
8	1	9	7	4	5	2	6	3
2	5	6	9	8	3	1	7	4
9	7	1	2	6	4	3	8	5
3	4	8	5	1	7	6	2	9

వరంగల్‌లో జరిగిన 'సరిలేరు నీకెవ్వరు' విజయోత్సవంలో దేవీశ్రీ ప్రసాద్, అనిల్ సుంకర, రష్మిక, దిల్ రాజు, విజయశాంతి, అనిల్ రావిపూడి, మహేశ్.

ప్రభాస్ తండ్రిని మించిన తనయుడు!

- కృష్ణంరాజు

"గురువును మంచిన శిష్యుడిలా... ప్రభాస్ తండ్రిని మించిన తనయుడు. అయితే... ప్రతి తండ్రి తనయుడు ఎదగాలనుకుంటాడు. కానీ, తనయుడి చేతిలో ఓడిపోవాలనుకోడు. నేనూ అంతే! ఓటమి అన్నది నా జీవితంలోనే లేదు. కృష్ణంరాజు ఓటమిని అంగీకరించడు" అని కృష్ణంరాజు అన్నారు. ఆయన సుమారు 350కు పైగా చిత్రాల్లో నటించారు. పలు చిత్రాలు నిర్మించారు. ఎంపీగానూ చేశారు. ఆయన పుట్టినరోజు సోమవారం. ఈ సందర్భంగా శనివారం కృష్ణంరాజు విలేకరులతో మాట్లాడుతూ "ఈ ఏడాది మా గోపీకృష్ణ మూవీస్‌లో ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అందులో నేనూ కీలక పాత్ర చేస్తున్నా. రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. మూడు నెలలు ఇక్కడ చిత్రీకరణ చేసి, ఏప్రిల్‌లో విదేశాలు వెళతాం. వచ్చే వేసవిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. రాజకీయాల గురించి ఆయన మాట్లాడుతూ "భారతీయ జనతా పార్టీ పెరిగితే నేనూ పెరిగినట్టే. పార్టీ నన్ను కేంద్రమంత్రిని చేసింది. ఆ గౌరవం నిలబెట్టుకుంటున్నా. బీజేపీతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పొత్తును స్వాగతిస్తున్నా" అన్నారు.

యాక్షన్‌లో 'మోసగాళ్ళు'

విష్ణు

మంచు విష్ణు హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'మోసగాళ్ళు'. జెఫ్రీ గి చిన్ దర్శకుడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా వేసిన భారీ సెట్‌లో శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. హాలీవుడ్ యాక్షన్ దర్శకుల నేతృత్వంలో మంచు విష్ణు, హిందీ నటుడు సునీల్ శెట్టి మధ్య భారీ యాక్షన్ దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. "ఇప్పటివరకూ తెలుగు తెరపై రానటువంటి విధంగా ఈ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. వీటి కోసం విష్ణు, సునీల్ శెట్టి ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. తెలుగు సినిమాల్లో ఈ యాక్షన్ సీన్ ఓ మాస్టర్‌పీస్‌లా ఉంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి వేసవిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అని చిత్రబృందం తెలిపింది. కాజల్ అగర్వాల్, నవదీప్, నవీన్ చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షెల్డన్ చౌ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఆర్. విజయ్ కుమార్, ప్రొడక్షన్ డిజైన్: ఎం. కిరణ్‌కుమార్.

అల... హైలైట్స్!

- 'సిత్తరాల సిరపుడు...' పాడిన గాయకుడు సూరన్నకు అర్జున్ ఒక కోటును బహుమతిగా ఇచ్చారు.
- వేదికపై 'సామజ వరగమన' పాటను తెలుగులో అందంగా హీరోయిన్ పూజా హెగ్డే పాడడం విశేషం.
- శివమణి లైవ్ పర్ఫార్మెన్స్ ఇవ్వడమే కాదు.... బన్నీ, పూజా హెగ్డే, త్రివిక్రమ్, అల్లు అరవింద్ చేతికి స్టిక్స్ ఇచ్చి డ్రమ్స్ ప్లే చేయించారు.
- కొద్ది క్షణాల పాటు బన్నీ, పూజా హెగ్డే 'రాములో రాములా' పాటకు హాఫ్ కోట్ స్టెప్ వేశారు.

రికార్డులు టెంపరరీ... ఫీలింగ్స్ ఫరెవర్!

- అల్లు అర్జున్

'హలో బ్రదర్', 'గీతాంజలి', 'గ్యాంగ్‌లీడర్', 'శంకరాభరణం' వంటి గొప్ప చిత్రాలు చూసినప్పుడు... గొప్ప ఫీలింగ్ ఉంటుంది కదా? ఆ ఫీలింగ్ శాశ్వతం. ఇవాళ నేను రికార్డులు కొడతా... ఆర్నెల్లు, ఏడాది తర్వాత ఇంకొకరు కొడతారు. అయితే... ప్రేక్షకుల మనసులో స్థానం, ఆనందం శాశ్వతం. వాటిముందు రికార్డులు నథింగ్. రికార్డులు టెంపరరీ... ఫీలింగ్స్ ఫరెవర్" అని అల్లు అర్జున్ అన్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన చిత్రం 'అల... వైకుంఠపురములో'. అల్లు అరవింద్, సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మాతలు. ఆదివారం విశాఖలో విజయోత్సవం నిర్వహించారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ "థియేటర్లలో సినిమా చూడాలనేంతలా ప్రేక్షకులను కదిలించే సంగీతాన్ని తమన్ ఇచ్చాడు. 'విలువలతో సినిమా తీయండి. మేమెందుకు ఆదరించం?' అని ప్రేక్షకులు చెప్పారు. మాకు, తెలుగు సినిమాకు అది చాలా నమ్మకాన్ని ఇచ్చింది. ఈ చిత్రకథకు, చిత్రానికి, విజయానికి నాయకుడై నిలిచిన కథానాయకుడు బన్నీ. రిస్క్ తీసుకుని పాత్రను వెనక్కి తోయకుండా... పాత్ర వెనుక నిలబడి పరిణితితో సినిమా చేశాడు" అన్నారు. అల్లు అర్జున్ మాట్లాడుతూ "నా సినిమా హిట్ అయితే... కామెడీ, ఫైట్స్, యాక్షన్ బావుందని చెప్పేవాళ్లు. నా జీవితంలో తొలిసారి ఎవరు ఫోన్ చేసినా... 'నీ పర్ఫార్మెన్స్ అదిరిపోయింది' అంటున్నారు. త్రివిక్రమ్‌గారు నాకు తెలియకుండా నాతో ఇంతబాగా చేయించారు. చిరంజీవిగారితో మా నాన్న ఎన్నో ఇండస్ట్రీ హిట్లు తీశారు. రజనీకాంత్‌గారితో, 'మగధీర'తో రామ్‌చరణ్‌తోనూ, హిందీలో ఆమిర్‌ఖాన్‌తో ఇండస్ట్రీ రికార్డులు కొట్టారు. ఎప్పటికైనా గీతా ఆర్ట్స్‌లో నాన్నగారితో ఇండస్ట్రీ రికార్డు సినిమా కొట్టాలి' అనుకునే వాణ్ణి. నిజంగా... త్రివిక్రమ్‌గారూ... ఆల్మోస్ట్ ఫస్ట్ టైమ్ కొడుతున్నా. తండ్రితో ఇండస్ట్రీ రికార్డు కొడుతున్న ఆనందాన్ని నాకు త్రివిక్రమ్‌గారు మిగిల్చారు. ఇదొక్కటి చాలు. ఎవరితో కొట్టినా ఆ ఆనందం ఇంత పూర్తిగా ఉండేది కాదు. మా ఫ్యామిలీ తరపున ఆయనకు థ్యాంక్యూ" అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ... త్రివిక్రమ్ మాటల మాంత్రికుడు కాదు... సెల్యులాయిడ్ తాంత్రికుడు. ఈ వయసులో చినబాబుగారు వంటి గొప్ప స్నేహితుడు నాకు దొరికారు. ఆయన చేతల మనిషి" అన్నారు. తమన్ మాట్లాడుతూ "నేను ఇండస్ట్రీకి వచ్చి పాతికేళ్లు. సంగీత దర్శకుడిగా ప్రయాణం మొదలై పదేళ్లు. పదేళ్లల్లో 100 చిత్రాలు చేశా. త్రివిక్రమ్ మనసులోకి రావడానికి నాకింత టైమ్ పట్టింది. పదేళ్లు నా గుండెల్లో దాచుకున్న ప్రేమను పాటల్లో పెట్టా. అందుకే, పదేళ్లు నిలిచే పాటలు ఇచ్చా" అన్నారు.

మా కబుర్లన్నీ తిండి... జీవితం గురించే!

- నభా నటేశ్

"నేను రవితేజకు వీరాభిమానిని. ఆయన నటన, హుషారు, కామెడీ టైమింగ్ మరో స్థాయిలో ఉంటాయి. ఆయన చిత్రాల్లో 'విక్రమార్కుడు' నాకెంతో ఇష్టమైన చిత్రం. 'కిక్' కూడా ఇష్టమే. ఆయనెప్పుడూ సానుకూల దృక్పథంతో ఉంటారు. ఆయనతో నటించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. చిత్రీకరణలో ఖాళీ దొరికితే... మా కబుర్లన్నీ తిండి, జీవితం, ఆయన తోటలో పండే పళ్ళు గురించే" అని నభా నటేశ్ అన్నారు. రవితేజ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించిన చిత్రం 'డిస్కో రాజా'. ఇందులో నభా నటేశ్ ఓ నాయిక. ఈ నెల 24న సినిమా విడుదల కానున్న సందర్భంగా ఆమె చెప్పిన సంగతులు...

- ఇదొక సైన్స్ ఫిక్షన్ (సైఫై) థ్రిల్లర్. రవితేజ శైలిలో సాగే మాస్ సైఫై సినిమా. వీఐ ఆనంద్ సరికొత్తగా తెరకెక్కించారు. చిత్రకథ, నా పాత్ర వివరించగానే విపరీతంగా నచ్చేసింది. వెంటనే అంగీకరించా.
- నేను బ్యాంకు ఉద్యోగిగా కనిపిస్తా. వాహనాలకు రుణసదుపాయం ఇచ్చే శాఖలో పని చేస్తా. ఈతరం స్వతంత్ర్య భావాలు కల అమ్మాయిలా పాత్ర తీరుతెన్నులు ఉంటాయి. నా జీవితానికి చాలా దగ్గరైన పాత్ర అని చెప్పవచ్చు. రవితేజ, 'సత్యం' రాజేశ్, నరేశ్, నాకు మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఇతర నాయికలు పాయల్ రాజ్‌పుత్, తాన్యా హోప్‌తో నాకు సన్నివేశాలు లేవు. రవితేజ పాత్ర గురించి నేనేమీ చెప్పలేను. 24వ తేదీ వరకూ ఆగండి. తెలుస్తుంది.
- ప్రస్తుతం సాయితేజ్ 'సోలో బతుకే సో బెటర్', బెల్లంకొండ సాయిశ్రీనివాస్ సరసన మరో చిత్రం చేస్తున్నా. తమిళ, కన్నడ కథలు వింటున్నా. మంచివి వస్తే చేస్తా.

యంగ్ టీమ్‌తో...

పెళ్లిచూపులు', 'మెంటల్ మదిలో' వంటి చిత్రాలను నిర్మించిన రాజ్ కందుకూరి నిర్మిస్తున్న తాజా చిత్రం 'చూసీ చూడంగానే ' ఈ నెల 31న విడుదల కానుంది. నిర్మాత తనయుడు శివ కందుకూరి హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే దర్శకురాలిగా శేష సింధుకు ఇదే తొలి సినిమా. విడుదల తేదీని వెల్లడించేందుకు శనివారం ఉదయం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ ' యంగ్ టాలెంట్‌తో సినిమాలు తీయడానికి నేను ఇష్టపడతాను. అలాగే యంగ్ టీమ్ రూపొందించిన సినిమా 'చూసీ చూడంగానే'. చిత్రం సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. 'మధుర ఆడియో' ద్వారా పాటలను విడుదల

శివ, వర్ష

చేస్తున్నాం. ఇప్పటికే విడుదలైన మా మూవీ ట్రైలర్‌కు , సాంగ్స్‌కు మంచి స్పందన వచ్చింది' అని తెలిపారు. 'దర్శకురాలు శేష సింధు చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. నన్ను నమ్మి నాన్నగారు హీరోగా పరిచయం చేస్తున్నారు. మా సినిమాను విడుదల చేస్తున్న సురేశ్‌బాబుగారికి కృతజ్ఞతలు' అని చెప్పారు శివ కందుకూరి. దర్శకురాలు శేష సింధు మాట్లాడుతూ 'శివ కందుకూరికి యాక్టింగ్‌కు స్కోప్ ఉన్న సబ్జెక్ట్ ఇది. హీరోయిన్ వర్ష కూడా బాగా నటించింది. షూటింగ్ పూర్తయ్యేలోపు ఆమె తెలుగు బాగా నేర్చుకుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో 'మధుర' శ్రీధర్, హీరోయిన్లు వర్ష, మాళవిక కూడా పాల్గొన్నారు.

అనుష్క

జనవరిలో కాదు... ఫిబ్రవరిలోనే!

నిజానికి... జనవరి నెలాఖరున 'నిశ్శబ్దం'తో ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నారు అనుష్క. అండ్ కో. అయితే... రావడం లేదిప్పుడు. సాంకేతిక కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. అనుష్క, మాధవన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నిశ్శబ్దం'. హేమంత్ మధుకర్ దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మాతలు. తొలుత ఈ నెల 31న చిత్రాన్ని విడుదల చేయాలనుకున్నారు. ఇప్పుడు ఫిబ్రవరికి వాయిదా పడిందని తెలిసింది. వచ్చే నెలలోనే చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారని సమాచారం. అంజలి, మైఖేల్ మ్యాడసన్, షాలినీ పాండే, సుబ్బరాజు తదితరులు ప్రధాన తారాగణంగా క్రాస్ ఓవర్ సినిమాగా 'నిశ్శబ్దం' రూపొందింది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని మలయాళం, హిందీ, ఇంగ్లిష్‌లో డబ్బింగ్ చేస్తున్నాం. ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీత దర్శకుడు, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.

'ఫాక్స్' పదం తొలగించిన డిస్నీ

హాలీవుడ్‌లో ఎన్నో అద్భుత చిత్రాల నిర్మాణానికి వేదికగా నిలిచిన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్ స్టూడియో పేరులోని 'ఫాక్స్' పదం ఇకపై కనుమరుగు కానుంది. 75 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ స్టూడియోను వాల్ట్ డిస్నీ పిక్చర్స్ సంస్థ గత ఏడాది 71.3 అమెరికన్ బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన తర్వాత చోటుచేసుకొన్న మార్పుల్లో ఇది ప్రధానమైంది. . ఇక 'ఫాక్స్' పేరు లేకుండా 'ట్వంటీయత్ సెంచరీ స్టూడియోస్' గా, 'ఫ్యాక్స్ సెర్చ్‌లైట్ పిక్చర్స్' సంస్థను 'సెర్చ్‌లైట్ పిక్చర్స్' గా పిలుస్తారు. అయితే టీవీ సీరియల్స్ నిర్మించే 'ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్ టెలివిజన్', 'ఫాక్స్ ట్వంటీఫస్ట్ టెలివిజన్ స్టూడియోస్' పేర్లు కూడా మారుస్తారా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు.

'ఫాక్స్' పదం తొలగించిన తర్వాత ట్వంటీయత్ సెంచరీ బేనరులో విడుదలవుతోన్న తొలి చిత్రం 'కాల్ ఆఫ్ వైల్డ్'. అలాగే సెర్చ్‌లైట్ పిక్చర్స్ బేనరుపై వస్తున్న మొదటి చిత్రం 'డౌన్ హిల్'.

వివాహ జీవితంపై ఆసక్తి లేదు!

- త్రిష

"సినిమాలు, జంతువులు, ఆహారం... నన్ను ఎప్పుడూ సంతోషంగా ఉంచుతాయి" అని త్రిష అన్నారు. తెలుగు చిత్రాలు తగ్గించినప్పటికీ... ఇక్కడ ఆమెకున్న అభిమానుల సంఖ్య తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే త్రిష... ఆదివారం ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు ఆన్సర్స్ ఇచ్చారు. వాటిలో కొన్ని ఇవిగో...

- **మీరు యంగ్‌గా ఎలా కనిపిస్తారు?**

ఈ ప్రశ్న విని విని నాకు విసుగు రావడం లేదు! బహుశా... జీన్స్ వల్ల అనుకుంటున్నా. అలాగే... క్రమశిక్షణ, సెల్ఫ్ కంట్రోల్, (జంక్ ఫుడ్) త్యాగం చేయడం వల్ల కూడా యంగ్‌గా ఉంటాం.

- **ఫ్రీ టైమ్‌లో ఏం చేస్తారు?**

సంగీతం వింటా. పుస్తకాలు చదువుతా. టీవీ షోలు చూస్తా. జిమ్‌కు వెళతా. స్నేహితులతో, నా కుక్కపిల్లలతో గడుపుతా. ట్రావెలింగ్ చేస్తా.

- **స్టార్‌డమ్ వచ్చిన తర్వాత సాధారణంగా ఉండడానికి కారణం?**

ఎంతో సాధించిన తర్వాత కూడా చాలా వినయపూర్వకంగా, మానవత్వంతో ఉండే వ్యక్తులతో కలిసి పని చేయడం వల్ల.

- **ప్రతి విషయంలో పాజిటివ్‌గా ఎలా ఉంటారు?**

ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో (పాజిటివ్‌గా) ఉండడం అంత సులభమేమీ కాదు. కానీ, జీవితంలో కిందకు పడిన ప్రతిసారీ... జీవితానికి కృతజ్ఞత చెప్పుకొనే గొప్ప గొప్ప విషయాలను గుర్తుంచుకోండి. సానుకూల దృక్పథంతో ఉండడం అలవాటు అయింది.

- **ప్రేమలో విఫలమైన వ్యక్తులకు మీరిచ్చే సలహా?**

అదెంతో కాలం ఉండదు. ప్రామిస్ చేస్తున్నా

- **మీ దృష్టిలో హెల్తీ డైట్ అంటే?**

తినడంలో సమతుల్యత పాటించడం, కంట్రోల్‌గా ఉండడం

- **నా బ్రేకప్ చాలా దారుణంగా జరిగింది. నేనేం చేయాలి?**

సారీ. ఆ బాధ నుండి బయటకు వచ్చే మార్గం గందరగోళంగానే ఉంటుంది. కాలమే అన్ని గాయాలను నయం చేస్తుంది.

- **మీకు థ్రిల్లర్స్ ఇష్టమా? లవ్ స్టోరీలా?**

ప్రేమ కథల్లో నటించడం ఇష్టం. థ్రిల్లర్స్ చూడడం ఇష్టం.

- **వివాహ జీవితంపై మీకు ఆసక్తి లేదా?**

అంతగా లేదని అనుకుంటున్నా.

రూ. 179 ప్రీపెయిడ్ ప్యాక్‌తో 2 లక్షల బీమా

న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ తన వినియోగదారులకు రూ. 179 ప్రీపెయిడ్ రీచార్జ్ ప్యాక్‌తో రూ.2 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటించింది. 28 రోజుల వ్యాలిడిటీ కలిగిన ఈ ప్యాక్‌లో ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాల్స్, 2జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయని పేర్కొంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల వినియోగదారులు, వారి కుటుంబాలకు ఈ ప్యాక్ భరోసాగా నిలుస్తుందని ఎయిర్‌టెల్ ఆశాభావం వ్యక్తం చేసింది. 18 నుంచి 54 ఏళ్ల వయసున్న వినియోగదారులకు ఈ బీమా వర్తిస్తుందని, దీనికోసం ఎటువంటి కాగితాలు కానీ, వైద్య పరీక్షలు కానీ అవసరం లేదని వివరించింది. ప్యాక్ రీచార్జ్ చేయించుకున్న వెంటనే బీమాకు చెందిన ధ్రువీకరణ పత్రాన్ని వినియోగదారులకు డిజిటల్‌గా అందించనున్నట్లు ఎయిర్‌టెల్ తెలిపింది.

31 నుంచి బ్యాంకుల సమ్మె

ధర్మశాల: ఈ నెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో సమ్మెకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బీయు) పిలుపునిచ్చింది. మార్చిలో మరో 3 రోజులు సమ్మె చేస్తామని, తమ డిమాండ్లను అంగీకరించని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని ప్రకటించింది. ఈ మేరకు ఇప్పటికే భారత బ్యాంకుల సంఘం అధ్యక్షుడికి, ఆర్థిక సేవల కార్యదర్శి విభాగానికి, కార్మిక మంత్రిత్వ శాఖకు లేఖలు పంపినట్లు తెలిపింది. వేతన సవరణ, ఐదు రోజుల బ్యాంకింగ్, ప్రత్యేక భత్యాన్ని ప్రాథమిక వేతనంతో కలపడం, కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేయడం వంటి పలు డిమాండ్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, యుఎఫ్‌బీయు పేర్కొంది.

టెలికాం కంపెనీల దారెటు!

క్యురేటివ్ పిటిషన్లపైనా అనుమానాలు

న్యూఢిల్లీ: ఒకవైపు పీక లోతు అప్పులు.. నష్టాలు, మరోవైపు సుప్రీం ఆదేశంతో ఏజీఆర్ కింద ప్రభుత్వానికి రూ.1.47 లక్షల కోట్లు బకాయిలు చెల్లించాల్సి రావడం, చార్జీలు పెంచినా పెరగని ఆదాయాలు.. ఇదీ ప్రస్తుతం దేశంలోని టెలికాం కంపెనీల పరిస్థితి. సుప్రీం కోర్టు తాజా తీర్పుతో తమ పరిస్థితి ముందు చూస్తే నుయ్యి, వెనక చూస్తే గొయ్యిలా ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఏజీఆర్ నిర్వచనం విషయంలో సుప్రీం ఇప్పటికే రెండు సార్లు ఈ కంపెనీల వాదనను తోసిపుచ్చింది. అయినా క్యురేటివ్ పిటిషన్ల రూపంలో మరోసారి సర్వోన్నత న్యాయస్థానం తలుపు తట్టాలని ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా భావిస్తున్నాయి. కోర్టు తీర్పు సహజ న్యాయ సూత్రాలకు పూర్తి భిన్నంగా ఉందని కంపెనీలు నిరూపిస్తే తప్ప, కోర్టులు సాధారణంగా ఇలాంటి పిటిషన్లను అనుమతించవు. ఒకవేళ నిరూపించలేకపోతే భారీ జరిమానాలు విధిస్తాయి. సుప్రీంకోర్టు ఆదేశించిన రూ.1.47 లక్షల కోట్ల ఏజీఆర్ బకాయిల్లో రూ.88,600 కోట్లు ఈ రెండు కంపెనీలే చెల్లించాలి. మరోవైపు నాన్ పీఎస్‌యూ సంస్థలు చెల్లించాల్సిన రూ.2.4 లక్షల కోట్ల బకాయిలపై ఈ నెల 23 తర్వాత నిర్ణయం తీసుకోవాలని టెలికాం శాఖ భావిస్తోంది.

ఆర్‌బీఐని ఆశ్రయించిన బ్యాంకులు !

టెలికం కంపెనీలు దేశీయ బ్యాంకులకు అసలు, వడ్డీల కింద రూ.1.1 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. బ్యాంకింగ్ రంగం మొత్తం రుణాల్లో ఇది దాదాపు 1.3 శాతం. ఏజీఆర్ తీర్పుతో వొడాఫోన్ ఐడియా భవిత వ్యమే ప్రమాదంలో పడింది. ప్రభుత్వం ఏదో ఒక రూపంలో ఆదుకోకపోతే, దుకాణం మూసేయడం తప్ప, మార్గం లేదని ప్రమోటర్లు ఇప్పటికే ప్రకటించారు. అదే జరిగితే తాము మునగటం ఖాయమని బ్యాంకులు భయపడుతున్నాయి. దీంతో టెలికాం రంగాన్ని ఏదోలా ఆదుకోవాలని బ్యాంకులు కోరుతున్నాయి. ఈ విషయాన్ని నేరుగా ప్రభుత్వంతో చెప్పకుండా ఆర్‌బీఐ ద్వారా నరుక్కొస్తున్నాయి. వొడాఫోన్ ఐడియా మూత పడితే, ఆ కంపెనీ నుంచి ప్రభుత్వానికి రావాల్సిన రూ.90,000 కోట్ల స్పెక్ట్రమ్, లైసెన్స్ ఫీజుల బకాయిలకు బ్యాంకులు ఆశలు వదులుకోవాల్సి ఉంటుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)

19వ తేదీకి..			
హైదరాబాద్	395	విజయవాడ	420
20వ తేదీకి..		విశాఖపట్నం	420
చిత్తూరు	438	వరంగల్	398
గోదావరి	420	డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	87	విజయవాడ	93
వరంగల్	87	గుంటూరు	93
మహబూబ్‌నగర్	87	ఒంగోలు	95
కరీంనగర్	87	చిత్తూరు	100
కర్నూలు	87	నెల్లూరు	100
విశాఖపట్నం	85	అనంతపురం	93
గోదావరి	87		

పన్ను పోటులో తేడాలు వద్దు

ఏ కంపెనీపైనా 15 శాతం మించొద్దు: సీఐఐ

న్యూఢిల్లీ: కార్పొరేట్ టాక్స్ మరింత తగ్గించాలని ఇండియా ఇంక్ కోరుతోంది. 2023 ఏప్రిల్ నాటికి అన్ని రకాల పన్నుల భారం 15 శాతం మించకుండా ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రతిపాదన అమలు చేస్తే కార్పొరేట్ రంగానికి ఎలాంటి పన్ను మినహాయింపులు, పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండదని సీఐఐ జాతీయ అధ్యక్షుడు విక్రమ్ కిర్లోస్కర్ అన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగి పెట్టుబడులు మరింతగా ఊపందుకుంటాయని అన్నారు.

సంతృప్తికరంగా లేదు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత ఏడాది సెప్టెంబరులో కార్పొరేట్ టాక్స్ రేట్లు తగ్గించడం, ఆహ్వానించదగ్గ చర్యే అయినప్పటికీ అంత ఆశాజనకంగా లేదని విక్రమ్ కిర్లోస్కర్ అన్నారు. ఉత్పత్తి రంగంపై ఒక రకం పన్ను, సర్వీసు రంగ కంపెనీలపై మరో రకం పన్ను ఉండడమే ఇందుకు కారణమన్నారు. జీడీపీ వృద్ధి రేటును పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం గత ఏడాది కార్పొరేట్ టాక్స్‌ను ఇప్పటికే ఉన్న కంపెనీలపై 22 శాతానికి, కొత్త కంపెనీలపై 15 శాతానికి తగ్గించింది. సర్‌చార్జీ, సెస్సులు ఇందుకు అదనం. ఇలా తేడా చూపించే బదులు 2023 నుంచి అన్ని కంపెనీలపై ఒకే విధంగా 15 శాతం పన్ను విధిస్తే మంచిదని కిర్లోస్కర్ సూచించారు.

ఏటీఎఫ్‌పై ఊరట !

వచ్చే కేంద్ర బడ్జెట్‌లో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై పన్నుల భారం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటీఎఫ్‌పై వస్తువు విలువ ఆధారిత (యాడ్ వెలోరం) పద్ధతిలో పన్ను విధిస్తున్నారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర పెరిగినప్పుడల్లా, దేశంలో ఏటీఎఫ్ ధర పెరిగి పోతోంది. దీనికి బదులు ఏటీఎఫ్‌పై కిలోలీటర్ (1,000 లీటర్లు)కు ఇంత అని ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ విధించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌పై ఇదే తరహాలో లీటర్‌కు ఇంతని, ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ విధిస్తున్నారు. ఏటీఎఫ్‌పైనా ఇలాగే కిలోలీటర్‌కు ఇంత అని ప్రత్యేక ఎక్సైజ్ సుంకాలు విధిస్తే, విమాన యాన సంస్థలపై ధరల ఆటుపోట్ల ప్రభావం పెద్దగా ఉండదని భావిస్తున్నారు.

సుంకాలు ఎత్తేయండి

కేంద్ర బడ్జెట్‌పై స్టీల్ కంపెనీలు ఆశలు పెట్టుకున్నాయి. కోకింగ్ కోల్, మెటలర్జికల్ కోల్, సున్నపు రాయి, డోలమైట్ ఖనిజాలపై దిగుమతి సుంకం పూర్తిగా ఎత్తివేయాలని ఫిక్కీ ప్రభుత్వాన్ని కోరింది. స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తిలో స్టీల్ తుక్కు దిగుమతిపై ఉన్న సుంకాన్నీ పూర్తిగా ఎత్తివేయాలని విజ్ఞప్తి చేసింది. లేకపోతే చైనా వంటి దేశాలతో దేశీ స్టీల్ సంస్థలు పోటీపడడం కష్టమని స్పష్టం చేసింది. ఈ ఖనిజాల దిగుమతులపై ప్రస్తుతం 2.5 శాతం నుంచి 5 శాతం సుంకాన్ని విధిస్తున్నారు.

సగానికి మించి జీ+20 అంతస్తుల ప్రాజెక్టులే

విల్లా ప్రాజెక్టులు తగ్గాయ్ : అనరాక్

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ డెవలపర్లు భారీ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో (ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పుణే)ని డెవలపర్లు ఆకాశహర్మ్యాలను నిర్మించేందుకు మొగ్గుచూపుతున్నారు. గత ఏడాదిలో 1,816 హౌసింగ్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. వీటిలో సగానికి పైగా (52) ప్రాజెక్టులు జీ+20 లేదా అంతకు మించిన అంతస్తులు కలిగిన ప్రాజెక్టులేనని ప్రాపర్టీ కన్సల్టెంట్ అనరాక్ వెల్లడించింది. ఇక విల్లాల విషయానికి వస్తే.. గత ఏడాదిలో విల్లా ప్రాజెక్టులు 2 శాతానికి తగ్గాయి. 2014లో విల్లా ప్రాజెక్టుల వాటా 5 శాతంగా ఉంది. ముంబైలో స్థలం కొరత ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. అందుకే గత ఏడాది ఇక్కడ ప్రారంభించిన 734 ప్రాజెక్టుల్లో 75 శాతానికి పైగా ప్రాజెక్టులు హైరైజ్ కేటగిరీలోనే ఉన్నాయి. ఇక గతేడాది జీ+20 అంతస్తులు మించిన ప్రాజెక్టుల్లో బెంగళూరు వాటా 45 శాతంగా ఉంది. పుణే వాటా 41 శాతంగా ఉంది. హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై నగరాల వాటా వరుసగా 23 శాతం, 21 శాతం, 16 శాతంగా ఉంది. హైదరాబాద్‌లో సాధారణంగా తక్కువ అంతస్తుల బిల్డింగ్‌లే ఎక్కువగా ఉంటాయి. కానీ ఇప్పుడు ఎక్కువ అంతస్తులు కలిగిన ప్రాజెక్టులు పెరుగుతున్నాయి. ఇక హైదరాబాద్‌లో విల్లా ప్రాజెక్టులు కూడా తగ్గుతున్నాయని అనరాక్ పేర్కొంది. 2014లో కొత్త విల్లాల సప్లయ్ 35 శాతంగా ఉంటే.. 2019లో 8 శాతానికి తగ్గింది.

ఈక్విటీ ఎంఎఫ్‌లపై మాంద్యం దెబ్బ

న్యూఢిల్లీ : ఈక్విటీ ఎంఎఫ్ పెట్టుబడులపై ఆర్థిక మందగమనం ప్రభావం పడింది. గత ఏడాదితో పోల్చితే ఈక్విటీ ఎంఎఫ్ పెట్టుబడులు 41 శాతం క్షీణించి రూ.75 వేల కోట్లకు దిగజారాయి. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన ఈక్విటీ పెట్టుబడులు రూ.1.2 లక్షల కోట్లు. మార్కెట్లో గత కొద్ది కాలంగా ఏర్పడిన తీవ్ర ఆటుపోట్ల ప్రభావం ఎంఎఫ్ పెట్టుబడులపై పడిందని విశ్లేషకులంటున్నారు.

రెండేళ్లలో పూర్తిగా ఉత్పత్తి సామర్థ్య వినియోగం

కియా మోటార్స్ వెల్లడి

ఈ ఏడాది మరో రెండు కొత్త మోడళ్లు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని 2022 మార్చి నాటికి వినియోగించుకోవాలని కియా మోటార్స్ లక్ష్యంగా పెట్టుకుంది.. ఇందుకోసం ప్రణాళిక ప్రకారం కొత్త మోడళ్లను విడుదల చేయాలనుకుంటోంది. ప్రస్తుతం కియా మోటార్స్.. సెల్టోస్ మోడల్‌ను విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో మరో రెండు కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురానుంది. ఇందులో భాగంగా త్వరలో జరిగే ఆటో ఎక్స్‌పోలో లగ్జరీ మల్టీపర్పస్ వెహికిల్ కార్నివాల్‌ను విడుదల చేయనుంది. ఆ తర్వాత ఏడాది చివరికల్లా కాంపాక్ట్ ఎస్‌యూవీని తీసుకురానుంది. వచ్చే ఏడాదిలో కూడా రెండు కొత్త మోడళ్లను విడుదల చేయనుంది. "ప్రతి ఆరు నెలలకు ఒక కొత్త మోడల్‌ను మార్కెట్లోకి తెస్తాం. ప్లాంట్ స్థాపిత ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలన్నదే మా మొదటి లక్ష్యం" అని కియా మోటార్స్ ఇండియా హెడ్ (మార్కెటింగ్, సేల్స్) మనోహర్ భట్ తెలిపారు. 2022 లక్ష్యం చేరుకోవాలంటే నాలుగైదు మోడళ్ల అవసరం ఉంటుందన్నారు. కియా ప్లాంట్ స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం మూడు షిఫ్టుల ప్రాతిపదికన ఏడాదికి 3 లక్షల యూనిట్లుగా ఉంది. ప్రస్తుతం రెండు షిఫ్ట్‌ల్లో ప్లాంట్ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. కార్నివాల్‌తో కొత్త సెగ్మెంట్‌ను సృష్టించనున్నట్టు కంపెనీ చెబుతోంది. భారత్‌లో కంపెనీకి ఇదే ఫ్లాగ్‌షిప్ మోడల్ కానుంది. ప్రస్తుతానికి ఇలాంటి కారు దేశీయ మార్కెట్లోనే లేదని భట్ తెలిపారు. దేశంలోని సంపన్న కస్టమర్ల అవసరాలకు తగినట్టుగా ఇది ఉంటుందన్నారు. 2.2 లీటర్ డీజిల్ ఇంజన్ కలిగిన కార్నివాల్ లీటరుకు 13.9 కిలో మీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపారు.

కియా కార్నివాల్

బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా ఇది ఉంటుంది. కాగా 160 నగరాల్లో 265 డీలర్‌షిప్‌లను కియా మోటార్స్ కలిగి ఉంది. ఈ ప్రాంతాల్లో తన స్థానాన్ని బలపరచుకోవడంపై కంపెనీ దృష్టిసారిస్తోంది.

ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో 6 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల (ఏప్రిల్-డిసెంబరు) కాలంలో మన దేశం నుంచి ప్యాసింజర్ వాహన (పీవీ) ఎగుమతులు 5.89 శాతం వృద్ధి చెంది 5,40,384 యూనిట్లకు చేరుకున్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఎగుమతులు 5,10,305 యూనిట్లుగా ఉన్నాయి. మొత్తం ఎగుమతుల్లో కార్ల ఎగుమతులు 4,04,552 యూనిట్లు, యుటిలిటీ వాహన ఎగుమతులు 1,33,511 యూనిట్లుగా ఉన్నట్టు భారత ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ సంఘం (సియామ్) వెల్లడించింది. ఇదేకాలంలో వ్యాన్ల ఎగుమతులు మాత్రం 17.4 శాతం తగ్గి 2,321 యూనిట్లకు చేరాయి. ఎగుమతుల్లో హ్యుండయ్ మొదటి స్థానంలో ఉండగా.. ఫోర్డ్ ఇండియా, మారుతీ సుజుకీ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

తగ్గనున్న పన్ను వసూళ్లు

ఈ ఏడాది రూ.2.5 లక్షల కోట్లు తగ్గే చాన్స్

ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్

న్యూఢిల్లీ : ఆర్థిక మందగమనం ఈ ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వ పన్ను వసూళ్ల లక్ష్యాన్నీ దెబ్బతీయనుంది. పన్ను వసూళ్లకు సంబంధించి ఈ సంవత్సరం గడ్డు కాలమని ఆర్థిక మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. ఒక బ్లాగులో ఈ మేరకు తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వివిధ పన్నుల ద్వారా 2019-20 ఆర్థిక సంవత్సరం రూ.24.59 లక్షల కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ లక్ష్యంలో రూ.2.5 లక్షల కోట్లకు గండిపడే ప్రమాదం ఉందని గార్గ్ హెచ్చరించారు. 'పన్ను వసూళ్లు ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.2.5 లక్షల కోట్ల వరకు తగ్గుతాయి. ఇది జీడీపీలో 1.2 శాతానికి సమానం. వృద్ధి రేటును మళ్లీ పట్టాలు ఎక్కించేందుకు వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లను సంస్కరించడంతో పాటు డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ (డీడీటీ) పూర్తిగా రద్దు చేయాలి' అన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వ వాటాను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే తగ్గుదల రూ.3.5 లక్షల కోట్ల నుంచి రూ.3.75 లక్షల కోట్ల వరకు ఉంటుందన్నారు.

ఐటీలో నాలుగు శ్లాబులు చాలు

వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) వ్యవస్థలోనూ మరిన్ని మార్పులు తీసుకురావాలని గార్గ్ కోరారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది శ్లాబులను, ఎలాంటి సెస్సులు, సర్‌చార్జీలు లేకుండా నాలుగు శ్లాబులకు కుదిస్తే మేలన్నారు. రూ.5 లక్షల వరకు ఉండే వార్షిక ఆదాయానాన్ని పూర్తిగా పన్ను నుంచి మినహాయించాలన్నారు. రూ.5-10 లక్షల ఆదాయంపై ఐదు శాతం, రూ.10-25 లక్షల వార్షిక ఆదాయంపై 15 శాతం, రూ.25-50 లక్షల వార్షిక ఆదాయంపై 25 శాతం, రూ.50 లక్షలకు మించిన వార్షిక ఆదాయంపై 35 శాతం చొప్పున పన్ను విధిస్తే మంచిదని సూచించారు.

ద్రవ్య లోటు లక్ష్యమూ కష్టమే

ఈ ఆర్థిక సంవత్సరం పన్నేతర ఆదాయమూ పెద్దగా పెరిగే అవకాశం లేదని గార్గ్ స్పష్టం చేశారు. అలా అని ప్రభుత్వ ఖర్చులు తగ్గించుకునే అవకాశం లేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యో లోటును జీడీపీలో 3.3% దగ్గర కట్టడి చేయాలన్న లక్ష్యమూ సాధ్యం కాదన్నారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే బడ్జెట్‌లో పేర్కొన్న 3.3 శాతం కంటే అర శాతం నుంచి 0.7 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆర్‌బీఐ మధ్యంతర డివిడెండ్!

ద్రవ్య లోటు పూడ్చుకునేందుకు ప్రభుత్వం మళ్లీ ఆర్‌బీఐ తలుపు తడుతోంది. మధ్యంత డివిడెండ్ రూపంలో ఎంతో కొంత సమకూర్చాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్‌బీఐని కోరినట్టు సమాచారం. దీంతో ఫిబ్రవరి తొలి వారంలో జరిగే ఆర్‌బీఐ బోర్డు సమావేశం ఈ అంశంపై చర్చించనుంది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.95,414 కోట్లు డివిడెండ్‌గా చెల్లించేందుకు ఆర్‌బీఐ బోర్డు ఇప్పటికే అంగీకరించింది. ఇదికాకుండా మధ్యంతర డివిడెండ్ రూపంలో మరో రూ.30,000 కోట్లు చెల్లించాలని ప్రభుత్వం కోరినట్టు సమాచారం.

వీఆర్ఎస్ కల్పించండి

ఎయిర్ ఇండియా యూనియన్ల డిమాండ్

ముంబై: స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకాన్ని ప్రకటించాలని ఎయిర్ ఇండియా (ఏఐ) ట్రేడ్ యూనియన్లు కోరే అవకాశాలు కన్పిస్తున్నాయి. పౌరవిమాన యాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీతో జరగనున్న సమావేశంలో ఈ పథకాన్ని కోరాలని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఏఐ ప్రైవేటీకరణకు సంబంధించి, నెల రోజుల వ్యవధిలో రెండోసారి ఏఐ యూనియన్లతో సింగ్ సమావేశం కానున్నారు. ఏఐను బతికించాలంటే, దాన్ని ప్రైవేటీకరించడం ఒక్కటే ప్రభుత్వం ముందున్న మార్గమని, ఉద్యోగులు సహకరించాలని ఈ నెల 2న జరిగిన తొలి సమావేశంలో యూనియన్లకు సింగ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

మూడేళ్లలో మోపా విమానాశ్రయం సిద్ధం : కాపా

ముంబై: గోవా ఉత్తర ప్రాంతంలోని మోపాలో జీఎంఆర్ గ్రూప్ నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం మూడేళ్ల కాలంలో కార్యకలాపాలకు సిద్ధమయ్యే అవకాశం ఉందని ఏవియేషన్ కన్సల్టెన్సీ సంస్థ కాపా అంచనా వేస్తోంది. ఇది గోవాలో రెండో అంతర్జాతీయ విమానాశ్రయం. ఈ విమానాశ్రయ నిర్మాణానికి సుప్రీం కోర్టు నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో త్వరలోనే విమానాశ్రయ పనులను ప్రారంభించనున్నట్టు జీఎంఆర్ గ్రూప్ ఇటీవలే వెల్లడించింది. "కీలకమైన మౌలిక ప్రాజెక్టుల్లో జాప్యం వల్ల ఆర్థిక వ్యవస్థపైనే కాకుండా వినియోగదారులపైనా ప్రభావం పడుతుంది. చివరకు జీఎంఆర్ గ్రూప్ మోపా ప్రాజెక్టుకు క్లియరెన్స్ వచ్చింది. మూడేళ్లలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నాం" అని కాపా తెలిపింది.

టెక్ షాట్

12400 పైన మరింత అప్‌ట్రెండ్

వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 100 పాయింట్ల పరిధిలో పరిమితంగానే కదలాడింది. తొలుత అప్‌ట్రెండ్ సాధించి మానసిక అవధి 12400 వరకు వెళ్లి రియాక్షన్ సాధించింది. అనంతరం ఏర్పడిన కరెక్షన్‌లో 12300 వరకు దిగజారినా ఆ స్థానంలో రికవరీ సాధించింది. ఈ కారణంగా ఇది పుల్‌బ్యాక్ రియాక్షన్‌గానే భావించాలి. వీక్లీ చార్టుల ప్రకారం సైతం 12300 వద్ద ఎగువకు ఏర్పడిన బ్రేకౌట్ కారణంగా ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ లేదా కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. ప్రధాన ట్రెండ్ మాత్రం ఎగువకే ఉంది. చారిత్రక గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్త అప్‌ట్రెండ్‌ను గత కొద్ది వారాలుగా నిఫ్టీ చవి చూస్తోంది. వీక్లీ చార్టులు, ఆర్ఎస్ఐ సూచిల ప్రకారం మార్కెట్‌లో ఇప్పటికీ స్వల్పకాలిక ఓవర్ బాట్ స్థితి ఉంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలనేందుకు ఇది సంకేతం.

బుల్లిష్ స్థాయిలు : తదుపరి నిరోధం 12400. మార్కెట్ గత రెండు రోజుల్లో ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించి ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 12500.

బేరిష్ స్థాయిలు : మరింత బలహీనతకు లోనై 12300 కన్నా దిగువకు వస్తే మైనర్ బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 12250. భద్రత కోసం గత వారం ఏర్పడిన ఈ బాటమ్ వద్ద రికవరీ సాధించాలి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 12000. ఇక్కడ రికవరీ తప్పనిసరి.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచి గత కొన్ని రోజుల్లో 1000 పాయింట్ల వరకు నష్టపోయింది. గత శుక్రవారంనాడు కూడా బలహీనంగా క్లోజయింది. రికవరీ బాట పడితే గతంలో ఏర్పడిన టాప్ 32000 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 32500. గత నెల రోజుల కాలంలో ఏర్పడిన టాప్ ఇదే.

స్వల్పకాలిక వ్యూహం : 12400 పైన నిలదొక్కుకున్నప్పుడే గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

పాటర్న్ : 12400 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" వద్ద నిరోధం ఎదురవుతోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి. దిగువన 12250 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. ఈ రేఖ కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ఏర్పడవచ్చు. అదే జరిగితే బ్రేక్‌డౌన్ పాటర్న్ ఏర్పడవచ్చు. మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక 20, 50 డిఎంఏల కన్నా పైనే ఉంది.

టైమ్ : ఈ సూచి ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	12375,12410
మద్దతు:	12330,12290

www.sundartrends.in

టెక్నో స్కోప్

12450 పైన బుల్లిష్

(జనవరి 20-24 తేదీల మధ్య వారానికి)

డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12286-12389 పాయింట్ల మధ్యన కదలాడి 96 పాయింట్ల లాభంతో 12352 వద్ద వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా ముగిసింది.

- డిసెంబరు 30 నుంచి జనవరి 3వ తేదీ మధ్య వారంలో ఏర్పడిన పరిధి 11290-12152. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 12226, 12092, 11996, 11585 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డిఎంఏల కన్నా పైన ఉంది. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైనే ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌ను సూచిస్తోంది. ఈ వారాంతంలో 12100 కన్నా కింద ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బేరిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 12550

బ్రేక్‌డౌన్ స్థాయి : 12100

నిరోధ స్థాయిలు : 12500, 12575 (12425 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 12200, 12100 (12275 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడ

రిక్షావాలాతో గొడవ పడుతున్న బిచ్చగాడు

చదువు ఇంజనీరింగ్.. వృత్తి బిచ్చగాడు

- రిక్షా వాలాతో గొడవలో పోలీస్‌స్టేషన్‌కు
- చక్కని ఇంగ్లిషులో ఫిర్యాదు.. షాకైన పోలీసులు
- ఇదేమని అడిగితే వ్యక్తిగత విషయమని జవాబు
- పూరీ జగన్నాథ ఆలయ మెట్లే ఆవాసం
- గతంలో హైదరాబాద్‌లో ఉద్యోగం

పూరీ, జనవరి 19: 'బిచ్చగాడు' సినిమా గుర్తుందా! చావుబతుకుల్లో ఉన్న తన తల్లి కోలుకోవాలనే ఆకాంక్షతో ఓ ఆగర్భ శ్రీమంతుడు కొన్ని నెలలపాటు బిచ్చగాడిగా మారి.. బిచ్చగాళ్లలో ఒకడిగా కలిసిపోయి.. వారితో తింటూ, ఉంటూ రోడ్ల మీద అడుక్కు తింటూ గడిపే దైన్యం! ఒడిసాలోనూ ఇలానే ఓ 'బిచ్చగాడు' కనిపించాడు. ఆయన పేరు గిరిజా శంకర్ మిశ్రా (51). పూరిలోని జగన్నాథ్ ఆలయం వద్ద అడుక్కొంటూ బతుకుతున్నాడు. మాసిన బట్టలు, నెరిసిన గడ్డంతో దొరికిన రోజు తింటూ.. దొరకని రోజు పస్తులుంటూ చలి, వానను లెక్కచేయకుండా రాత్రుళ్లు ప్లాట్‌ఫాం పైనే నిద్రిస్తున్నాడు. అయితే, ఆయనో ఇంజనీర్. బడా సంస్థల్లో మంచి ఉద్యోగాలూ చేశాడని తేలింది! ఇటీవల బిచ్చమడుక్కుంటున్న మిశ్రాతో ఓ రిక్షావాలా గొడవపడ్డాడు. స్థానికులు ఆ ఇద్దరినీ పోలీసుల దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పడంతో రిక్షావాలా తనకు రాయడం రాదని చెప్పాడు. మిశ్రా మాత్రం పెన్ను, పేపర్ తీసుకొని ఇంగ్లిషులో చకచకా ఫిర్యాదు రాశాడు. ఆరులైన్లతో కూడిన దస్తూరిని చూసి పోలీసులు నోరెళ్లబెట్టారు. ఆ రాత ముత్యాల్లా ఉండటం, వ్యాకరణ పరంగానూ గొప్పగా ఉండటం, అందులో ఒక్కతప్పూ లేకపోవడం చూసి అతడు బిచ్చగాడయితే కాదని ఫిక్సయ్యారు. మిశ్రాను వివరాలు అడిగితే 'సినిమా కథ'కు మించి థ్రిల్ కలిగేలా పూర్వాశ్రమంలో తాను గడిపిన జీవితాన్ని చెప్పుకొచ్చాడు. మిశ్రాది భువనేశ్వర్. ఆయనది ఉన్నత కుటుంబం. తల్లిదండ్రులు చనిపోయారు. ఆయన తండ్రి పోలీసు అధికారిగా పనిచేశాడు. బీఎస్సీ పూర్తిచేసిన తర్వాత సెంట్రల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)లో మిశ్రా ఇంజనీరింగ్ చదివాడు. ముంబైలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేశాడు. తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి మిల్టన్ కంపెనీలో పనిచేశాడు. తర్వాత ఏమైందో ఏమో తెలియదు గానీ.. పూరీకొచ్చి బిచ్చగాడిగా మారిపోయాడు. ఇంజనీర్‌గా ఉన్న నువ్వు ఇలా ఎందుకు బిచ్చమెత్తుకుంటున్నావ్ అని పోలీసులు ప్రశ్నిస్తే.. 'సారీ.. ఇదినా పర్సనల్ మ్యాటర్' అంటూ వెళ్లిపోయాడు! మిశ్రా మనసులో ఏ బలమైన ఆకాంక్ష ఉందో ఎవరికి తెలుసు?

బాబా పేరిట.. పాలిటిక్స్

- బీజేపీ, ఎన్సీపీలను దెబ్బతీసేందుకు శివసేన యత్నం
- పత్రిని పైకి తేవడం వెనుక మర్మమిదే..?

షిరిడీ, జనవరి 20: కులమతాలకు అతీతంగా లక్షల మంది భక్తులతో నిత్యం అలరారే పరమ పవిత్రమైన షిరిడీ క్షేత్రం ఇపుడు రాజకీయ పక్షాల ఆధిపత్య పోరుకు వేదికగా మారింది. వందల కోట్ల రూపాయలను ఆర్జించి పెడుతున్న షిరిడీ దేవస్థానంపై పార్టీల కన్నుపడింది. రాజకీయ నేతల దందాలూ ఎక్కువయ్యాయి. ముఖ్యం గా అధికారంలో ఉన్న శివసేనకు, ఏళ్ల తరబడి ఈ ప్రాంతంలో చక్రం తిప్పిన ఎన్సీపీ, బీజేపీలకు మధ్య ఘర్షణ కేంద్రంగా మారిందనే విమర్శలు రేగుతున్నాయి.

శివసేన నుంచే గొడవ...?

తాజా వివాదం శివసేన వల్లే రగిలింది. సాయి జన్మస్థలిగా గణుతికెక్కిన పుర్భానీ జిల్లాలోని పత్రిని రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని సీఎం ఉద్ధవ్ రాత్రే ఇచ్చిన హామీతో రాజకీయ దుమారం రేగింది. పత్రి శివసేనకు రాజకీయంగా పట్టున్న ప్రదేశం. పత్రికి 273 కిలోమీటర్ల దూరంలో అహ్మద్ నగర్ జిల్లాలో షిరిడీ ఉంది. షిర్డీలో మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో శివసేన గెలిచినా ఆధిపత్యం మాత్రం బీజేపీ, ఎన్సీపీలదే! సేనకు అంతగా ప్రాబల్యం లేదు. ఈ దృష్ట్యా ... రాజకీయంగా, ఆర్థికంగా సుసంపన్నంగా ఉన్న షిరిడీ ప్రాభవాన్ని తగ్గించి అహ్మద్‌నగర్ జిల్లాలో బీజేపీ, ఎన్సీపీల ఆధిపత్యాన్ని దెబ్బతీయాలన్నది శివసేన యత్నంగా కనిపిస్తోంది. పుర్భానీ లోక్‌సభ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో శివసేన గెలిచింది. ఇక షిర్డీలో... 2009లో శివసేన తరఫున ఎంపీగా గెలిచి 2014లో కాంగ్రెస్‌లోకి మారి ఓడిపోయి, 2019లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓడిపోయిన భావుసాహెబ్ వాక్చూరే రాజారామ్ ప్రస్తుతం షిరిడీ సంస్థాన్ ట్రస్ట్‌లో కీలక సభ్యుడు. ఆలయ మూసివేత నిర్ణయాన్ని మొదట ప్రకటించిన దీ ఆయనే! ఈ వివాదంలో కాంగ్రెస్ నాయకత్వం పత్రి వైపు నిలబడగా బీజేపీ మాత్రం రెంటినీ సమర్థిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

ప్రాబల్యం కోసం పాకులాట

షిరిడీ, పత్రి రెండూ మరత్వాడా ప్రాంతంలోనే ఉన్నాయి. షిరిడీ క్షేత్రం లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గం కూడా! ప్రస్తుతం అహ్మద్‌నగర్ జిల్లాలో ఉన్న 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీ ఆరు, ఎన్సీపీ ఐదు స్థానాలు గెలుచుకున్నాయి. కాంగ్రెస్‌కు రెండు దక్కగా, శివసేనకు రెండే లభించాయి. ఇదే జిల్లాలోని ఐదు లోక్‌సభ నియోజకవర్గాలకుగాను 2019 మేలో జరిగిన ఎన్నికల్లో నాసిక్, షిరిడీ స్థానాలను శివసేన గెల్చుకోగలిగింది. ఎన్సీపీ, బీజేపీలకు చెరొకటి దక్కగా మజ్లిస్ పార్టీ ఔరంగాబాద్ సీటును గెలుచుకుంది. మరాత్వాడా ప్రాంతం ఎన్సీపీకి పూర్తి పట్టున్న ప్రదేశం. బీజేపీ చొచ్చుకొచ్చాక ఈ రెంటి మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. శివసేన మూడోస్థానంలోకి దిగజారింది. ఇక పత్రి ఉన్న పర్భానీ జిల్లా రాజకీయంగా క్రియాశీలక ప్రాంతం. మొదట్నుంచీ శివసేనకు కంచుకోట. షిరిడీలో అసెంబ్లీకి ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారిన మాజీ మంత్రి రాధాకృష్ణ విఖేపాటిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనతో పాటు శివసేన లోక్‌సభ ఎంపీ సదాశివ కిసాన్ లొఖాండే కూడా తాజా వివాదంలో షిర్డీ ట్రస్ట్‌కు దన్నుగా నిలబడ్డారు.

సాయి పుట్టినది పత్రిలోనేనా..?

ముంబై, జనవరి 20: అసలు షిరిడీ సాయి జన్మించినది పత్రి అనే గ్రామంలోనేనా..? నిజంగానే ఇందుకు సంబంధించిన బలమైన సాక్ష్యాధారాలున్నాయా...? అందుతున్న సమాచారం ప్రకారం... సాయి జన్మస్థలం ఏదో ఎవరికీ కచ్చితంగా తెలియదు. తాను ఫలానా చోట పుట్టానని సాయి కూడా ఎవరికీ చెప్పలేదంటారు. పర్భనీ జిల్లా పత్రిలో ఓ దేశాస్థ బ్రాహ్మణ శాఖకు చెందిన దంపతులకు పుట్టారని, ఆ తరువాత ఓ ఫకీరు పెంపకంలో పెరిగారని ఒక కథ. ఫకీరు భార్య వదలివేయగా సాయి పన్నెండేళ్ల పాటు వెంకూసా అనే హిందూ గురువు శిష్యరికంలో పెరిగారని మరో గాథ. మొత్తం మీద ఆయన బాల్యంలో హిందూ, ముస్లిం కుటుంబ ప్రభావాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది.

షిరిడీ బంద్ ప్రశాంతం

ఆలయ సేవలు యథాతథం

షిరిడీ, జనవరి 20: ఆధ్యాత్మిక శిఖరం సాయి బాబా నడయాడిన షిరిడీలో ఆదివారంనాడు బంద్ ప్రశాంతంగా ముగిసింది. సాయినాథుడి జన్మస్థలంగా భావిస్తున్న పత్రిని రూ 100 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేస్తామంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ రాత్రే చేసిన ప్రకటనపై నిరసన వ్యక్తం చేస్తూ షిర్డీలో గ్రామస్తులు బంద్‌కు పిలుపునిచ్చారు. తొలుత ఆలయాన్ని కూడా మూసేస్తామని ప్రకటించినప్పటికీ తరువాత దాన్ని వెనక్కి తీసుకున్నారు. దీంతో ఆదివారం వేలాది భక్తులు యథావిధిగా దర్శనం చేసుకోగలిగారు. షిరిడీ చుట్టుపక్కల ఉన్న మరో 25 గ్రామాల్లో సైతం బంద్ పాటించారు. సీఎం నిర్ణయాన్ని నిరసిస్తూ షిరిడీలో స్థానికులు ఓ నిరసన ప్రదర్శన తీశారు. షాపులను స్వచ్ఛందంగా మూసేశారు. వివాదం తీవ్ర రూపు దాల్చడంతో ఇరుప్రాంతాల నేతలనూ సీఎం రాత్రే సోమవారం చర్చలకు ఆహ్వానించారు.

4.29 కోట్ల మంది.. 16,443 కిలోమీటర్లు

బిహార్‌లో 4.29 కోట్ల మంది రాష్ట్రవ్యాప్తంగా 16,443 కిలోమీటర్ల పొడవైన మానవహారాన్ని ఏర్పాటు చేశారు. పట్నాలోని గాంధీ మైదాన్‌లో రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ ఈ మానవహారంలో పాల్గొన్నారు. 'జల్‌జీవన్ హరియాలీ' పథకానికి ప్రచారం కల్పించడం కోసం ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టారు.

త్రికోణాకృతిలో కొత్త పార్లమెంట్ భవనం

న్యూఢిల్లీ, జనవరి 19: ప్రతిపాదిత సెంట్రల్ విస్టాలో భాగంగా త్రికోణాకృతిలో, పైన మూడు రంగుల పుంజం (బీమ్)తో కొత్త పార్లమెంటు భవనాన్ని నిర్మించనున్నారు. ఈ భవనంలో 900 మంది లోక్‌సభ సభ్యులతో పాటు ఉభయ సభల సమావేశం సందర్భంగా 1,350 మంది ఎంపీలు కూర్చునే వీలుంది. ప్రసుత్తం ఉన్న భవనం సహా 13 ఎకరాల విస్తీర్ణంలో ఈ సముదాయం నిర్మితం కానుంది. అహ్మదాబాద్‌కు చెందిన హెచ్‌సీపీ సంస్థ రూపొందించిన ఆకృతులు ఈ ఏడాది ప్రథమార్థంలోపే ఖరారు కానున్నట్లు తెలుస్తోంది.

శ్రీలంకకు 355 కోట్ల సాయం ప్రకటించిన భారత్

కొలంబో, జనవరి 19: శ్రీలంక భద్రతా బలగాలకు కావాల్సిన ఆయుధాల కొనుగోలు కోసం ఆ దేశానికి భారత్ రూ.355 కోట్ల సాయాన్ని ప్రకటించింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ శ్రీలంకలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన చేసింది. శ్రీలంక అధ్యక్షుడు గోటబాయ రాజపక్సతో శనివారం దోభాల్ సమావేశమయ్యారు. రక్షణ రంగంలో సహకారం, సముద్ర జలాల్లో భద్రత, ఇంటెలిజన్స్ షేరింగ్ సహా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించారు.

పాక్‌లో ఉగ్ర శిబిరాల వద్ద కెమెరాలు, సెల్ టవర్లు!

న్యూఢిల్లీ, జనవరి 19: ఉగ్రవాదులకు అండదండలు అందిస్తూ భారత్ పైకి ఎగదోస్తున్న పాకిస్థాన్.. ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. ఉగ్రవాద శిబిరాలకు రక్షణగా ఉండేందుకు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంట హైటెక్ కెమెరాలు, సెల్ టవర్లను ఏర్పాటు చేసింది. పాక్ సైన్యం, ఐఎస్ఐ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేసినట్లు భారత ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. ఎల్‌వోసీ వెంట ఉన్న గ్రామాల్లో బాంబు దాడులు చేసేందుకు ఉగ్రవాదులు పథకం వేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. ఇందుకు బదులుగా భారత సైన్యం ప్రతిదాడులు, సర్జికల్ స్ట్రయిక్స్ వంటివి చేపడితే అప్రమత్తం చేసేలా కెమెరాలు, టవర్లను ఏర్పాటు చేశారన్నాయి. మొత్తంగా 18 సిగ్నల్ టవర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించాయి.

యెమెన్‌లో క్షిపణి దాడి.. 100 మంది జవాన్ల మృతి

దుబాయ్, జనవరి 19: యెమెన్‌లోని సైనిక శిబిరంపై హూతీ రెబెల్స్ క్షిపణి, డ్రోన్ దాడికి పాల్పడ్డారు. సెంట్రల్ యెమెన్‌లోని సైనిక శిబిరంలో ఉన్న మసీదుపై జరిపిన ఈ దాడిలో 100 మంది సైనికులు మరణించారు. 150 మందికి పైగా గాయపడినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. రాజధాని సనాకు 170 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరీబ్‌లో ఈ ఘటన జరిగినట్లు వెల్లడించాయి.

నిలకడగా షబానా అజ్మీ ఆరోగ్యం

ముంబై, జనవరి 19: ప్రముఖ నటి షబానా అజ్మీ కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ముంబై-పుణె రహదారిపై అజ్మీ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఇందుకు కారకుడైన డ్రైవర్ కమలేశ్ కామత్ (38)పై పోలీసులు కేసు పెట్టారు. కోకిలాబెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షబానా అజ్మీ పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

దావోస్‌కు 100 మంది భారత సీఈవోలు

- కేంద్ర మంత్రులు, సీఎంలు, దీపిక, సద్గురు జగ్గీవాసుదేవ్ కూడా..
- నేటి నుంచే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సు.. చేరుకున్న కేటీఆర్

దావోస్, జనవరి 19: 'ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్)' 50వ వార్షిక సదస్సుకు మూడు వేల మందికి పైగా నేతలు హాజరవనున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రిన్స్ చార్లెస్, జర్మనీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్, పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సహా వివిధ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. భారత్ నుంచి 100 మందికి పైగా సీఈవోలు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు బాలీవుడ్ నటి దీపికా పదుకొనే, సద్గురు జగ్గీవాసుదేవ్ కూడా సదస్సులో పాల్గొంటున్నారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు జరగనున్న సదస్సులో దీపిక మానసిక ఆరోగ్యం, ఇతర అంశాలపై మాట్లాడతారు. 3వేల మందికి పైగా ప్రపంచ నేతలు పాల్గొనే ఈ సదస్సులో సద్గురు.. ఉదయం వేళలో ధ్యానం చేయించనున్నారు. 'సమైక్య, సుస్థిర ప్రపంచం' అనే అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లు, ఆర్థిక అసమానతలు, వాతావరణ మార్పులు తదితర అంశాలపై నేతలు చర్చిస్తారు. కాగా.. తెలంగాణ రాష్ట్రం తరఫున మంత్రి కేటీఆర్ ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఆదివారం అధికారులతో కలిసి దావోస్ చేరుకున్నారు.

సుప్రీం కోర్టు రాజ్యాంగబద్ధమే అంటే సీఏఏను రాష్ట్రాలు వ్యతిరేకించలేవు

- చట్టంపై వ్యతిరేకతైనా, సవరణలైనా అంతకు ముందే: సిబల్

న్యూఢిల్లీ, జనవరి 19: "సీఏఏను వ్యతిరేకిస్తూ, ఆ చట్టంలో సవరణలు కోరుతూ తీర్మానాలు చేసే హక్కు అన్ని రాష్ట్రాలకు ఉంది. కానీ ఒక్కసారి సుప్రీం కోర్టు ఈ చట్టాన్ని రాజ్యాంగబద్ధమైనదిగా గుర్తిస్తే మాత్రం రాష్ట్రాలు సీఏఏను వ్యతిరేకించలేవు" అని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ అన్నారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని అమలు చేయబోం అన్ని ప్రకటించడం రాజ్యాంగవిరుద్ధమేనని ఆదివారం పునరుద్ఘాటించారు. శనివారం కేరళలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. సీఏఏను వ్యతిరేకిస్తూ పలు రాష్ట్రాలు తీర్మానాలు చేస్తున్న నేపథ్యంలో సిబల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ మరో సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ సమర్థించారు. చట్టాన్ని ప్రతీ ఒక్కరూ గౌరవించాల్సిందేనన్నారు. "ఆర్టికల్ 131 ప్రకారం కేంద్రం చేసిన చట్టాల విషయంలో విభేధించే హక్కు రాష్ట్రాలకు ఉంది. ఈ విషయాన్ని బీజేపీ ప్రభుత్వం, గవర్నర్లు మర్చిపోకూడదు" అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా అన్నారు.

వైఎస్ ఉండుంటే!

- అభివృద్ధిని విస్తరించిన నాటి సీఎం
- సైబరాబాద్ నిర్మాణాన్ని ఆపలేదు
- అంతర్జాతీయ విమానాశ్రయం.. రింగ్‌రోడ్డులోనూ అదే వైఖరి
- తప్పు జరగకుంటే అమరావతితోనూ అదే ఫలితం!

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధి, రాజధాని భవిష్యత్తు ఏం కానుంది? ఎప్పుడో నాలుగేళ్ల క్రితం రాజధాని అమరావతే అని టీడీపీ ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని నేడు జగన్ ప్రభుత్వం మార్చబోతోందన్న వార్తలతో అందరి దృష్టీ అమరావతిపైనే కేంద్రీకృతమైంది. ప్రజాభిప్రాయం, రాష్ట్ర ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని వ్యవహరించాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా ప్రవర్తిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఒకసారి గతాన్ని పరిశీలిస్తే ఇలాంటి తీవ్ర నిర్ణయాలు ఎప్పుడూ కనిపించవు. పైగా ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మరో ప్రభుత్వం కొనసాగించిన సందర్భాలు కోకొల్లలు. అంతేకాదు... వైరి పార్టీల్లో ఉన్నా... చంద్రబాబుకి ప్రత్యర్థిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా అప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. ఉదాహరణకు 2004 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభు త్వం హైటెక్ సిటీని నిర్మించి సైబరాబాద్ నగర నిర్మాణానికి పునాది వేసింది. బిల్‌గేట్స్‌తో మాట్లాడి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యాలయం ఏర్పాటుచేయించడంలో చంద్రబాబు విజయం సాధించారు. ఇవన్నీ ఒక ఎత్తు కాగా... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ కూడా సైబరాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించారు. చంద్రబాబు పునాది వేసిన సైబరాబాద్ కదా! అని దాన్ని మార్చేయలేదు. సైబరాబాద్‌ను ఆనుకుని ఉన్న కోకాపేటలో వైఎస్ ఉండగానే భూముల వేలం జరిగింది. ఎకరం ఏకంగా రూ.14కోట్లకు అప్పట్లోనే ధర వచ్చింది. ఇప్పుడు సైబరాబాద్‌లో లక్షల మంది ఐటీ ఉద్యోగులు, కళ్లు చెదిరే షాపింగ్‌మాల్స్, జోరుగా వ్యాపారాలు, ప్రభుత్వానికి ఇబ్బడిముబ్బడిగా ఆదాయం... ఇదంతా ఒక నిర్ణయాన్ని, అభివృద్ధికి పడిన పునాదిని తర్వాత కాలంలోనూ కొనసాగించడం వల్ల వచ్చిందే!

పోచారంలో రహేజా ఐటీ పార్కు

హైదరాబాద్ నుంచి ఉప్పల్ మీదగా ఘట్‌కేసర్ వెళ్లేదారిలో పోచారం అనే చిన్న గ్రామం ఉండేది. ఐటీని కేవలం సైబరాబాద్ వైపే కాకుండా... అటు వైపు కూడా అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆలోచించారు. పోచారంలో రహేజా ఐటీ సెజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అయితే ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే... వైఎస్ అధికారంలోకి వచ్చారు. చంద్రబాబు నిర్ణయాన్ని వైఎస్ ముందుకు తీసుకెళ్లారు. ఫలితం... ఇప్పుడు పోచారం అన్నది ఐటీ హబ్. లక్షలాది మంది అక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. రహేజా ఐటీ సెజ్‌తో పాటు ఆ తర్వాత దేశంలోనే తమ రెండో అతి పెద్ద క్యాంపస్‌ను ఇన్ఫోసిస్ ఇక్కడ నిర్మించింది.

రింగ్‌రోడ్డు.. ఎయిర్‌పోర్టు

మరోవైపు హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మించాలన్న ప్రణాళిక, శంషాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించాలన్న కసరత్తు చంద్రబాబు హయాంలో ప్రారంభమైంది. ఔటర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనను రూపొందించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు భూసేకరణ కూడా పూర్తిచేసి ముందుకెళ్లారు. ఆ తర్వాత వచ్చిన వైఎస్ ఈ రెంటినీ కొనసాగించారు. పైగా ఔటర్ రింగ్‌రోడ్డును మరింత వెడల్పుగా నిర్మించారు. అక్రమాలు జరిగాయని తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని పక్కన పెడితే... ఇప్పుడు ఈ రెండూ హైదరాబాద్‌ను సంపద సృష్టి కేంద్రంగా ఎలా మార్చాయో అందరికీ తెలిసిందే.

నిండా ముంచేస్తారా?

ఒకవైపు రైతుల గగ్గోలు.. మరోవైపు ప్లాట్లు కొన్నవారి పాట్లు.. అమరావతిలో ఇరువర్గాల ఆవేదన

- భూములు తిరిగిచ్చినా సాగు అసాధ్యం
- కమతాలు సాగు లక్షణం కోల్పోయాయి
- రాజధాని రైతుల తీవ్ర ఆందోళన
- కష్టార్జితాన్ని వేల కోట్ల పెట్టుబడులుగా పోశాం
- రాజధాని లేదంటే.. ఆత్మహత్యలే శరణ్యం
- కన్నీటి సుడిలో ప్లాట్ల కొనుగోలుదారులు
- ఇరు వర్గాల్లో కట్టలు తెగుతున్న ఆందోళన

తుళ్లూరు దీక్ష శిబిరంలో రైతులు, మహిళల నిరసన

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఒకవైపు అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు. మరోవైపు.. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లను కొనుగోలు చేసిన ఆశాజీవులు. ఈ ఇరు వర్గాలు సీఎం జగన్ చేసిన మూడు రాజధానుల ప్రకటన, తదనంతరం పరిణామాలతో తమను 'నిండా ముంచేస్తారా?' అంటూ గుండెలు బాదుకుంటున్నారు. అమరావతిని తరలించేసి.. తమ భూములను తిరిగి ఇచ్చినా ఏం చేసుకుంటామని రైతులు, అమరావతి ప్రాభవం పోతే.. వేల కోట్లు పోసి కొన్న రిటర్నబుల్ ప్లాట్లకు విలువపడిపోతే.. తమ పరిస్థితి ఏంటని కొనుగోలుదారులు కన్నీరుమున్నీరవుతున్నారు. వెరసి రాజధానిలో అటు రైతులు, ఇటు ప్లాట్ల కొనుగోలు దారులు రోడ్డునపడ్డారు.

విత్తు మొలకెత్తదు!

అమరావతిలో ఆందోళన చేస్తున్న రైతులను చల్లబరిచేందుకు మంత్రులు పలు వ్యాఖ్యలు చేస్తున్నారు. రైతులకు భూములను తిరిగి ఇచ్చేస్తామని, మళ్లీ గతంలో మాదిరిగా వ్యవసాయం చేసుకోవచ్చుననీ అంటున్నారు. అయితే, మంత్రుల మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకపోవడం గమనార్హం. రైతులు ఇచ్చిన భూముల్లో అమరావతి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భారీ నిర్మాణాలు, రహదారులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, వరద నియంత్రణ ప్రాజెక్టుల పనులు జరిగాయి. వందల ఎకరాల భూముల్లో కాంక్రీట్ నిర్మాణాలు వెలిశాయి. ఫలితంగా ఆయా భూములన్నీ సేద్య లక్షణాలను కోల్పోయాయి. దీంతో వాటిలో విత్తు మొలకెత్తడం అసాధ్యం. ఇవే కాకుండా టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వారి ఆలయం, రాజధాని గ్రామాల్లో పలు స్టార్ హోటళ్లు, విద్యాసంస్థలు తదితరాలకు భూములను విక్రయించారు. దీంతోపాటు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ దాదాపుగా చివరి దశకు చేరిన పలు గ్రామాల్లో పూలింగ్ కింద ఇచ్చిన భూముల గట్లను తొలగించి, వాటిని ఏకమొత్తంగా మార్చేశారు. దీంతో ఎవరి భూములు ఏవో చెప్పలేని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ భూములకు ఆనుకుని ఉన్న డొంకలు, బాటలు, వాగులు కూడా పూలింగ్ భూముల్లో కలసిపోయాయి. ఈ పరిస్థితుల్లో మళ్లీ పొలాల గట్లను గుర్తించడం, వాటి సేద్య స్వభావాన్ని పునరుద్ధరించి, వ్యవసాయానికి అనువుగా చేయడం అసాధ్యమని రైతులు చెబుతున్నారు.

రిటర్నబుల్ ప్లాట్ల పరిస్థితి మరీ దారుణం

పలువురు రైతులు పూలింగ్ కింద ఇచ్చిన భూములకు బదులుగా ఏపీసీఆర్డీయే వారికి నివాస, వాణిజ్య స్థలాల(రిటర్నబుల్ ప్లాట్ల)ను కేటాయించింది. అయితే, వీటిని చాలా మంది రైతులు తమ కుటుంబావసరాల కోసం విక్రయించారు. ప్రపంచస్థాయి నగరంగా అమరావతి ఎదుగుతుందని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు తథ్యమన్న అభిప్రాయంతో రాష్ట్రానికి చెందినవారితోపాటు ప్రవాసాంధ్రులు, రాష్ట్రేతరులు రాజధానిలోని 29 గ్రామాల్లో ఉన్న రిటర్నబుల్ ప్లాట్లను కొనుగోలు చేశారు. ఆయా ప్లాట్ల భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు, వాటికి చేరువలోని ప్రాజెక్టులపై ఆధారపడి ఈ స్థలాలకు ధరలు పలికాయి. కృష్ణానదికి, సీడ్ యాక్సెస్ రహదారికి, గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు చేరువలో ఉన్న ప్లాట్లకు చదరపు గజానికి రూ.35,000 నుంచి రూ.40,000 వరకు ధర పలికింది. రాజధానిలోని ఇతర గ్రామాల్లో చదరపు గజం రూ.20,000 నుంచి రూ.35,000 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. వీరిలో బడా వ్యక్తులే కాకుండా మధ్యాదాయ వర్గాలకు చెందిన వారు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు ఉన్నారు. భవిష్యత్తులో అమరావతిలో స్థలాల ధరలు పెరిగి, తాము కొనలేని పరిస్థితులు నెలకొంటాయన్న అభిప్రాయంతో పలువురు అప్పులు తెచ్చో లేదా ఇతర చోట్ల ఉన్న ఆస్తులను అమ్మేసో ఇక్కడ ప్లాట్లు కొన్నారు. ఈ ప్లాట్ల క్రయవిక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు స్టాంప్ డ్యూటీల రూపంలో రూ.కోట్లు సమకూరాయి.

'ఫలితాలు' తారుమారు!

గత ఏడాది ఎన్నికల్లో టీడీపీ ఓడి, వైసీపీ గద్దెనెక్కిన నాటి నుంచి రాజధానిలో ప్రాజెక్టులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో అమరావతి భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పరిణామంతో ప్లాట్ల ధరలు గణనీయంగా పడిపోయాయి. దీంతో బిత్తరపోయిన ప్లాట్ల కొనుగోలుదారులు ఆలస్యంగానైనా జగన్ ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని ప్రారంభిస్తుందని, ధరలు పుంజుకుంటాయని, తమ పెట్టుబడులకు భరోసా ఉంటుందని కొండత ఆశలు పెట్టుకున్నారు. అయితే, 'రాజధాని వికేంద్రీకరణ' ప్రతిపా

ఆంధ్రజ్యోతి

ఒక రాష్ట్రం.. 3 రాజధానులు

విజయవాడ ●సోమవారం 20 జనవరి 2020

'రాజధాని' బెంగతో మరో ఇద్దరు మృతి

- ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులు

తుళ్లూరు జనవరి 19: రాజధాని కోసం మరో రెండు ప్రాణాలు బలి అయ్యాయి. రాజధానికి భూములిచ్చిన తమపైనే పోలీసులు దౌర్జన్యం చేశారని, తన మనవడిని అరెస్టు చేశారనే మనోవేదనతో మహిళా రైతు బెజవాడ సామ్రాజ్యమ్మ(70) మృతి చెందారు. ఈమె కుటుంబం దాదాపు 15 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చారు. మందడంలో ఇటీవల పోలీసుల తన మనవడిని కొల్లిపర స్టేషన్‌కు తరలించారు. ఈ వేదనతో ఆమె మరణించినట్లు బంధువులు తెలిపారు. వెలగపూడికి చెందిన అబ్బూరి అప్పారావు (60)ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబం 10 ఎకరాలు రాజధానికి ఇచ్చారు. వెలగపూడిలో జరుగుతున్న నిరసనల్లో ఆయన పాల్గొంటున్నారు.

సామ్రాజ్యమ్మ

అప్పారావు

ముట్టడి.. కట్టడి!

టీడీపీ నేతలపై పోలీసుల ఉక్కుపాదం

రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు

విశాఖలో జీవీఎంసీ గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీతో మాట్లాడుతున్న పోలీసులు

పిఠాపురంలో వర్మను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ జగదీశ్‌ను నిర్బంధించిన పోలీసులు

అనంతపురంలో చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాశ్‌నాయుడు తదితరులు

కడప జిల్లాలో టీడీపీ నేత పంతగాని నరసింహప్రసాద్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

పుంగనూరులో టీడీపీ నేత అనీషారెడ్డి హౌస్ అరెస్ట్

విజయనగరంలో గృహ నిర్బంధంలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తదితరులు

- ఎక్కడికక్కడ గృహనిర్బంధాలు, బైండోవర్లు
- నాయకుల ఇళ్లకు నోటీసులు
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో బలగాల పహరా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాజధానిగా అమరావతిని కొనసాగించాలన్న డిమాండ్‌తో చలో అసెంబ్లీకి అమరావతి పరిరక్షణ సమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో టీడీపీ, జేఏసీ నేతలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రాష్ట్రం నలుమూల నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేశారు. మరికొందరిని అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు ఈ నిర్బంధాలు కొనసాగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. స్థానికంగా నిరసన ప్రదర్శనలకు కూడా అవకాశం లేకుండా అన్ని జిల్లాల్లో అరెస్టులు, గృహ నిర్బంధాలు చేస్తున్నట్లు సమాచారం. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ నిర్బంధం మోతాదు మరీ అధికంగా ఉంది. సిటింగ్ ఎమ్మెల్యేలు మినహాయించి ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, కిందిస్థాయి నాయకులు, చురుగ్గా ఉండే కార్యకర్తలు, జేఏసీ నేతలందరినీ గృహ నిర్బంధం లేదా అరెస్టు చేశారు. అమరావతికి వెళ్లే రహదారులపై అనేక ఆంక్షలు విధించారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టయిన టీడీపీ నేతల సంఖ్య 400కు పైగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వెల్లడించింది. విజయనగరంలో కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతి రాజు, ఆయన కుమార్తె అదితి తదితరులను అరెస్టు చేసి, గృహనిర్బంధం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పోలీస్ పహరా ఏర్పాటు చేశారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, ఆయన అనుచరులను అరెస్టు చేశారు. పార్వతీపురంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సాలూరులో ఎమ్మెల్సీ గుమ్మిడి సంధ్యారాణి, మాజీఎమ్మెల్యే బంజ్‌దేవ్‌ను గృహనిర్బంధం చేశారు. అనంతపురంలో జేఏసీ జిల్లా కన్వీనర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీశ్‌ను గృహనిర్బంధం చేశారు. చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాశ్ నాయుడు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి నాయకులను స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరాయచౌదరి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఉమామహేశ్వరనాయుడు, బండారు శ్రావణిశ్రీ, పార్టీ శ్రేణులను ముందస్తు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కనీసం వందమంది టీడీపీ నేతలకు నోటీసులు జారీచేసి, బైండోవర్ చేశారు. ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఇంటివద్ద పోలీసు పహరా ఏర్పాటు చేశారు. దర్శిలో మాజీఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులకు నోటీసులు జారీచేసి బైండోవర్ చేశారు. పశ్చిమగోదావరి నల్లజర్లలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజును గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, మాధవనాయుడు సోదరుడు పటేల్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెంటే పార్థసారథి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావును భీమవరంలో గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద పోలీసు బలగాలను మోహరించారు. విశాఖ జిల్లా పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని హౌస్‌అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, వనమాడి కొండబాబు, మేయర్ సుంకర పావని, టీడీపీ సీనియర్ నేత అల్లుమల్లు విజయ్‌కుమార్‌ను, పి.గన్నవరం మండలంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు తదితరులను హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పోలీసు వలయాన్ని ఛేదించుకుని విజయవాడ చేరుకున్నారు. ఎమ్మెల్యే భవానీ శ్రీకాకుళం నుంచి బయలుదేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మద్దిపట్ల సూర్యప్రకాశ్, రెడ్డివారి గురవారెడ్డిని చిత్తూరు జిల్లాలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ నేత అనిషారెడ్డిని గృహనిర్బంధం చేశారు. కృష్ణాజిల్లాలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, బచ్చుల అర్జునుడు, పి.అశోక్‌బాబు, ఎంపీ కేశినేని శ్రీనివాస్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎ.శివారెడ్డి సహా నాయకులందరికీ నోటీసులు అందజేశారు. కడపలో మాజీమంత్రి పి.రామసుబ్బారెడ్డిని, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని, టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డిని పోలీసులు హౌస్ ఆరెస్టు చేశారు.

చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో పరిస్థితిని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆదివారం రాత్రి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేయాలని, అమరావతి కొనసాగింపునకు మద్దతు ఇవ్వాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు.

ఉద్యోగుల క్వార్టర్స్‌పైకి ఎక్కిన రైతులు... కిందకి దిగి రావాలని వేడుకుంటున్న వారి కుటుంబ సభ్యులు

చావడానికి సిద్ధంగా ఉన్నాం

ఎమ్మెల్యే క్వార్టర్స్‌పైకెక్కిన రైతులు.. ఎన్జీవో టవర్లపై మరో నలుగురు

గుంటూరు/తుళ్లూరు, జనవరి 19: రాజధానిని తరలించవద్దని కోరుతూ రైతులు ఆత్మహత్యలకు సిద్ధమయ్యారు. రాయపూడి వద్ద నిర్మిస్తున్న ఎమ్మెల్యే నివాస భవనాలపైకి సోమవారం ముగ్గురు రాజధాని రైతులు ఎక్కి ఆందోళన చేపట్టారు. నెక్కలు, రాయపూడి గ్రామాలకు చెందిన కొమ్మినేని నరసింహస్వామి, చిలకా బసవయ్య, వినోద్ భవనంలోని ఎనిమిదో అంతస్థుకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఎమ్మెల్యే ఇక్కడకు రావాలని డిమాండ్ చేశారు. ఇక్కడికొచ్చి దూకితే గ్రాఫిక్స్ భవనాలో కాదో తేలిపోతుందని సవాలు విసిరారు. వారి కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతంలో దాదాపు రెండుగంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. మిగిలిన రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారి డిమాండ్లు పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో కిందకు దిగివచ్చారు. కాగా, నేలపాడులో నిర్మించిన ఎన్జీవో ఇళ్ల టవర్లపైకి ఐనవోలుకు చెందిన నలుగురు రైతులు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దూకి చావడానికి సిద్ధంగా ఉన్నామని వారు ప్రకటించటంతో బంధువులు, గ్రామస్థులు వచ్చి సముదాయించారు.

ఉద్యమానికి 2.3 లక్షల విరాళం

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఉద్యమానికి ఆదివారం రూ.2.3 లక్షలు విరాళంగా అందాయి. గుంటూరు జిల్లా తాడికొండ మండలం బడేపురం గ్రామస్తులు టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి రూ.1,00,116 అప్పగించారు. ప్రకాశం జిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో వీరాయపాలెం గ్రామస్థులు కూడా రూ.లక్ష విరాళమిచ్చారు. అలాగే రాజధాని గ్రామాల వారు అమరావతి పరిరక్షణ జేఏసీకి రూ.30 వేలు విరాళమిచ్చారు.

పాదయాత్రగా దుర్గమ్మ చెంతకు..

- మందడం నుంచి 13కిలోమీటర్ల కాలినడక
- మేళతాళాలతో ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి
- మొక్కు తీర్చుకున్న రాజధాని మహిళలు

విజయవాడ/గుంటూరు/తుళ్లూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలని కోరుతూ పలువురు మహిళలు పాదయాత్రగా వెళ్లి బెజవాడ దుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మందడం శివాలయం నుంచి దుర్గమ్మ సన్నిధికి పెద్దసంఖ్యలో కాలినడకన తరలి వెళ్లారు. అమ్మవారి ఫొటోలు పట్టుకుని, నెత్తిన కలశ కుండలతో మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. మార్గమధ్యంలోని గ్రామాల మహిళలతో కలిసి పొంగళ్లతో 13 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగించారు. రాజధాని ముఖద్వారమైన తాడేపల్లి పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజీ వద్ద పెద్దసంఖ్యలో రైతులు, రైతు కూలీలు వచ్చిన తమ సంఘీభావం తెలిపారు. ఈనెల 10న ఇదేవిధంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు ఊరేగింపుగా బయల్దేరిన మహిళలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం, వారిపట్ల అనుచితంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. దానిపై హైకోర్టు సీరియస్ అయిన నేపథ్యంలో సోమవారం ఇంద్రకీలాద్రి వరకు మహిళలు చేపట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతినిచ్చారు. దీంతో 'సేవ్ అమరావతి' అని రాసిన బ్యానర్‌తో ర్యాలీగా వెళ్లి దుర్గమ్మను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

తుళ్లూరు దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిటాల శ్రీరాం

హైకోర్టుతో సీమ తలరాత మారుతుందా?: పరిటాల

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఇచ్చినంత మాత్రాన రాయలసీమ తలరాత మారుతుందా అని టీడీపీ నేత పరిటాల శ్రీరాం ప్రశ్నించారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ మహిళలు, రైతులు చేస్తున్న ఉద్యమం అందరికీ స్ఫూర్తినిస్తోందన్నారు. ఆదివారం ఆయన మందడం, తుళ్లూరు, వెలగపూడి దీక్ష శిబిరాలను సందర్శించారు. అమరావతి విషయంలో మొండిగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. రాజధాని విషయంలో ఒంటెద్దు పోకడలతో అసెంబ్లీలో తమకు అనుగుణంగా బిల్లులు ఆమోదించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజా ఉద్యమం ముందు ఎవరైనా తలవంచాల్సిందేనన్నారు. వెలగపూడిలో మృతి చెందిన రైతు అప్పారావు భౌతికాయానికి శ్రీరాం నివాళర్పించి వారి కుటుంబాన్ని ఓదార్చారు.

కృష్ణా వారధి కింద ఇసుకలో నిరసన తెలియజేస్తున్న ఆవారా బృందం సభ్యులు

జగన్ మొనగాడైతే... అసెంబ్లీ రద్దుచేసి ఎన్నికలకెళ్లాలి : తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), జనవరి 19: సీఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు రాష్ట్రానికి రాహు, కేతువుల్లా తయారవడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో అమరావతి నిర్మిస్తానని మాజీ సీఎం చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపితే, మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రజలకు కైలాసం చూపుతున్నారన్నారు. రాజధాని మార్పు చారిత్రక తప్పిదమన్నారు. రాజధానిని మార్చాలనుకున్న సీఎం మొనగాడయితే అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలకు పోవాలని సవాల్ విసిరారు. 2014 సెప్టెంబరు 14న అసెంబ్లీలో అమరావతి రాజధానికి మద్దతిస్తున్నామని, తాను ఇక్కడ నివాసం కట్టుకున్నానని చెప్పిన జగన్... అధికారం రాగానే మాట మార్చడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఇదేమాట ఎన్నికలకు ముందు అనుంటే వైసీపీకి 21సీట్లు కూడా వచ్చేవి కాదన్నారు. పిచ్చి తుగ్లక్ చర్యలు కట్టిపెట్టి రాజధానిని ఇక్కడే కొనసాగించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఓటు వేస్తున్న మహిళలు

కర్నూలు మాటా అమరావతే!

- అమరావతికి అనుకూలంగా 3409 ఓట్లు
- రాజధానిగా విశాఖను కోరింది 37 మందే

ఎమ్మిగనూరు, జనవరి 19: రాజధానిపై టీడీపీ నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో కర్నూలు ప్రజలు అమరావతికే జైకొట్టారు. ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఓటింగ్‌లో మొత్తం 3461 మంది పాల్గొనగా, అమరావతినే కొనసాగించాలంటూ 3,409 మంది ఓటు ద్వారా కోరుకున్నారు. విశాఖకు మద్దతుగా 37 మంది ఓటు వేశారు. 15 ఓట్లు చెల్లలేదు. ప్రజా బ్యాలెట్ కోసం వేలాది మంది రావడంతో ఓటింగ్ జరిగే ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు జగన్ అధికారం కోసం ప్రజాభిప్రాయం అడిగారని, ఇప్పుడు ప్రజాభిప్రాయం తీసుకోకుండా మూడు రాజధానులు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు.

గంగమ్మా.. ప్రభుత్వ మనసు మార్చమ్మా..!

తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించి, అమరావతిలోనే రాజధాని ఉండేలా చూడుతల్లీ అని తిరుపతిలోని తెలుగు మహిళలు గంగమ్మను వేడుకున్నారు. ఆదివారం సాయంత్రం వేయికళ్ల దుత్తలతో తాతయ్యగుంట గంగమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వైసీపీ నాయకుల కళ్లు తెరిపించాలంటూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి హుండీలో వినతిపత్రాలు సమర్పించారు.

అసెంబ్లీ వద్ద మోహరించిన పోలీసులు

సర్వం.. పోలీస్‌మయం!

బలగాల పదఘట్టనల్లో అమరావతి

- సచివాలయానికి మూడంచెల భద్రత
- 29 గ్రామాల్లోనూ భారీగా మోహరింపు

అమరావతి, గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి... పోలీసుల రాజ్యంగా మారిపోయింది! సోమవారం అసెంబ్లీ ముట్టడికి అమరావతి జేఏసీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో రాజధాని ప్రాంతాన్ని పోలీసులు పూర్తిగా అదుపులోకి తీసుకున్నారు. అసాధారణ స్థాయిలో సచివాలయం, అసెంబ్లీ వద్ద పోలీసులు... అక్కడికి వెళ్లే ప్రతి దారిలోనూ భారీగా బలగాలు! కరకట్టపైన చెక్‌పోస్టులు పెట్టి ప్రతి కదలికపైనా నిఘా! రాజధానిలోని ప్రతి గ్రామంలోనూ పెద్ద సంఖ్యలో దిగిపోయిన పోలీసులు... ప్రతి వీధిపైనా, ఆ మాట కొస్తే ప్రతి ఇంటిపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు! సీడ్ యాక్సిస్ రోడ్డు, మందడం, మల్కాపురం జంక్షన్, సచివాలయం ప్రధాన రహదారి, వెలగపూడి గ్రామాల్లో లాఠీలు, తుపాకులు, ఇనుప కంచెలతో ఆదివారం ఉదయమే వాలిపోయారు. సీతానగరం లోటస్ ఫుడ్, కరకట్ట మార్గం, ఉండవల్లి కూడలి, ఉండవల్లి గుహాలయాలు, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, పెనుమాకలకు భారీగా పోలీసులను తరలించడంతో టెన్షన్ వాతావరణ నెలకొంది. పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టి... అనుమానితులు కనిపిస్తే వెంటనే కంట్రోల్ రూముకు సమాచారం చేరవేస్తున్నారు. ముట్టడి కోసం వచ్చే వారిని గుంటూరు, బెజవాడలోనే అడ్డుకునేలా మఫ్టీలో పోలీసులు నిఘా వేశారు. రాజధాని రోడ్లపై కనిపించిన ప్రతి వ్యక్తినీ, విజయవాడ, గుంటూరు రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో దిగే ప్రయాణికులను సైతం అడ్రస్ కోసం ప్రశ్నిస్తున్నారు. మీరెవరు.? ఎక్కడి నుంచి వస్తున్నారు.? ఆధార్ కార్డు ఏదీ.? తదితర ప్రశ్నలతో ఇంటరాగేషన్ చేస్తున్నారు. మరోవైపు, వెయ్యి మంది పోలీసులతో సచివాలయానికి మూడంచెల భద్రత కల్పించారు. అధికారిక సమాచారం ప్రకారం భద్రత విధుల కోసం మొత్తం 5వేల మందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్తున్నా అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని తెలుస్తోంది. సోమవారం నాడు అసెంబ్లీ సమావేశాలున్నందున వెలగపూడి సచివాలయం వైపు ఎవరూ వెళ్లరాదని, అక్కడ 144 సెక్షన్ అమల్లో ఉందంటూ రాజధాని జిల్లాల్లో ప్రతిపక్ష నేతలకు పోలీసులు శనివారమే నోటీసులు జారీ చేసి నిర్బంధంలోకి తీసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తమ ప్రాంతం నుంచి వచ్చే లీడర్లు, చోటా నాయకులను గుర్తించేందుకు కృష్ణా జిల్లా, విజయవాడ సిటీల్లో మకాం వేశారు. రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన ఇంటెలిజెన్స్ సిబ్బంది గుంటూరు జిల్లాతోపాటు రాజధాని ప్రాంతంలో మఫ్టీలో తిరుగుతున్నారు.

వేకువ జాము నుంచే కార్బన్ సెర్చ్

రాజధాని ప్రాంతానికి ఆదివారమే చేరుకున్న అదనపు బలగాలు సోమవారం వేకువ జాము నుంచే కార్టన్ సెర్చ్ నిర్వహించబోతున్నాయి. ఆయా గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి కొత్త వ్యక్తులు ఎవరైనా ఉన్నారా?.. ఇంట్లో వ్యక్తులు ఎవరూ బయటికి రావొద్దు!.. అని హెచ్చరిస్తారు. అయినా బయటికి వస్తే గ్రామ శివారులో అదుపులోకి తీసుకుంటారు. విజయవాడ నుంచి తాడేపల్లి వైపు వెళ్లే సామాన్య ప్రజానీకాన్ని సోమవారం వేకువ జాము నుంచే ప్రకాశం బ్యారేజీపై ఆపేస్తారు. ఆయా గ్రామాల వ్యక్తులను సైతం అనుమతించకుండా మరో మార్గం ఎంచుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, పాత్రికేయులను గుర్తింపు కార్డు చూపిస్తే అనుమతిస్తారు.

ఇది మావోయిస్టుల కోసం కూంబింగ్ కాదు.. అసెంబ్లీ ముట్టడికి జేఏసీ పిలుపునిచ్చిన నేపథ్యంలో రాజధాని ప్రాంతంలో తుపాకులు, బాంబ్ స్క్వాడ్, ఇనుప తీగలతో మోహరించిన పోలీసులు

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సీఎం

3 మీదే ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని ప్రాంతంలో ఆంక్షలు అమలు చేయడం సహా.. శాసనసభలో అనుసరించాల్సిన వ్యూహాలపైనా ఆయన సమీక్షించారు. శాసనసభలో పార్టీలో అంతర్గత సమన్వయంపైనా చర్చించారు. ఈ భేటీలో ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో పాటు ముఖ్య సలహాదారు అజేయ కల్లం, సీఎంవో అధికారులు హాజరయ్యారు. ఇటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఇతర అధికారులతో శాంతి భద్రతలపై సీఎం సమీక్ష జరిపారు.

ముట్టడి నేరం

- ఆగంతకులు అసెంబ్లీలోకి ప్రవేశిస్తే సహించం
- నిరసనలు చట్టానికి లోబడి ఉండాలి
- లేకుంటే జైలు శిక్ష వేసే అధికారమూ ఉంది
- సీనియర్ నేతకూ పాఠాలు చెప్పాల్సి వస్తోంది
- సభ హుందాతనాన్ని కాపాడాలి: తమ్మినేని

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లోకి ఆగంతకులు ప్రవేశిస్తే సహించబోమని శాసన సభాపతి తమ్మినేని సీతారాం హెచ్చరించారు. సోమవారం శాసనసభ సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం విజయవాడలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన చట్టసభల హక్కులను కాలరాయాలని చూడటం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అన్నారు. చట్టసభల్లోకి ఆగంతకులు ప్రవేశించడానికి వీల్లేదన్నారు. నియమాలకు విరుద్ధంగా ప్రవేశిస్తే జైలు శిక్ష వేసే అధికారం కూడా ఉందన్నారు. నిరసనలు చట్టాలకు లోబడి ఉండాలని సూచించారు. 'ముట్టడిస్తాం.. కట్టడి చేస్తాం.. దాడి చేస్తామంటే.. అది క్రైమ్ కిందకు వస్తుంది' అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలకు వార్నింగులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులకు సమస్యలు చెప్పే అవకాశం ఉందని, సభలో వారు తమ అభిప్రాయాలను చెప్పుకోవచ్చన్నారు. అడ్డుకుంటామంటే, చట్టంలో దాన్ని అడ్డుకోవడానికి కార్యనిర్వాహక వర్గం ఉందన్నారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత సభ్యులపై ఉందన్నారు. 'సభను సజావుగా జరిపించాలని సభాపతిగా సభ్యులందరినీ కోరుతున్నా. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నిరసనలు చేయాలి. సభలను అడ్డుకోవాలని సీనియర్ సభ్యుడు చెబుతున్నారు. ఆయనకు కూడా పాఠాలు చెప్పాల్సి వస్తోంది. చట్టసభలకు సభ్యులు హాజరుకాకుండా నిరోధించడం, అడ్డుకునేందుకు ప్రయత్నించడం కూడా సభా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది' అని స్పీకర్ స్పష్టం చేశారు. గతంలో అలాంటి సందర్భాల్లో జైలు శిక్ష కూడా పడిన సందర్భం ఉందన్నారు.

జగన్ ఆస్తులన్నీ బినామీ పేర్లపైనే!

- లోటస్‌పాండ్, తాడేపల్లి నివాసాలు కూడా..
- మీ, మా ఆస్తులపై చర్చకు సిద్ధమా?
- సీఎంకు టీడీపీ నేత ధూళిపాళ్ల సవాల్

మంగళగిరి, జనవరి 19: నీతిసుద్దులు చెబుతున్న సీఎం జగన్.. 2004కు ముందు, ఆ తర్వాత ఉన్న కుటుంబ ఆస్తులపై చర్చకు రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సవాల్ చేశారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్, తాడేపల్లి నివాసం సహా ఆయన ఆస్తులన్నీ బినామీల పేర్లమీదే ఉన్నాయన్నారు. కానీ తన ఆస్తులన్నీ తన పేరిటో, తన కుటుంబ సభ్యుల పేర్ల మీదో ఉన్నాయని చెప్పారు. ఆదివారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ మాదిరిగా తమకు జైలు కార్డు, బెయిలు కార్డు, బినామీ కార్డులు లేవన్నారు. తన కుమార్తె పేరిట తెల్ల రేషన్ కార్డు ఉన్నట్లు జగన్ పత్రికలో తప్పుడు కథనం వండి వార్చారని.. ఆ కథనాన్ని ఖండిస్తూ తమ కుటుంబం తాలూకు గులాబీ కార్డును నరేంద్ర విలేకరులకు చూపించారు. జగన్ మూడు రాజధానుల ఆలోచనను శహభాష్ అని మెచ్చుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్.. తన రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ ప్రాంతాల్లో పరిపాలనా కార్యాలయాలను వికేంద్రీకరించే ఆలోచన చేస్తున్నారా అని ప్రశ్నించారు. అమరావతి మంటల్లో తెలంగాణ పాలకులు చలికాచుకుంటున్నారని.. జగన్ స్వరాష్ట్రాన్ని నాశనం చేసి తెలంగాణ అభివృద్ధికి కంకణం కట్టుకుని పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఏ-2 నిందితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి కండిషనల్ బెయిల్‌పై ఉంటూ ప్రధానికి, కేంద్ర హోం మంత్రికి ఫలానా అధికారులు వద్దు.. ఫలానే వారే కావాలంటూ లేఖలు రాయడం బెయిల్ నియమ నిబంధనలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. ఉద్యమం చేస్తున్న ప్రజలను జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో తాయిలాలతో మభ్యపెట్టే అవకాశం ఉందని.. ఇప్పటికే ఓట్లేసి మోసపోయిన జనం మరోమారు ఆయన మాటలను నమ్మి మోసపోవద్దని నరేంద్ర సూచించారు.

'బోస్టన్'పై కేసులు పెట్టండి: టీడీపీ

మంగళగిరి, జనవరి 19: రాజధాని అమరావతిపై తప్పుడు ధ్రువీకకరణ పత్రాలతో నివేదిక ఇచ్చిన బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు(బీసీజీ)పై చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆ కంపెనీపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐఐటీ-మద్రాసును సంప్రదించకుండానే.. అమరావతి భూములపై సదరు ఐఐటీ పరిశోధనలు చేసి కృష్ణా కరకట్ట నుంచి 5 కిలోమీటర్ల వరకున్న భూములు నిర్మాణాలకు పనికిరానివని చెప్పినట్లు.. అక్కడ రాజధాని ఏర్పాటు సమర్థనీయం కాదని తేల్చినట్లు బీసీజీ నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ విషయాలను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయకుమారే స్వయంగా వెల్లడించారంటూ.. ఆయన వ్యాఖ్యల తాలూకు వీడియో క్లిప్పింగులను కూడా పోలీసులకు అందజేశారు. బీసీజీ తప్పుడు నివేదిక వల్ల ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున ఆ కంపెనీ డైరెక్టర్‌తో పాటు బాధ్యులందరిపై ఐపీసీ 417, 420 సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని వర్ల కోరారు.

రైతుల్ని జగనే చంపేస్తున్నారు: లోకేశ్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను ముఖ్యమంత్రి జగనే చంపేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మండిపడ్డారు. దున్నపోతు ప్రభుత్వం అక్రమ కేసులతో రైతులను బలితీసుకుంటోందని.. రాజధాని తరలింపుపై ఆందోళనతో చోటుచేసుకున్న రైతుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆదివారం ట్విటర్‌లో ధ్వజమెత్తారు. రాష్ట్రం కోసం త్యాగం చేసిన రైతులకు ఈ పరిస్థితి రావడం దారుణమన్నారు.

149 సెక్షన్ రద్దు చేయాలి: సీపీఎం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల పేరిట విజయవాడ, రాజధాని ప్రాంతంలో సీపీఎం సహా, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులకు 149 సెక్షన్ కింద పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి నిర్బంధ చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

నేడే సభ.. సమరం!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలు మాత్రం జరుగుతాయి. బడ్జెట్ భేటీకి విశాఖే వేదిక అవుతుంది. వెరసి... 'అమరావతి' నామ మాత్రంగా మిగులుతుంది. కాగా, సోమవారం ఉదయం 9 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రి వర్గం సమావేశమవుతుంది. జీఎన్ రావు కమిటీ, బీసీజీ నివేదికలను అధ్యయనం చేసిన హైపవర్ కమిటీ సమర్పించిన నివేదికను ఆమోదించే అవకాశముంది. సీఆర్‌డీఏ చట్టం రద్దుతోపాటు ఇప్పటిదాకా సీఆర్‌డీఏ నిర్వహించిన కొన్ని బాధ్యతలను విజయవాడ - గుంటూరు - మంగళగిరి - తెనాలి (వీజీఎంటీ) పట్టణాభివృద్ధి సంస్థకు అప్పగించడం వంటి బిల్లులను ఆమోదించే అవకాశముంది. అలాగే, 'మూడు రాజధానుల' నిర్ణయంపైనా కేబినెట్ ఆమోద ముద్ర వేయనుంది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం... ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశమవుతుంది. ఇక్కడే అసలు ఘట్టం మొదలవుతుంది. అనుకున్నది సాధించేందుకు అధికార పక్షం... ఎలాగైనా అడ్డుకునేందుకు విపక్షం ఇప్పటికే వ్యూహాలు రచించుకున్నాయి. దీంతో సోమవారం సభలో జరిగే పరిణామాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏదిఏమైనా మూడు రాజధానులకు సభలో ఆమోదం పొంది తీరాలని వైసీపీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పాలన వికేంద్రీకరణపై తమ వాదనను సమర్థిస్తూ, విపక్షాన్ని దునుమాడుతూ సభలో ఒక వీడియో ప్రజంటేషన్ ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇక... మంగళవారం ఉదయం 11 గంటలకు శాసన మండలి సమావేశం కానుంది. పెద్దల సభలో తమదే పైచేయి కావడంతో సర్కారు ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని విపక్షం భావిస్తోంది. అదే జరిగితే ఏం చేయాలన్న అంశంపై అధికార పక్షం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను మండలి ఆమోదించని పక్షంలో... బుధవారం మరోమారు ఈ బిల్లులను శాసనసభలో ఆమోదించి, తిరిగి మండలికి పంపించాలని భావిస్తున్నారు. అప్పుడు... ఆ బిల్లులను మండలి తోసిపుచ్చినా ఒరిగేదేమీ ఉండదు. అంతటితో ఆగకుండా... తన నిర్ణయాలకు అడ్డుపడుతున్న శాసనమండలిని రద్దు చేయాలన్న తీవ్ర నిర్ణయాన్నీ ముఖ్యమంత్రి తీసుకోవచ్చునని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

టీడీఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు, వేదికపై నిమ్మల రామానాయుడు, కళా వెంకట్రావు, అచ్చెన్న, యనమల రామకృష్ణుడు, గల్లా జయదేవ్

ఒక రాష్ట్రం.. ఒకే రాజధాని!

- అసెంబ్లీలో టీడీపీ వాదన ఇదే!!
- ప్రాంతాలకు అతీతంగా ఒకటే వాణి
- అన్ని ప్రాంతాల అభివృద్ధి వద్దన్నదెవరు?
- కడప జిల్లాకు 46 వేల కోట్లిచ్చారు
- ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎందుకివ్వలేదు?
- సీఎం జగన్‌పై టీడీఎల్పీ ఆగ్రహం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రం.. ఒకే రాజధాని అన్న దిశగా అసెంబ్లీలో బలంగా తమ వాదన వినిపించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ప్రాంతాలకు అతీతంగా అన్ని ప్రాంతాల ఎమ్మెల్యేలు ఇదే వాణిని వినిపించాలని కూడా నిశ్చయించింది. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తమ వ్యూహాన్ని ఖరారు చేసుకోవడానికి చంద్రబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శాసనసభా పక్ష సమావేశం ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. రాజధానిని అమరావతి నుంచి మార్చడానికి వైసీపీ ప్రభుత్వం ముందుకు తెచ్చే ప్రతిపాదనలను గట్టిగా వ్యతిరేకించాలని, తమ వ్యతిరేకతను బలంగా నమోదు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. న్యాయపరంగా వచ్చే అడ్డంకులను అధిగమించడానికి ప్రభుత్వం నేరుగా రాజధాని మార్పును ప్రస్తావించకపోవచ్చని, ప్రాంతాల అభివృద్ధి పేరుతో రాష్ట్రం నలుమూలలా జోనల్ కార్యాలయాల ఏర్పాటు ముసుగు తొడగవచ్చని కొందరు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. 'మూడు రాజధానుల పేరుతో వైసీపీ ఎమ్మెల్యేలతో రాష్ట్రమంతటా ప్రదర్శనలు చేయించి ఇప్పుడా విషయం చెప్పకపోతే అది వారి పిరికితనమవుతుంది. అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలని రాష్ట్రమంతా ఉద్యమం జరుగుతుంటే తరలింపు ఉద్దేశం లేదని ప్రభుత్వం ఒక్కమాట చెప్పలేకపోయిందంటే దాని అర్థమేంటి? కోర్టులకు భయపడే ఇప్పుడు దొడ్డిదారులు వెతుకుతున్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి అని చిలక పలుకులు పలుకుతున్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి చేయవద్దని ఎవరు చెప్పారు? రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉన్న అమరావతిలో రాజధానిని ఉంచి అభివృద్ధిని వికేంద్రీకరించండి. మనం అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమకు పరిశ్రమలు తెచ్చాం. సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేశాం. విశాఖను ఆర్థిక, పర్యాటక, టెక్నాలజీ రాజధానిగా చేయాలని ముందుకెళ్లాం. పోలవరం ద్వారా ఉత్తరాంధ్రకు సాగునీటి వసతికి ప్రయత్నించాం. వీళ్లు ఇవన్నీ చెడగొట్టారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖను పిండుకోవడానికే అక్కడకు వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఉత్తరాంధ్రకు నిధులివ్వలేదేం?

జగన్ ప్రభుత్వం వచ్చాక ఒక్క కడప జిల్లా అభివృద్ధికే రూ.46 వేల కోట్లు కేటాయిస్తూ జీవోలు జారీ చేశారని, నిజంగా ఇతర ప్రాంతాలపై అంత ప్రేమ ఉంటే ఉత్తరాంధ్రలోని జిల్లాలకు అన్ని నిధులు ఎందుకు ఇవ్వలేదని ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆ జీవోల కాపీలు కూడా ఆయన చూపించారు. అమరావతిని దేశంలోనే అధునాతన రాజధానిగా నిర్మిస్తున్నందున పెట్టుబడులు భారీగా వచ్చేవని, దాని ద్వారా మొత్తం 13 జిల్లాల అభివృద్ధికి నిధులు సమకూరేవని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు హైదరాబాద్ నుంచి సమకూరుతున్న ఆదాయంతో తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా సుసంపన్నంగా ఉందని, అమరావతినీ రాష్ట్రానికి ఒక మంచి ఆదాయవనరుగా తీర్చిదిద్దాలని తామనుకుంటే ఈ ప్రభుత్వం చెడగొట్టిందన్నారు. 13 జిల్లాలను ఎలా అభివృద్ధి చేయాలనుకున్నానో తాను అప్పుడే చెప్పానంటూ అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్ని ప్రదర్శించారు.

సీఆర్‌డీఏ రద్దు బిల్లు పెట్టరేమో!

అసెంబ్లీలో ప్రభుత్వం పెట్టబోయే బిల్లులపైనా టీడీఎల్పీ భేటీలో చర్చ జరిగింది. సీఆర్‌డీఏ రద్దు బిల్లును పెట్టకపోవచ్చని, జోనల్ వ్యవస్థ ఏర్పాటు బిల్లును మాత్రం పెట్టే అవకాశాలున్నాయని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. కనీసం వారం ముందు బిల్లు ప్రతులు ఇస్తే వాటిని చదివి వచ్చే వీలుండేదని, బిల్లుపై చర్చకు కనీసం రెండు రోజుల వ్యవధి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో కోరాలని నిర్ణయించారు. అసెంబ్లీలో ఏం జరుగుతుందో చూసి శాసన మండలిలో వ్యూహాన్ని నిర్ణయించుకోవాలని నిశ్చయించారు. సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలు వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోయారు.

తన చేతిలోనే సర్వాధికారాలు...

ముఖ్యమంత్రి తన చేతిలో సర్వాధికారాలు కేంద్రీకరించుకుని పాలన వికేంద్రీకరణ గురించి మాట్లాడితే ఏం ఉపయోగమని నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. జడ్పీలకు, మండల పరిషత్‌లకు, గ్రామ పంచాయతీలకు అధికారాలిస్తే అది వికేంద్రీకరణ అవుతుందిగానీ కార్యాలయాల తరలింపుతో కాదన్నారు.

అమరావతి కోసం.. జనసేన ప్రత్యక్ష ఉద్యమం!

- బీజేపీతో కలిసి ఉమ్మడి పోరు
- నేడు విజయవాడలో పీఏసీ భేటీ

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం ప్రత్యక్ష ఉద్యమంలోకి దిగేందుకు జనసేన సన్నాహాలు చేస్తోంది. మిత్రపక్షం బీజేపీతో కలిసి ఉమ్మడి పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఉద్యమ కార్యాచరణపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) కీలక సమావేశం సోమవారం సాయంత్రం విజయవాడలో జరగనుంది. రాజధాని అంశంపై సోమవారం ఉదయం రాష్ట్ర కేబినెట్ తీసుకునే నిర్ణయాలు, అసెంబ్లీలో ప్రభుత్వ విధానాలను బట్టి కార్యాచరణను ఖరారుచేస్తారు. రాజధానిని అమరావతి నుంచి తరలించడానికి వీల్లేదని పవన్ ఇప్పటికే స్పష్టం చేశారు. రాజధాని తరలింపుపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చాక తమ కార్యాచరణ ప్రకటిస్తామని అనేక సార్లు ప్రకటించారు. రాజధాని తరలింపుపై సోమవారం ప్రభుత్వం నుంచి స్పష్టత రానుంది. ఈ నేపథ్యంలోనే జనసేన కూడా పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ నాయకుల అభిప్రాయాలను పవన్ ఈ సందర్భంగా తీసుకుంటారని తెలిసింది. ప్రజల మనోగతమేమిటో తెలుసుకోవాలని ఆయా ప్రాంత నేతలకు సూచించినట్లు సమాచారం. అన్ని ప్రాంతాల మనోభావాలు తెలుసుకున్నాక రాజధానిపై ముందుకెళ్లాలని జనసేన భావిస్తున్నట్లు చెబుతున్నారు. అవసరమైతే విశాఖపట్నంలో మాదిరిగానే అమరావతిలో భారీ స్థాయిలో కవాతు నిర్వహించాలని ఆ పార్టీ నేతలు తొలుత యోచించారు. ఈలోపు బీజేపీతో పొత్తుపై చర్చలు జరగడంతో దానిపై నిర్ణయం తీసుకోలేదు. సోమవారం ప్రభుత్వ నిర్ణయం చూశాక కవాతు చేపట్టడంపై ఆలోచిస్తామని జనసేన నాయకులు చెబుతున్నారు. అలాగే బీజేపీతో కలిసి ఎలా అడుగులు వేయాలో పీఏసీ సమావేశంలో చర్చించనున్నారు. రెండు పార్టీలు కలిసి పని చేసేందుకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీతో పాటు జిల్లా స్థాయిలో కూడా కమిటీలు ఉంటే మంచిదని జనసేన భావిస్తోంది. రాష్ట్ర సమన్వయ కమిటీలో ఎవరెవరు ఉండాలి.. జిల్లా కమిటీల్లో ఎవరిని నియమించాలన్న అంశంపైనా చర్చిస్తారు.

జగన్‌ది మూర్ఖపు నిర్ణయం

- 3 రాజధానులపై కేంద్రంతో మాట్లాడలేదు
- బీజేపీ రాష్ట్ర ఇంచార్జ్ సునీల్ దేవ్‌ధర్

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని తరలింపులో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సీఎం జగన్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఇంచార్జ్ సునీల్ దేవ్‌ధర్ మండిపడ్డారు. రాజధాని విషయంలో జగన్ విధానాన్ని బీజేపీ ఖండిస్తోందన్నారు. "మీరు తీసుకునే మూర్ఖపు నిర్ణయాన్ని సమర్థించుకోలేక దానిపై కేంద్రంతో చర్చించామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూడు రాజధానులపై కేంద్రంతో జగన్ కానీ, ఆయన పార్టీ నేతలు కానీ కేంద్రంతో చర్చించలేదు" అని తెలిపారు. రాష్ట్రంలో అటు చంద్రబాబు, ఇటు జగన్ అబద్ధాల ప్రచారంలో దొందూ దొందే అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్లో మాట్లాడిన ఆయన రాజధాని తరలింపును బీజేపీ వ్యతిరేకిస్తోందన్నారు. రాజధానికి కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చిందని, అమరావతిని స్మార్ట్ సిటీగా ఖరారు చేసి, అవుటర్ రింగ్ రోడ్డు కూడా ఇచ్చిందని తెలిపారు. ప్రజలకు ఆమోదయోగ్యంగా, రాష్ట్రానికి ఉపయోగకరంగా పాలకులు నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

తొలి అడుగు ఘనంగా..

బ్లూమ్‌ఫోంటిన్: డిఫెండింగ్ చాంపియన్ భారత్ అండర్-19 వరల్డ్ కప్‌ను ఘనంగా ఆరంభించింది. ఆదివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో ప్రియం గార్గ్ సేన 90 పరుగులతో శ్రీలంకను చిత్తుచేసింది. 298 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక 45.2 ఓవర్లలో 207 రన్స్‌కు ఆలౌటైంది. కెప్టెన్ పెరీరా (50) హాఫ్‌సెంచరీ చేయగా.. రసంత (49), కీపర్ మిషారా (39) రాణించారు. భారత బౌలర్లలో ఆకాశ్ సింగ్ (2/29), సిద్ధేష్‌వీర్ (2/34), రవి బిష్ణోయ్ (2/44) తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 297 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (74 బంతుల్లో 8 ఫోర్లతో 59), కెప్టెన్ ప్రియం గార్గ్ (72 బంతుల్లో 2 ఫోర్లతో 56), ధ్రువ్ జురెల్ (48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 52 నాటౌట్) హాఫ్ సెంచరీలు చేశారు. హైదరాబాదీ క్రికెటర్ తిలక్‌వర్మ (53 బంతుల్లో 3 ఫోర్లతో 46), సిద్ధేష్ వీర్ (27 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 44 నాటౌట్) మెరిశారు. ఆల్‌రౌండర్ సిద్ధేష్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. భారత్ తదుపరి మ్యాచ్‌ను మంగళవారం జపాన్‌తో ఆడనుంది.

సంక్షిప్తస్కోరు

భారత్ అండర్-19: 50 ఓవర్లలో 297/4 (యశస్వీ జైస్వాల్ 59, ప్రియం గార్గ్ 56, ధ్రువ్ జ్యూరెల్ నాటౌట్ 52, తిలక్‌వర్మ 46, డిసిల్వా 1/40, డానియెల్ 1/39, మదుషనక 1/69, నదీషన్ 1/58).

శ్రీలంక అండర్-19: 45.2 ఓవర్లలో 207 (పెరీరా 50, రసంత 49, మిషారా 39, ఆకాశ్‌సింగ్ 2/29, సిద్ధేష్‌వీర్ 2/34, రవిబిష్ణోయ్ 2/44, కార్తీక్ త్యాగి 1/27, సుశాంత్ మిశ్రా 1/34, యశస్వీ జైస్వాల్ 1/18).

బెంగాల్ 366/5... హైదరాబాద్‌తో రంజీ

కోల్‌కతా: మనోజ్ తివారి (156 బ్యాటింగ్) అజేయ శతకంతో బెంగాల్ జట్టు హైదరాబాద్‌తో రంజీలో భారీస్కోరు దిశగా సాగుతోంది. ఆదివారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగాల్ తొలిరోజు ఆట ముగిసేసరికి 5 వికెట్లకు 366 పరుగులు చేసింది. తివారి సెంచరీకి తోడు వికెట్ కీపర్ శ్రీవత్స గోస్వామి (95), మజుందార్ (59) అర్ధ శతకాలతో రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రవికిరణ్ (2/47) రెండు వికెట్లు పడగొట్టగా, రవితేజ, మెహ్దీ హసన్, సాకేత్ సాయిరామ్ తలో వికెట్ తీశారు. క్రీజులో మనోజ్, శ్రేయాన్ చక్రవర్తి (0) ఉన్నారు.

స్మాష్ ఫైట్!

పీబీఎల్ నేటినుంచే

తొలిపోరులో చెన్నైతో హైదరాబాద్ ఢీ ● సింగిల్స్‌లో సింధు X గాయత్రీ గోపీచంద్

ఎప్పటినుంచి ఎప్పటివరకు

జనవరి 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు

పోటీపడుతున్న జట్లు

హైదరాబాద్ హంటర్స్, ముంబై రాకెట్స్, అవధ్ వారియర్స్, పుణె 7 ఏసెస్, చెన్నై సూపర్‌స్టార్స్, బెంగళూరు రాప్టర్స్, నార్త్ ఈస్టర్న్ వారియర్స్.

మొత్తం ప్రైజ్‌మనీ రూ. 6 కోట్లు

విజేతకు రూ. 3 కోట్లు

చెన్నై: స్మాష్ సమరం వచ్చేసింది. ఈ సీజన్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) మొదలయ్యేది సోమవారమే. వచ్చేనెల 9న హైదరాబాద్‌లో జరిగే ఫైనల్‌తో ఈ లీగ్ ముగియనుంది. చెన్నై, హైదరాబాద్, లఖ్‌నవ్ నగరాలు వేదికలుగా మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచ చాంపియన్ పీవీ సింధు, మాజీ వరల్డ్ నెంబర్‌వన్ తై జు యింగ్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయి ప్రణీత్, మహిళల డబుల్స్‌లో ఒలింపిక్ రజత పతక విజేత క్రిస్టీనా పెడెర్సన్‌లాంటి స్టార్లతో ఈసారి లీగ్ కళకళలాడనుంది. తొలిరోజు జరిగే పోరులో ఆతిథ్య జట్టు చెన్నై సూపర్‌స్టార్స్‌తో పీవీ సింధు సారథ్యంలోని హైదరాబాద్ హంటర్స్ తలపడనుంది. ఆరంభ మ్యాచ్‌గా మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ నుంచి సింధు.. చెన్నై తరఫున యువ కెరటం గాయత్రీ గోపీచంద్ పోటీపడనున్నారు. కాగా.. సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ఈసారి పీబీఎల్‌కు దూరంగా ఉన్నారు. సెమీస్, ఫైనల్‌తో కలిపి 15 మ్యాచ్‌లకు హైదరాబాద్ నగరం ఆతిథ్యమివ్వనుంది.

ఓటమి దిశగా దక్షిణాఫ్రికా

పోర్ట్ ఎలిజబెత్: జో రూట్ (4/20) బంతితో మ్యాజిక్ చేయడంతో.. ఇంగ్లండ్‌తో మూడో టెస్ట్‌లో ఫాలోఆన్ ఆడుతున్న ఆతిథ్య దక్షిణాఫ్రికా ఓటమి కోరల్లో చిక్కుకుంది. 208/6తో నాలుగో రోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా.. బ్రాడ్ (3/30) ధాటికి ఓవర్‌నైట్ స్కోరుకు ఒక్క పరుగు మాత్రమే జోడించి 209 రన్స్‌కు ఆలౌటై.. ఫాలోఆన్‌లో పడింది. 290 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన సౌతాఫ్రికా ఆట ముగిసేసరికి 102/6తో ఎదురీదుతోంది. ఫిలాండర్ (4), కేశవ్ మహరాజ్ (0) క్రీజులో ఉన్నారు. రూట్ 4 వికెట్లతో సఫారీల బ్యాటింగ్ వెన్నువిరిచాడు. ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకోవడానికి దక్షిణాఫ్రికా ఇంకా 188 పరుగులు చేయాలి. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 499/9కు డిక్లేర్ చేసింది.

జింబాబ్వే 189/2

హరారే: శ్రీలంకతో ఆదివారం మొదలైన మొదటి టెస్ట్ తొలిరోజు జింబాబ్వే 189/2 స్కోరు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేకు ఓపెనర్లు కసూజా (63), మస్వారే (55).. 96 రన్స్‌తో చక్కటి ఆరంభాన్నిచ్చారు. వీరి తర్వాత ఇర్విన్(55 బ్యాటింగ్), టేలర్(13 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా మొదటిరోజును ముగించారు.

మూడు వన్డేల సిరీస్‌లో ఆఖరి పంచ్ టీమిండియాదే.. తొలి రెండు మ్యాచుల్లో మిస్ అయిన భారీ ఇన్నింగ్స్‌ను స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ సెంచరీ రూపంలో కళ్ల ముందుంచగా అటు చేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ ఎప్పటిలాగే బ్యాట్ ఝుళిపించాడు. ఆఖర్లో శ్రేయాస్ అయ్యర్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆసీస్ బౌలర్లు కుదేలయ్యారు. దీంతో మరో 15 బంతులుండగానే సిరీస్ భారత్ వశమైంది. అంతకుముందు చిన్నస్వామి వికెట్‌పై భారత బౌలర్లు కంగారూలను ఇబ్బందిపెట్టారు. మూడేళ్ల తర్వాత సాధించిన స్మిత్ శతకం ఒక్కటే వారికి ఊరటనిచ్చింది.

చిత్తుగా కొట్టి.. సిరీస్ పట్టి..

ఆఖరి వన్డేలో ఆసీస్‌పై భారత్ విజయం ● రోహిత్ సెంచరీ ● స్మిత్ శతకం వృథా

బెంగళూరు: గతేడాది ఆసీస్ చేతిలో సిరీస్ ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది. ఆదివారం జరిగిన మూడో వన్డేలో రోహిత్ శర్మ (128 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 119) శతకం, విరాట్‌కోహ్లీ (91 బంతుల్లో 8 ఫోర్లతో 89) అర్ధసెంచరీతో 7 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 286 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్ (132 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్‌తో 131) శతకం బాదగా లబుషేన్ (64 బంతుల్లో 5 ఫోర్లతో 54) అర్ధ సెంచరీ సాధించాడు. షమికి నాలుగు, జడేజాకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో భారత్ 47.3 ఓవర్లలో 3 వికెట్లకు 289 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (35 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 44 నాటౌట్) వేగంగా ఆడాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా కోహ్లీ నిలిచారు.

రోహిత్ శతకం: ఓ మాదిరి ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ కదం తొక్కాడు. అయితే ధవన్ గాయం కారణంగా రాహుల్ (19) ఓపెనర్‌గా బరిలోకి దిగినా 13వ ఓవర్‌లో అతడిని అగర్ ఎల్బీగా అవుట్ చేశాడు. అయితే రోహిత్, కోహ్లీ ఆసీస్ బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం చూపారు. స్టమ్యిక్‌ను రొటేట్ చేసుకుంటూ ఈ ఇద్దరు స్టార్ బ్యాట్స్‌మెన్ దూసుకెళ్లారు. ఆరంభంలో కొద్దిసేపు ఆచితూచి ఆడినా వీలు చిక్కినప్పుడల్లా రోహిత్ భారీ సిక్సర్లతో బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దీంతో 110 బంతుల్లో అతడు శతకం పూర్తి చేశాడు. ఆతర్వాత 36వ ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన కోహ్లీ 57 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. కానీ మరుసటి ఓవర్‌లోనే జంపా కీలక వికెట్ తీశాడు. రోహిత్ స్వీప్ షాట్‌తో సిక్సర్‌కు ప్రయత్నించగా మిడ్ వికెట్‌లో స్టార్క్ రన్నింగ్ క్యాచ్ తీసుకోవడంతో రెండో వికెట్‌కు 137 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ శ్రేయాస్ అయ్యర్ వరుస బౌండరీలతో చెలరేగి లక్ష్యాన్ని వేగంగా తగ్గించాడు. విజయానికి 13 పరుగుల దూరంలో కోహ్లీని హాజెల్‌వుడ్ బౌల్డ్ చేసినా ఎలాంటి ఇబ్బందీ ఎదురుకాలేదు.

స్మిత్, లబుషేన్ సెంచరీ భాగస్వామ్యం: వరుసగా మూడో వన్డేలోనూ టాస్ గెలిచిన ఆసీస్ అనూహ్యంగా బ్యాటింగ్‌ను ఎంచుకుంది. అయితే ఓపెనర్లు వార్నర్ (3), ఫించ్ (19) ఈసారీ విఫలం కాగా ఆపద్బాంధవుడు స్మిత్ కెరీర్‌లో తొమ్మిదో శతకంతో జట్టును ఆదుకున్నాడు. సరిగ్గా మూడేళ్ల క్రితం కూడా జనవరి 19నే అతడు 8వ సెంచరీ చేయడం విశేషం. రెండో వన్డేలో 98 పరుగులు చేసిన స్మిత్ ఈసారి పట్టుదలగా క్రీజులో నిలిచాడు. లబుషెన్-స్మిత్ మూడో వికెట్‌కు 127 పరుగుల భాగస్వామ్యం అందించారు. అయితే చివరి 10 ఓవర్లలో పుంజుకొన్న భారత బౌలర్లు ఆసీస్ భారీ స్కోరు చేయకుండా అడ్డుకోగలిగారు. డెత్ ఓవర్లలో చెలరేగిన షమి మొత్తం 4 వికెట్లతో కట్టడి చేశాడు. ఆరంభంలో వార్నర్‌ను అవుట్ చేసి షాక్ ఇచ్చాడు. ఫించ్, స్మిత్ కలిసి కుదురుకున్న దశలో సమన్వయ లోపంతో కెప్టెన్ రనౌట్ కావాల్సి వచ్చింది. ఈ దశలో స్మిత్, లబుషేన్ ఆసీస్‌ను ఆదుకున్నారు. కానీ 32వ ఓవర్‌లో జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. మరో మూడు బంతుల తర్వాత స్టార్క్ డకౌట్ అయ్యాడు. ఈ సమయంలో స్మిత్‌కు కేరీ (35) జత కలిశాడు. కానీ ఐదో వికెట్‌కు 58 పరుగులు జోడించాక కుల్దీప్ బౌలింగ్‌లో కేరీ అవుటయ్యాడు. అటు 117 బంతుల్లో సెంచరీ సాధించిన స్మిత్ ఆతర్వాత దూకుడు పెంచాడు. 46వ ఓవర్‌లో హెలికాప్టర్ షాట్‌తో సిక్సర్ బాదాడు. మరుసటి ఓవర్‌లోనే వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. ఈ దశలో షమి 48వ ఓవర్‌లో స్మిత్, కమిన్స్‌ను అవుట్ చేయగా తన మరుసటి ఓవర్‌లో జంపాను పెవిలియన్‌కు చేర్చడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

వన్డేల్లో వేగంగా (217 ఇన్నింగ్స్) 9వేల పరుగులు పూర్తి చేసిన మూడో బ్యాట్స్‌మన్‌గా రోహిత్. కోహ్లీ (194), డివిల్లీర్స్ (208) ముందున్నారు. అలాగే వన్డేల్లో అత్యధిక శతకాల జాబితాలో సచిన్ (49), కోహ్లీ (43), పాంటింగ్ (30) తర్వాత రోహిత్ (29) నిలిచాడు.

చేజింగ్‌లో తక్కువ ఇన్నింగ్స్ (133)లోనే 7వేల పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లీ.



స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: వార్నర్ (సి) రాహుల్ (బి) షమి 3; ఫించ్ (రనౌట్) 19; స్మిత్ (సి) శ్రేయాస్ (బి) షమి 131; లబుషేన్ (సి) కోహ్లీ (బి) జడేజా 54; స్టార్క్ (సి) సబ్ చాహల్ (బి) జడేజా 0; కేరీ (సి) శ్రేయాస్ (బి) కుల్దీప్ 35; టర్నర్ (సి) రాహుల్ (బి) సైనీ 4; అగర్ (నాటౌట్) 11; కమిన్స్ (బి) షమి 0; జంపా (బి) షమి 1; హాజెల్‌వుడ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 27; మొత్తం: 50 ఓవర్లలో 286/9. వికెట్ల పతనం:** 1-18, 2-46, 3-173, 4-173, 5-231, 6-238, 7-273, 8-276, 9-282. **బౌలింగ్:** బుమ్రా 10-0-38-0; షమి 10-0-63-4; సైనీ 10-0-65-1; కుల్దీప్ 10-0-62-1; జడేజా 10-1-44-2.

భారత్: రోహిత్ (సి) స్టార్క్ (బి) జంపా 119; రాహుల్ (ఎల్బీ) అగర్ 19; కోహ్లీ (బి) హాజెల్‌వుడ్ 89; శ్రేయాస్ (నాటౌట్) 44; మనీశ్ పాండే (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 47.3 ఓవర్లలో 289/3. వికెట్ల పతనం:** 1-69, 2-206, 3-274. **బౌలింగ్:** కమిన్స్ 7-0-64-0; స్టార్క్ 9-0-66-0; హాజెల్‌వుడ్ 9.3-1-55-1; అగర్ 10-0-38-1; జంపా 10-0-44-1; లబుషేన్ 1-0-11-0; ఫించ్ 1-0-9-0.

కోహ్లీ ప్రపంచ రికార్డు

కెప్టెన్ విరాట్ కోహ్లీ ఖాతాలో మరో ప్రపంచ రికార్డు చేరింది. వన్డే ఫార్మాట్‌లో అత్యంత వేగంగా ఐదు వేల పరుగులు పూర్తి చేసిన సారథిగా ఎంఎస్ ధోనీని కోహ్లీ అధిగమించాడు. మూడో వన్డేలో 17 పరుగుల వ్యక్తిగత స్కోరుకు చేరగానే కోహ్లీ ఈ రికార్డును అధిగమించాడు. అయితే దీనికోసం ధోనీ 127 ఇన్నింగ్స్ తీసుకోగా కోహ్లీ 82 ఇన్నింగ్స్‌లోనే పూర్తి చేశాడు. భారత్ నుంచి ధోనీ (6641), అజరుద్దీన్ (5239), గంగూలీ (5104) తర్వాత కోహ్లీ నాలుగో కెప్టెన్‌గా నిలిచాడు. మొత్తంగా చూస్తే కోహ్లీ ఎనిమిదో కెప్టెన్.

విరాట్ సూపర్ క్యాచ్

అర్ధ సెంచరీతో ఊపు మీదున్న లబుషేన్‌ను కెప్టెన్ విరాట్ కోహ్లీ కళ్లు చెదిరే క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చడం ఆకట్టుకుంది. జడేజా వేసిన ఇన్నింగ్స్ 32వ ఓవర్‌లో లుబుషేన్ కవర్స్ దిశగా బౌండరీ బాదాలనుకున్నాడు. అయితే అక్కడే కాచుకుని ఉన్న కోహ్లీ మెరుపు వేగంతో అనూహ్యంగా తన కుడి వైపునకు సమాంతరంగా డైవ్ చేస్తూ క్యాచ్ పట్టేశాడు. దీంతో ఆశ్చర్యపోతూ లబుషేన్ క్రీజును వదిలాడు.

అయ్యో.. ఫించ్

ఆసీస్ ఇన్నింగ్స్‌లో స్టీవ్ స్మిత్ తొందరపాటుకు కెప్టెన్ ఆరోన్ ఫించ్ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో షమి వేసిన బంతిని స్మిత్ బ్యాక్‌పర్డ్ పాయింట్ వైపు కొట్టి ఫించ్‌ను సింగిల్ కోసం పిలిచాడు. అయితే అక్కడ బంతిని జడేజా పట్టుకోవడంతో వెంటనే స్మిత్ వెనక్కి వచ్చి క్రీజులోకి డైవ్ చేశాడు. అయితే అప్పటికే వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చిన ఫించ్ కూడా స్ట్రయికర్ ఎండ్ వద్దే ఉన్నాడు. కానీ జడేజా విసిరిన బంతి వికెట్లకు తాకకపోవడంతో వెంటనే ఫించ్ నాన్‌స్ట్రయిక్ ఎండ్‌వైపు పరిగెత్తాడు. అప్పటికే అయ్యర్ విసిరిన బంతిని పట్టుకున్న షమి వికెట్లను గిరాటేయడంతో ఆసీస్ అనవసరంగా వికెట్ కోల్పోయి నట్టయింది. లేని పరుగు కోసం పిలిచి వికెట్ కోల్పోవడానికి కారణమైన స్మిత్‌పై అసహనంతో ఫించ్ ఆగ్రహంగా పెవిలియన్‌కు చేరుకున్నాడు.

కివీస్ టూర్‌కు డౌటే

రెండో వన్డేలో పక్కటెముకలకు బంతి తగిలి ఫీల్డింగ్‌కు దూరమైన ఓపెనర్ ధవన్ ఈ మ్యాచ్‌లోనూ గాయపడ్డాడు. దీంతో అతడు బ్యాటింగ్ చేయలేకపోయాడు. ఆసీస్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో ఫించ్ ఆడిన షాట్‌ను కవర్ పాయింట్‌లో అడ్డుకునేందుకు ధవన్ డైవ్ చేశాడు. దీంతో అతడి ఎడమ భుజం గట్టిగా నేలకు తాకడంతో బాధతో విలవిల్లాడాడు. వెంటనే మైదానం వీడిన ధవన్ స్కానింగ్ కోసం ఆస్పత్రికి వెళ్లాడు. అయితే, సోమవారం కివీస్ టూర్‌కు వెళ్లనున్న భారత జట్టులో ధవన్ ఉండే అవకాశం లేదు. అతడి రిపోర్ట్స్ పరిశీలించాకే తుది నిర్ణయం తీసుకోనున్నారు.

రికార్డుల వేటలో..

నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ కొత్త దశాబ్దిని గ్రాండ్‌గా ఆరంభించాలనుకుంటున్నాడు. సోమవారం నుంచి జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. మరోవైపు మార్గరెట్ కోర్ట్ 24 గ్రాండ్‌స్లామ్‌ల రికార్డుకు అడుగు దూరంలో ఉన్న 38 ఏళ్ల అమెరికా టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్.. ఈసారి ఆ రికార్డును సమం చేయాలన్న పట్టుదలతో ఉంది. ఇక టాప్ సీడ్ నడాల్, స్విస్ దిగ్గజం ఫెడరర్ కూడా బరిలో నిలవడంతో కొత్త తరానికి మరింత పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. 2010తో పోల్చితే 2020 పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఫెడెక్స్, నడాల్ నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను పంచుకుంటే.. సెరెనా ఆస్ట్రేలియన్, వింబుల్డన్ ట్రోఫీలను సొంతం చేసుకుంది. పదేళ్ల తర్వాత కూడా బిగ్-3 టాప్ ర్యాంక్‌లకు ఎటువంటి ఢోకా లేకపోవడం వారి ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది. 2017లో సెరెనా ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన తర్వాత 9మంది మహిళలు గ్రాండ్‌స్లామ్ చాంపియన్లుగా నిలిచారు. పురుషుల్లో కొత్తరక్తం అంతగా కనిపించకపోయినా.. మహిళల్లో మార్పు స్పష్టంగా ఉంది. ఇక.. తొలిరౌండ్‌లోనే పాత, కొత్త తరాలు తలపడనున్నాయి. గతేడాది క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన సెరెనా.. తన దేశానికే చెందిన 15 ఏళ్ల కొకో గాఫ్‌తో ఆడనుంది. ఇక డిఫెండింగ్ చాంప్ ఒసాకా నూతన ఏడాదిలో శుభారంభం చేయాలనుకుంటోంది. నెం.1 ఆష్లే బార్టీ సొంతగడ్డపై టైటిల్‌తో మెరవాలనుకుంటోంది. కార్చిచ్చు కారణంగా మెల్‌బోర్న్ పొగమయం కావడంతో.. ఆటగాళ్లకు ఇబ్బందులు ఎదురైనా టోర్నీ సమయానికి నిర్వాహకులు పరిస్థితులను చక్కదిద్దగలిగారు.

'లిఫ్టింగ్'లో ఏపీకి కాంస్యం

ఖేలో ఇండియా

కడప (స్పోర్ట్స్): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కడప స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన మెహబూబా చాంద్ కాంస్య పతకం సాధించింది. కడప జిల్లా కమలాపురం మెహబూబా స్వస్థలం. వీరిది వ్యవసాయ కుటుంబం. ఆదివారం గువాహటిలో జరిగిన బాలికల అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ 64 కిలోల పోటీల్లో మెహబూబా తృతీయ స్థానంలో నిలిచింది. స్నాచ్‌లో 64 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 80 కిలోలు, మొత్తంగా 144 కిలోల బరువు ఎత్తి కాంస్యం అందుకుంది. బాలికల అండర్-17 స్విమ్మింగ్ 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో విజయవాడ అమ్మాయి ఇషిరా బెనర్జీ ఒక్క సెకన్ తేడాతో కాంస్య పతకం కోల్పోయింది. ఇషిర 1 నిమిషం 11 సెకన్లలో రేసును పూర్తి చేయగా, కిరణ్ నారియేకర్ (కేరళ) 1 నిమిషం 10 సెకన్ల రేసును ముగించి కాంస్యం ఎగరేసుకుపోయింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.